ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం


Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 7 ఏప్రిల్ 2023 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి

# ఉత్సాహంగా ఉగాది కవి సమ్మేళనం


ఆనందాచారి


వెంకటేశ్వర్లు


బాలాంత్రపు ప్రసూన


అరసవిల్లి కృష్ణ


సత్యాజీ


అనిల్ డ్యానీ


శాంతిశ్రీ


హైమావతి

శోభకృతు ఉగాది కవిసమ్మేళనం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో వీనుల విందుగా జరిగింది. మార్చి 22వ తేదీ ఉదయం జాషువా సాంస్కృతిక వేదిక, సాహితీ స్రవంతి, విరసం, అరసం తదితర సాహితీ కళా సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణా సాహితి అధ్యక్షులు కె. ఆనందాచారి ముఖ్య అతిథిగా మాట్లాడారు. వర్తమాన సమాజపు గొంతును కవులు వినిపించాలని, ఒక కీలకమైన చారిత్రిక బాధ్యత నిర్వర్తించాల్సిన సందర్భంలో నేడు మనం ఉన్నామని అన్నారు. ఇంకా ప్రముఖ సాహితీ వేత్తలు బూసురుపల్లి వెంకటేశ్వర్లు, బాలాంత్రపు ప్రసూన, అరసవిల్లి కృష్ణ మాట్లాడారు.

అనంతరం అనిల్ డ్యానీ, పరుచూరి అజయ్, శాంతిశ్రీ నిర్వహణలో కవిసమ్మేళనం జరిగింది. పలువురు కవులు, కవయిత్రులు పాల్గొని తమ కవితలను వినిపించారు. డాక్టర్ వెన్నా వల్లభరావు, మాజీ ఎమ్మెల్యే పుతుంభాక భారతి, మందవరపు హైమవతి, వడ్లమూడి పద్మ, గోళ్ల నారాయణరావు, గుండు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం, విశాఖపట్నం తదితర చోట్ల కూడా సాహితీ స్రవంతి ఆధ్వార్యాన కవిసమ్మేళనాలు జరిగాయి.


యువకవి చిన్మయి


వడ్లమూడి పద్మ


పుతుంబాక భారతి, వెన్నా వల్లభరావు తదితరులు

సాహిత్య ప్రస్థానం

ఏప్రిల్ 2023
సంపుటి : 4 సంచిక : 7

# మతవాద మలుపు?

**రా**జమౌళి ఆర్‌ఆర్‌ఆర్‌లో నాటునాటు పాటకు ఆస్కార్ పురస్కారం లభించడం పట్ల తెలుగువాళ్లు సంతోషించడం సహజం. ఆస్కార్ ఎంపిక జరిగే తీరు పట్ల, హాలీవుడ్ ప్రధాన భావజాలం పట్ల దశాబ్దాలుగా చాలా విమర్శలున్నాయి గాని చంద్రబోస్ పాట, కీరవాణి బాణీ పురస్కారం పొందడం అభినందనీయమే. ఈ తరుణంలో అందరికీ జయహో అన్న రహ్మాన్ పాట, అభ్యుదయ భావుకుడు గుల్జార్ కవనం కూడా పురస్కారం పొందిన సన్నివేశం గుర్తుకు వస్తుంది. నాటి వలసపాలన దురహంకారాన్ని ధిక్కరిస్తూ తెలుగు గ్రామీణ ప్రయోగాలతో రూపొందిన పాట కావడం ఇక్కడ విశేషం. ఆర్‌ఆర్‌ఆర్ కథ కల్పితం కావడం ఒకటైతే అది కూడా వీరులైన అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్‌ల జీవితాలను ఊహలతో నింపడం మర్చిపోకూడదు. ఇప్పుడు కేంద్రంలోని పాలకపక్షం చెబుతున్న రామ రాజకీయం తరహాలో కథలో అల్లూరి పాత్రధారికి రామముద్ర వేయడానికి ప్రయత్నించడం కూడా మేధావులైన రచయితలు, కళాకారులు గమనంలో పెట్టుకోవాలి. ఈ కల్పనలో రెండు తెలుగు రాష్ట్రాల సోదర భావన పెంపొందించే లక్ష్యం స్వాగతించదగినదే. అయితే ఇప్పుడు కొన్ని సంస్థలు చెప్పే మతతత్వ సంప్రదాయ ఛాయలు లౌకికభావనను బలోపేతం చేసేవి కావు. పైగా ఇదే చిత్ర రచయిత విజయేంద్ర ప్రసాద్‌ను కేంద్రం రాజ్యసభకు నామినేట్ చేయడం, ఆయన ఆరెస్సెస్‌పై కథను రూపొందించడం, దాన్ని చదివి గుండెలు బరువెక్కాయని రాజమౌళి ప్రకటించడం కూడా తెలుగు చిత్ర సీమలో మితవాద, మతవాద మలుపును సూచిస్తున్నాయి. రోజులు మారాయి, పల్లెటూరు, మాభూమి వంటి గొప్ప సామాజిక చిత్రాలందించిన తెలుగు తెరకు ఈ రైట్ టర్న్ వాంఛనీయం కాదు. కాశ్మీర్ ఫైల్స్‌ను కూడా ఆస్కార్‌కు పంపడం ఇప్పటి సినిమాపై ఒత్తిళ్లకు నిదర్శనం. వీటన్నిటి మధ్య షారుఖ్‌ఖాన్ పఠాన్ ఘన విజయం ఇలాటి వారికి ఒక పాఠమైంది.

తెలుగు సినిమా భారీతనం సంతరించుకుని ప్రపంచ వ్యాప్త విజయాలు సాధించడం హర్షణీయమే. అయితే ఆ క్రమంలో వాస్తవికత కోల్పోయి లేనిపోని హంగుల వెంటపడటం, నేల విడిచి సాము చేయడం, కులమత భావనలను సంస్కృతి పేర నెత్తినెత్తుకోవడం స్వాగతించలేము. ఆదిపురుష్ లో రాముడి వేషధారణను భక్తులు జీర్ణించుకోలేకపోతున్నారంటే ఈ ధోరణి ఎక్కడకు చేరిందీ తెలుస్తుంది. కాశ్మీర్‌ఫైల్స్ చిత్ర బృందాల వంటివి నేరుగా తెలుగులోనూ సినిమాలు తీస్తున్న వాస్తవం మర్చిపోలేము. భావ ప్రకటనాస్వేచ్ఛను తప్పక సమర్థించాలి గాని అది ప్రజల మధ్య సామరస్యాన్ని, సమభావనను పెంపొందించేదిగా వుండాలి. కోల్‌కతా చిత్రోత్సవంలో అమితాబ్ బచన్ చెప్పినట్టు భారతీయ సినిమా ఒకనాటి మానవతా భావన వదలి మతభావనల వైపు మరలడం తిరోగమనమూ ఆందోళనకరమూ అవుతుంది. ■

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్
◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2023

### కథలు


గేటెడ్ ... : కె.ఉషారాణి ................ 5
మెరిసేవన్నీ ... : శనగవరపు శిరీష ...... 19
గరళం : చాగంటి ప్రసాద్ .......... 32
అతనెవరు? : అను : రంగనాథ రామచంద్రరావు 52


### కవితలు


అనంత శ్రమ : మెట్టా నాగేశ్వరరావు ........ 9
అక్కడ బూమెలున్నాయట! : కవితా శ్రీ ................... 13
ఈ ఆకాశం మాది! : చొక్కర తాతారావు .......... 14
పొద్దుపోతున్న దిక్కు : బొప్పన వెంకటేష్ .......... 21
ఐదో గది కావాలి! : సత్య చాగంటి .............. 21
అయినా, ఒక పిలుపు : పలమనేరు బాలాజీ ....... 22
విశ్వాంతరాల్లో .... : స్వప్న మేకల ................ 27
అసూయ : రావుల దయాకర్ .......... 27
కొత్త రెక్కలు : చిన్ని నారాయణ రావు ..... 28
రూపకం : ఈ.రాఘవేంద్ర ........... 28
న్యాయం ఎలా? : కొమురవెల్లి అంజయ్య .... 31
ఎవరైనా ఉన్నారా? : అమూల్య చందు .......... 31
కావ్ .. కావ్ ... : గిరి ప్రసాద్ చెలమల్లు ..... 35
ఆమె సమున్నత పతాకం! : కెఆర్ఎస్.సుబ్బరావమ్మ ... 36
ప్చ్ ... : డా. దారల విజయకుమారి 39
ముప్పాతిక భాగం : పద్మావతి రాంభక్త ....... 43
దిసమొల : సుధా మురళి ............... 43
వనకాంతలు : ప్రభాజ్యోత్స్న ............... 48
కమలాదాస్ కవితలు : పి.శ్రీనివాస్ గౌడ్ ........... 51
అమరిక : అనూరాధ బండి .......... 56
పెనుగాలి వీస్తోంది! : అడిగోపుల వెంకటరత్నం ... 56


### వ్యాసాలు


సాహిత్యంలో సాఫ్ట్‌వేర్ వసంతం
– ఎమ్వీ రామిరెడ్డి .................... 10
ఆధునిక కవిత్వంలో మానవతా విలువలు
– డాక్టర్ కల్లూరి ఆనందరావు ..... 15
విప్లవ, చారిత్రిక నవల 'డిసెంబ్రియస్టు ఖైదీ'
– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ..... 23
ఉదయ గీతిక .. ఉత్తేజ పతాక
– చెరుకూరి సత్యనారాయణ ....... 29
రావిశాస్త్రి 'కార్నర్ సీటు' కథ – పాత్రల్లో కథాత్మకత
– డాక్టర్ రవీంద్రబాబు .............. 37
ముఖాముఖి : కాలానుగుణంగా సాహిత్య సృజనలో కొత్తదనం
– ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ 40
సమ్మోహన కవిత్వం .. 'మోహనదీ తీరమ్మీద నీలిపదవ'
– కెంగార మోహన్ .................. 44
వర్తమానం: గొంతు నొక్కుతున్న గోడీ మీడియా
– వి.బి.పరమేశ్వరన్ ............... 46
వీరబ్రహ్మం 'కాళికాంబ సప్తశతి' – సమాజ శ్రేయస్సు
– డాక్టర్ జి.శైలమ్మ ................. 49
సాహితీ ప్రజ్ఞ ................................................ 55
పర్యటన : ప్రకృతి ఒడిలో పయనం .. కూర్గు విహారం
– డా. నాగసూరి వేణుగోపాల్ .... 57
బహుముఖ ప్రతిభాశాలి రచయిత్రి కె రామలక్ష్మి
– తెలకపల్లి రవి .................. 60
అనిర్వచనీయ భావుకుడు ఎమ్వీ రామిరెడ్డి
– నాగరాజు, మదన్ మోహన్ ... 62
పుస్తకాలు ................................................ 65



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# గేటెడ్ ...

- కె.ఉషారాణి
94928 79210

**ఐ**దేళ్ల క్రితం మాట ఇది.

కాఫీకన్నా ముందే వార్తాపత్రిక రాకపోతే ఆయనకు ఏమీతోచదు. కాలుగాలిన పిల్లిలాగా ఆ వరండాలోనే పచార్లు చేస్తారు. పాలు పొంగగానే డికాక్షన్‌లో కలిపి ఆ వాసనని ఆస్వాదిస్తూ ఆయనెదురుగుండా సోఫాలో కూచున్నాను. కాఫీ తాగుతూ 'ప్రపంచం మీ ముందుకి ఇంకా రాలేదా' అని ఆట పట్టిస్తున్న సమయంలో వచ్చి పడింది సుప్రభాత నేస్తం. వస్తూ వస్తూ తనతో పాటు ఓ పాంఫ్లెట్ కూడా తెచ్చింది. పత్రిక ఉన్న ప్రేమ, పత్రిక తెచ్చే అనుబంధాల మీద ఆయనకి ఆసక్తి లేదు. ఆ పాంఫ్లెట్‌ని పక్కన పడేశారు. నేను దాన్ని చేతిలోకి తీసుకున్నాను. అదో వెంచర్‌కి సంబంధించిన కరపత్రం.

అప్పటికి ఆయన రిటైరై రెండు నెలలు అయింది. రావల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలు అన్నీ చేతికి వచ్చాయి. నెలనెలా పెన్షన్ వస్తుంది. పిల్లలిద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అబ్బాయి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్నాడు. కోడలు కూడా అక్కడే. ఇద్దరూ ఒకే కంపెనీలో పనిచేస్తున్నారు. ఇంకా పిల్లలు లేరు. అమ్మాయి, అల్లుడు కాలిఫోర్నియాలో ఉన్నారు. అక్కడే ఇల్లు కొనుక్కున్నారు. ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరూ చదువుకుంటున్నారు. మాకు పెద్దగా టెన్షన్ పడే విషయాలు లేవు.

ఆయన ఉద్యోగం చేసినన్నాళ్లూ పగలూ రాత్రీ తేడా తెలిసేది కాదు. వెళ్లడమేకాని రావడానికి ఠికాణా లేని బ్యాంకు ఉద్యోగం. నేను ఒక్కర్తినీ విజయవాడలో ఉండి పిల్లలను చదివించుకున్నాను. ఇప్పుడే రిటైరైన తర్వాత ఇద్దరం కలిసి కాలం గడపడం. చక్కగా కలిసి ఏ హడావుడి లేకుండా టిఫిన్ తినడం, మధ్యాన్నం వేడి వేడి అన్నం తినడం... రోజూ పండుగలాగా ఉంది.

❖❖❖

ఆ కరపత్రం చదివాక మనసు ఎటో తేలిపోయింది. అది 'జీవన' కన్‌స్ట్రక్షన్ వారు వేస్తున్న కొత్త వెంచర్. వారు కడుతున్నది 20 అంతస్తుల భవనం. రకరకాల సైజుల్లో 200 పై చిలుకు ఫ్లాట్స్. వెనక ఇండిపెండెంట్ విల్లాలు. మేముండేది బెంజ్ సర్కిల్ దగ్గర. ఈ వెంచర్ కూడా దగ్గరగా ఉన్న పోరంకిలో. వెంచర్ ప్రత్యేకతలలో స్కై గేజర్, అతిథుల కోసం గెస్ట్ హౌస్, టేబుల్ టెన్నిస్ కోర్టు, ఇరవై ఒకటో అంతస్థులో స్విమ్మింగ్ పూల్, నడక కోసం ప్రత్యేకమైన ట్రాక్. కింద ఒక జిమ్, డాక్టర్ సేవలు ప్రతి రోజు అందుబాటులో ఉంచడం కోసం గది, ఒక లైబ్రరీ, వంట చేసుకోవడానికి బద్దకిస్తే అందుబాటులో ఒక ఫుడ్‌కోర్టు, కమ్యూనిటీ హాల్, చుట్టూ గార్డెన్స్, గ్రీనరికి కొదవలేకుండా. ఆహ్లాదకరమైన వాతావరణం.

ఇది చదివాక మేముంటున్న మా ఫ్లాట్ చాలా చిన్నదిగా, ఏ సౌకర్యాలూ లేనట్టుగా అనిపించడం మొదలైంది. ఈ ఫ్లాట్‌లో 20 ఏళ్ల నుంచి ఉంటున్నాం. ఈ మాత్రం సౌకర్యంగా ఉండడమే గొప్పగా అనిపించింది. విజయవాడలో ఇల్లు ఒక గది వెనక గది ఉండేది. అందువల్ల ఈ రెండు బెడ్ రూమ్‌ల ఫ్లాట్ బాగా నచ్చింది. ఇప్పటి పరిస్థితి వేరు కదా. కాస్తంత జీవితం సుఖవంతంగా, సౌందర్యవంతంగా గడపాలని తాపత్రయం. ఒక సారి 'జీవన'కి వెళదామని తనతో అన్నాను. ఒక వారం రోజులు ఆయన నా మాటను పట్టించుకోలేదు. చివరికి ఓరోజు సరే అన్నారు. నా ఉత్సాహానికి అంతే లేదు. గబగబా వంట చేసి పక్కన పెట్టి, బయల్దేరాం. ఇప్పుడు మేమున్నది ఒకటో అంతస్థులో. ఇరవయ్యో అంతస్థులో ఉండడం అంటే గాలిలో

తేలిపోతున్నట్టు ఉండదూ! ఉల్లాసంగా ఊహల్లో ఎగిరి పోయాను నేను.

మేం వెళ్ళగానే రిసెప్షన్‌లో అమ్మాయి వచ్చి సోఫాలో కూచో మంది. చల్లని మంచినీళ్ళిచ్చింది. వెంటనే వాళ్ళ మార్కెటిం గ్ మేనేజర్ వచ్చారు మా కోసం. కాఫీ తీసుకుంటారా, టీ తీసుకుం టారా అంటూనే బ్రోచర్ తీసుకుని వెంచర్‌లోని సౌకర్యాలు వర్ణించడం మొదలు పెట్టారు. ఖరీదు అరవై లక్షల రూపాయలు. అతను చెబుతున్నవన్నీ ఊహిస్తుంటే రాత్రిపూట అన్నం తిని ఇరవై ఒకటో అంతస్థులో కూచుని వినీలాకాశంలో నక్షత్ర మాలని చూస్తున్నట్టు, కావాల్సిన పత్రికలన్నీ లైబ్రరీలో రూపాయి ఖర్చు లేకుండా చదివేస్తున్నట్టు, సాయంత్రం అయ్యేసరికి వాకింగ్ ట్రాక్‌లో నడి చేస్తున్నట్టు, ఒకరిద్దరు చుట్టాలు వచ్చినా ఇబ్బంది పడకుండా రిజర్వు చేసుకున్న గెస్ట్ రూమ్‌లో వాళ్ళని దింపినట్టు, సాయంత్రాలు ఈయన జిమ్‌లో కసరత్తులు చేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుని ఫ్రెష్‌గా ఉన్నట్టు సినిమా కనిపించింది. కమ్యూనిటీ హాల్లో పిల్లల ఫంక్షన్స్ చేసేస్తున్నట్టు, కాఫీ తాగుతూ తన్మయత్వంలో తేలిపోయాను. అన్నీ విని ఇంటికి వచ్చాము.

'వాళ్ళు చెప్పేవన్నీ సినిమా రీల్‌లో చూడకు. అమ్ముకోటానికి వంద చెప్తారు. అందులో వాస్తవాలెనో..' అంటూ డిస్కరేజ్ చేశారు నాకు మాత్రం ఈ వెంచర్ నచ్చింది. పైగా అకౌంట్ లో గలగలలు మరోవైపు ఉత్సాహపరుస్తూనే ఉన్నాయి. రోజుకోసారైనా మారాల్సిన అవసరాన్ని ఆయన దృష్టికి తెస్తున్నాను. ఇల్లు పాతదయింది, రిపైర్లు చేయించాలి అని, పిల్లలు వస్తే ఇరుకుగా ఉంటుందని; ఊరి మధ్యలో దుమ్ము ధూళి ఎక్కువ అని, చుట్టూ అపార్టుమెంట్లు ఎక్కువయి గ్రీనరీ లేదని. ఇంటిమీద ఇల్లు వచ్చేయడంతో ప్రైవసీ లేదని ... ఇలా. ఇందుకు తోడు మార్కెటింగ్ మేనేజర్ చేసే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు.

చివరికి ఒకరోజు సరే, పద అన్నారు. ఆలోచన మారకుండా ఉండాలని నేను చెక్‌బుక్ బాగ్‌లో వేసుకుని బయలు దేరా. మళ్ళీ మార్కెటింగ్ మేనేజర్ వచ్చి కూచున్నాడు. ఎంతో తెలిసిన వాళ్ళలాగా ఆప్యాయంగా పలకరించారు. మంచినీళ్లు, కాఫీ మామూలే. ఈసారి మోడల్ ఫ్లాట్ చూపించారు. అయితే దాని ఖరీదు రెండు కోట్లు. మేము తీసుకోగలిగింది అన్నిటికన్నా చిన్న సైజు ఫ్లాట్. ఏం లేదమ్మా. దీనికన్నా ఆ గదులు కాస్త చిన్నవిగా ఉంటాయి. అంతే. అదేం పెద్ద విషయం కాదన్నట్టు చెప్పారు. ఎదురుగా ఉండే ఫ్లాట్‌లకి మధ్య వరండా ఎనిమిది అడుగులు ఉంటుందన్నాడు. ఫరవాలేదు. విశాలంగానే ఉందనిపించింది. సహజంగా గాలి, వెలుతురు గదుల్లోకి వచ్చేటట్టు రూపొందించ డమే వాళ్ళ ప్రత్యేకత అని చెప్పారు .

ఈసారి ఈయన కూడా సంతృప్తిగా చూసారు నావైపు.

కొందామని నిశ్చయానికి వచ్చాం.

మోడల్‌లో పదిహేనో అంతస్తు అయితే బాగుంటుందని అనుకున్నాం. పశ్చిమానికుండే, కార్నర్ ఫ్లాట్ అడిగాం. అది, పదిహేనో అంతస్థులో లేదని, పద్నాలుగులో ఉందని అన్నారు. రాజీపడ్డాం. అడ్వాన్స్ పది శాతం ఇవ్వాలన్నారు. చెక్ రాసి ఇచ్చాం. అగ్రిమెంట్ పది రోజుల్లో తయారు చేయిస్తాం. వచ్చి సంతకాలు తీసుకుంటానని చెప్పారు. హుషారుగా ఇంటికొచ్చాము. ఆకాశం లో విహరిస్తున్న ఫీల్. స్విమ్మింగ్ పూల్ పక్కన కూచుని ఐస్ క్రీం తింటున్న ఊహ. ఇక ఏ రిసార్ట్‌కో వెళ్ళక్కరలేదు. మా అపార్ట్మెం ట్లోనే ఎంజాయ్ చేయవచ్చన్న భావన ఉక్కిరిబిక్కిరి చేసింది.

పది రోజులయ్యాయి. నెలరోజులయ్యాయి. ఆ కంపెనీ నుంచి మాటామంతీ లేదు. ఈయనా, నేనూ కలిసి వెళ్ళాం. ఎంతో గౌరవంగా ఆహ్వానించారు. చిన్న అడ్మినిస్ట్రేటివ్ సమస్య వల్ల ఆలస్యమైందని క్షమాపణ కోరారు. ఒక పెద్ద పత్రాల కట్ట మా ముందు పెట్టారు. కాఫీ వచ్చింది. పేజీలు తిప్పుతూ సంతకాలు పెట్టించుకున్నారు. ఇన్‌స్టాల్మెంట్లు చెల్లించాల్సిన గడువులు చూసాం. సందేహాలు తీర్చుకునే సరికి చాలా సమయం పట్టింది. మాకు చెప్పినది రూ.60 లక్షలే . కానీ ఇందుకు పార్కింగ్ స్థలానికి, కార్నర్ ప్లేట్‌కి, పశ్చిమ ద్వారానికి, జిఎస్‌టికి , రెండేళ్లకు గాను మెయింటెనెన్స్, సభ్యత్వ రుసుము అంటూ మరో రూ.10 లక్షలు చేరాయి. ఇంటీరియర్స్ మనమే చేయించుకోవాలి. ఒక్క క్షణం మానేద్దామా అనిపించి అడిగితే, మానేయడం మన ఇష్టమే కానీ అడ్వాన్స్ వాపసు రాదట. అలా ఉన్న అగ్రిమెంటులోని భాగాన్ని చూపించాడు. 'ఏ దశలో అగ్రిమెంట్ రద్దు చేసుకున్నా 10% తిరిగి చెల్లించడం జరగదు" అని ఉంది. మేమే సంతకం చేసాం, గమనించకుండా. కొంత నిరాశే కలిగినా ఇంటికొచ్చాం.

నాలుగు నెలలు గడిచాయి. అక్కడ పునాదులు కూడా పడలేదు. అగ్రిమెంటు కాగితాల్లో 18 నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు. 20 అంతస్తులు 13 నెలల్లో ఎలా పూర్తి చేస్తారని మళ్లీ ఆఫీస్‌కి వెళ్ళాం.

"రేరా క్వరీ వచ్చిందండి. పని మొదలైంది. మెటీరియల్ వచ్చేసింది. ఇది పెద్ద కంపెనీ. ఒకసారి మొదలవడమే ఆలస్యం. ఎంతలో పూర్తవుతుంది! అన్నీ పనులు చేయడానికి యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి" అని సమాధానం.

మరో నెల గడిచింది. పనిలో వేగం లేదు. ఫోన్ చేస్తే, కొన్ని ఫైనాన్సియల్ మేటర్స్ సెటిల్ అవడంలో కాస్త జాప్యం జరుగుతుందని, బ్యాంకు ఋణం రేటుపై చర్చలు జరుగు తున్నాయని చెప్పారు. ఆ తరువాతి నెలకు పునాదులు మొదలయ్యా యి. ఫోన్ చేస్తే ఎంతో మర్యాదగా, 'అయిపోతుంది, మీకు చెప్పిన సమయానికి ఒక నెల అటూ ఇటుగా. ఈ కంపెనీ అంతర్జా తీయంగా పేరున్న సంస్థ. దేశంలోని అనేక పట్టణాల్లో అపార్టు మెంట్లు కట్టిన అనుభవం ఉంది. మీరేం దిగులు పడకండి.' అంటూ సముదాయింపు .

తరువాత నెలకి 'బ్యాంకు లోన్‌లో ప్రాబ్లెమ్. సాల్వ్ అయింది. ఇచ్చేస్తారండి మీ టైంకి. మీరేం బాధపడకండి' 'అని ఊరడింపు.

మరో నెల గడిచింది. మొదటి స్లాబ్ పడిందని నోటీస్

ఇచ్చారు. మరో విడత చెల్లింపు చేయాల్సిన సమయం వచ్చింది. ఉండబట్టలేక అడిగాను, "12 నెలల్లో 20 స్లాబులు ఎలావేస్తారు?" అని.

"అదే.. కొంచం ఆలస్యం అవ్వొచ్చు. 24 నెలలు పట్టొచ్చు. మొన్న రేరా అప్రూవల్ వచ్చింది." అన్నారు.

"ఇదివరకు రేరా పెర్మిషన్ వచ్చిందన్నారుగా" ఆశ్చర్యంగా అడిగాను.

"అంటే ఇదివరకు అప్లై చేసాము. మొన్ననే ప్లానులో కొన్ని సవరణలు చేయమని ఆదేశిస్తూ అప్రూవల్ ఇచ్చారు'.

"అగ్రిమెంట్లో చిన్న మార్పులు చేసాం. సవరణలకు మీ సంతకాలు మళ్ళీ కావాలి".

"మీ అపార్ట్మెంట్ కొలతలు కాస్త మారాయి. ఒక అయిదు గజాలు తగ్గుతాయి. అందుకనుగుణంగా మీ చెల్లింపులలో కూడా మార్పుఉంటుంది లెండి."

"వరండా వెడల్పు కూడా తగ్గింది."

మళ్లీ సంతకాలు చకచకా సాగిపోయాయి. వేడి వేడి కాఫీతో, ఏసి గదిలో. ఈ సారి చెక్ ఇచ్చి మరికాస్త అసంతృప్తిగా ఇంటి కొచ్చాం.

మరో నెల గడిచింది. కబురు లేదు. అడిగితే .. కరోనా కారణంగా పనులు సాగడం లేదని, పనివాళ్ళు ఊళ్ళకి వెళ్లి పోయారని, వచ్చిన వెంటనే మొదలవుతాయని సమాధానం.

క్యాలెండర్ మారింది. రెండో విడత కరోనా వచ్చినప్పుడు మా ఆయన కూడా ఆ మహమ్మారి బారినపడ్డారు. గండం గడిచి ఇంటికొచ్చారు. డిపాజిట్‌లో పది లక్షలకు కాళ్ళొచ్చాయి. ఆ తరువాత ఏడాది పాటు మా ఇద్దరి ఆరోగ్యాలు చూసుకోడంలో ఎంతగా తలమునిగిపోయామంటే ఫ్లాట్ సంగతి మరుగున పడిపోయింది.

మొదటిసారి చెక్కిచ్చిన మూడో ఏడు ... ఐదు స్లాబులు అయ్యాయని మరో ఇన్‌స్టాల్మెంట్ కట్టాలని నోటీస్ అందుకున్నాం. ఇంజనీర్ సర్టిఫికెట్‌తో సహా పంపారు. నిజమే అయిదు స్లాబులు పూర్తయ్యాయి. కానీ చూడను వీలు లేదట. ఇలా 9, 13, 19 స్లాబులు పూర్తి చేసిన సందర్భంగా ఇన్‌స్టాల్మెంట్స్ కోసం నోటీసులు రావడం, మేము చెల్లింపులు చేయడం జరిగింది. ఇంజినీర్ సంతకం చేసిన కాగితమే మాకు రుజువు. చూసే ఛాన్స్ లేదు. గేటెడ్ కమ్యూనిటీ నియమాలవే అట.

అడ్వాన్స్ ఇచ్చి ఐదో ఏడులోకి అడుగు పెట్టాం. ఆర్నెల్ల కిందట ఇంజినీర్, మార్కెటింగ్ మేనేజర్ వస్తున్నట్టు ఫోన్ చేసారు. 'గోడలు కడుతున్నాం. వంటిళ్లలో చాలామంది మాడ్యులర్ కిచెన్ ఇష్టపడుతున్నారు. మీరు కూడా ఇష్టపడతారా?'

"అవును"

"అయితే ఇక్కడ సంతకం పెట్టండి" అంటూ ఓ కాగితం మా ముందు ఉంచారు.

కిచెన్లో ఇదివరకు ఒప్పుకున్న గ్రానైట్ కిచెన్ టేబుల్ అక్కరలేదని మేము సంతకం చేసిన ఉత్తరం అది. ఆ మేరకు మీ చివరి ఇన్‌స్టాల్మెంట్‌లో తగ్గిస్తాం అని హామీ. మరో నెలకి వైరింగులు జరుగుతున్నాయి. మార్పులు సూచించమని నోటీస్ తీసుకుని ఒక అమ్మాయి వచ్చింది. సూపర్ వైజర్ అట. బాత్ రూంలో ఒక స్విచ్ ఎక్కువ కావాలని అడిగాను. వెంటనే ఏడు వేలకి రసీదు రాసి ఇచ్చింది. "పేమెంట్ వెంటనే చెయ్యాలండి." అంది.

"మరి మీరు మాకు తగ్గించాల్సింది వెంటనే తగ్గించలేదు కదా!" అన్నాను.

"మీరు రేపు ఆఫీస్‌కి వచ్చి మాట్లాడండి మేడం. మార్పులు అవసరమైన వారు వెంటనే చెల్లింపులు చేస్తేనే చేసే వీలవుతుందని చెప్పమన్నారు"

చేసేదేముంది.. డబ్బిచ్చి రసీదు తీసుకున్నాను.

ఆ తరువాతి ఇన్‌స్టాల్మెంట్స్ యాంత్రికంగా కట్టాం. చెల్లింపులే మన వంతు అన్నట్టుగా ఉంది వ్యవహారం. సంతకం పెట్టిన తరువాత వాళ్ళ చేతిలో బందీలమే!

ఇప్పుడు ఆ నిర్మాణాన్ని చూసి ఆనందం కలగడం లేదు. చెల్లించాల్సింది ఇక ఒకే ఒక్క ఇన్‌స్టాల్మెంట్. ఆఫీస్ కెళ్ళి మాట్లాడితే అందరూ మర్యాదగా మాట్లాడతారు. కాఫీలు, చల్లని మంచి నీళ్లు ఇస్తారు. కార్యాచరణే అసంతృప్తిగా ఉంది.

"ఇప్పటికే మూడేళ్లు ఆలస్యమైంది కదా"

"అవును.. కరోనా కదా"

"ఎప్పటికి పూర్తవుతుందని మీ అంచనా"

"ఇంకో ఏడాదిలో అవ్వొచ్చు. మళ్లీ కరోనా రాకపోతే."

"మూడేళ్లు ఆలస్యమైనందుకు మేం నష్టపోయాం కదా!"

"అవునండి. మేం కూడా నష్టపోయాం"'

"సమయానికి అందించకపోతే నష్టపరిహారం ఇస్తామని అగ్రిమెంట్లో ఉందికదా! ఏవిధంగా పరిహారం ఇస్తారు?"

"ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతే పరిహారం ఏమి ఉండదని అగ్రిమెంట్లో ఉంది కదండీ. కరోనా ఒక వైపరీత్యమేగా. మేము కూడా నష్టపోయాం కదండీ." లాజిక్.

వాదించి ప్రయోజనం లేదనిపించి చెక్ ఇచ్చి ఇంటికొచ్చాం. ఆ ఫ్లాట్‌లోకి వెళ్లేసరికి ఆయనకు 66 ఏళ్ళవుతాయి. నాకు 65.

ఈ ఐదేళ్లలో ఒకదానిపై ఒక ఖర్చు పడి డిపాజిట్లు కరిగి పోయాయి. ఇంకా ఒక ఇన్‌స్టాల్మెంట్స్‌కి, ఇంటీరియర్స్‌కి డబ్బు కావాలి. బ్యాంకులో ఉన్నవి సరిపోవు. హోం లోన్ పెట్టాల్సి వస్తుంది. వాళ్ళు అన్న సమయానికి ఇల్లు ఇచ్చి ఉంటే, అదనంగా ఈ ఫ్లాట్‌పై అద్దె కూడా వచ్చేది. జీవితం ఆఖరులో ఇంత టెన్షన్ అవసరమా? అనిపించడం మొదలైంది. ఇప్పుడు స్కై వాచ్ గుర్తుకు రావడం లేదు. 14 అంతస్థులో కార్నర్ ఫ్లాట్ అన్న సంతోషం, ఎప్పుడెప్పుడు వెళదామా అన్న తాపత్రయం, ఆసక్తి పూర్తిగా సన్నగిల్లాయి. మళ్ళీ అప్పు తేవాల్సివస్తుందన్న బాధతో మనసు మూలుగుతోంది. ముందుకెళితే నుయ్యి, వెనక్కి వెళితే గొయ్యి

అన్న చందంగా ఉంది మా పరిస్థితి. ఇన్నేళ్ళుగా ఉన్న ఇల్లు అమ్మాల్సి వస్తుందేమో అన్న వేదన మొదలైంది. చేసేదేం లేక మళ్ళీ హోంలోన్ పెట్టాం.

ఈ రోజు జీవన్ గ్రూప్ వాట్సప్‌లో 'మీ ఇంటి ఫోటో' అని వచ్చింది. ఫోన్ చేస్తే వాళ్ళ మార్కెటింగ్ మేనేజర్, "ఇల్లు పూర్తయింది మేడమ్. ఇంజినీర్ ఇచ్చిన సెర్టిఫికేట్ చూసుకోండి. రిజిస్ట్రేషన్ వరకు నేరుగా చూడ్డానికి మాత్రం వీల్లేదని వినయ పూర్వకంగా సెలవిచ్చారు. చేసే ఫ్లోరింగ్ ఏ రంగో, గోడలకు వేసే రంగులు ఏవో మనకు తెలియదు. ఎంతటి ఆధిపత్యం?

డబ్బులు మనవి. కట్టే విధానం మనకు తెలియదు. కడుతున్న గోడలు మనం చూడకూడదు. వేసే ఫ్లోరింగ్ మనకి తెలియాల్సిన పనిలేదు. మనం ఉండబోయే ఇంటి గోడల రంగుల ఎంపికలో కూడా మన పాత్ర లేదు. మొదట్లో అన్నీ చూపిస్తామని చెప్పారు. ఇప్పుడు ఫోటోల్లో మాత్రమే అంటున్నారు.

ఇంటి రిజిస్ట్రేషన్ డేట్ వాళ్లే ఇచ్చారు. మెయింటెనెన్సు ముందే కట్టించేసుకున్నారు. 20 అంతస్థుల భవనం ఏర్పడింది. అయిదేళ్ల తరువాత రిజిస్ట్రేషన్ జరగబోతోంది. ఈ రోజు ఆ విషయమై ఉత్తరం వచ్చింది.

అదే నన్ను గతంలోకి తీసుకెళ్లింది.

నాకు మోకాళ్ళ నొప్పులని రెండు మోకాళ్ళకీ ఈ మధ్యే ఆపరేషన్ అయింది. కరోనా తరువాత ఈయనకి చలిగాలంటే పడడం లేదు. ఊరికూరికే జలుబు చేస్తోంది. బయట తిరగడానికి ఉత్సాహం చూపడం లేదు. క్రెడిట్లో ఉన్న బ్యాంకు బాలన్స్ డెబిట్ లోకి వెళ్లి వెక్కిరిస్తోంది. రియల్ ఎస్టేట్ డౌన్‌లో ఉంది కాబట్టి ఉన్న ఇల్లు అమ్మలేకపోతున్నాం. పాతిక లక్షలకు కూడా కొనే వాళ్ళు లేరు. పిల్లలను అడగలేము. ఇంతకాలం ఎన్నో అవసరాలు ఉన్నప్పుడు కూడా ఎవరిని చేయి చాచలేదు. చదువులు, ఇల్లు అన్నీ ప్రణాళికబద్ధంగా చేసుకుని కాలం గడిపాం. అప్పుడు ఉద్యోగంలో ఉండబట్టి, వయసులో ఉండబట్టి అదో ధైర్యం అనుకుంటా. ఇప్పుడు నిస్సహాయంగా అనిపిస్తోంది.

అమెరికాలో ఉన్న అమ్మాయి రెండేళ్ళకి గాని రాదు. కరోనా కారణంగా కిందటేడు రానే లేదు. రోజూ ఫోన్ చేస్తుంది. ఆరోగ్యం గురించి ఆరా తీస్తుంది. మనవల చేత మాట్లాడిస్తుంది. వాళ్ళ సమస్యలు వాళ్ళకుంటాయి కదా! అంతకన్నా ఏం చేయ గలుగుతారు? ఉండడానికి ఇల్లుంది. పెన్షన్ ఉంది. ఇంకా సమస్య ఏమిటని అనుకుంటూ ఉండి ఉండొచ్చు. మేం కూడా ఇంటి విషయం చెప్పలేదు కదా! బెంగుళూరులో ఉన్న కొడుకు 'మీరే రండమ్మా' అంటాడు. అక్కడికి వెళ్లినా ఎవరి పనిలో వారుంటారు గాబట్టి, తోచక మూడో రోజు తిరిగి బయల్దేరతాం. డబ్బుల సంగతి ఎత్తితే కోడలు దగ్గర ఎక్కడ పలచన అవుతామో అని ఎప్పుడూ వాడి దగ్గర ఆ విషయం ఎత్తలేదు. నిజానికి సహాయం అవసరమంటే కాదనే తత్వం కాదు వాడిది. కోడలు కూడా డబ్బు మనిషి కాదు. అయినా ఏదో సంకోచం. ఎప్పుడూ ఇవ్వడమే గాని అడిగింది లేదు. అడిగిన తరువాత నెగెటివ్ రిప్లై వస్తే మనసు తట్టుకోగలదా? చిన్నతనంగా అనిపించదూ? ఇన్నేళ్ళలో ఎవరికీ ఆర్థిక విషయాలు చెప్పుకోలేదు. ఆ అవసరం రాలేదు. గుట్టుగా వెళ్లబుచ్చాం. అందుకనే ఈ విషయం ఎన్నిసార్లు ఎత్తాలన్నా మాట నోటిలోనే నలిగి పోతోంది. బయటికి రావడం లేదు.

వాకింగ్ ట్రాక్‌పై నడిచేవారెవరు? గెస్ట్‌హౌస్ ఉపయోగించుకోడానికి ఇంటికొచ్చే చుట్టాలెవరు? కమ్యూనిటీ హాలు ఉపయోగించుకునేందుకు చేసుకునే ఫంక్షన్స్ ఏం ఉన్నాయి? స్విమ్మింగ్ పూల్ వల్ల ఏం ఉపయోగం? లైబ్రరీకి వెళ్లి మేగజైన్స్ చదివే ఓపిక ఉందా? జిమ్‌కి ఎవరు వెళ్తారు? వీటన్నిటికీ మనచేత డబ్బులు కట్టించారు మెంబర్షిప్ పేరుతో. కానీ వాటి ఉపయోగం ఎవరికి? డబ్బులు చెల్లించిన బయటి వాళ్లే వాడుకుంటారు బహుశా. పెట్టుబడి మనది. ప్రయోజనం వాళ్ళది. అరె వాహ్! గేటెడ్ కమ్యూనిటీ!

నలభై ఏళ్ల వయసులో 24 నెలలకి 64 నెలలకి పెద్ద తేడా ఉండకపోవొచ్చు. కానీ అరవైలు దాటిన తరువాత తేడా చాలా ఉంటుంది.

ఇది మా పాలిట గేటెడ్ కమ్యూనిటీ కాదు, గ్రేటేడ్ కమ్యూనిటీ!

ఆలోచనల సుడిగుండంలో నేనుండగా నన్ను ఈ లోకానికి తీసుకొచ్చింది నా సెల్ రింగ్ టోన్.

అది మా అబ్బాయిదే. ఆలోచనలు పక్కకి నెట్టి కాల్ అటెండ్ అయ్యాను.

"అమ్మా ! నీకో సర్ప్రైజ్.. రేపు నీ ముందుంటాను." అన్నాడు.

ఇంతలో కోడలు ఫోన్ లాక్కొని, 'ఏం లేదత్తయ్యా! మాకు విజయవాడ ట్రాన్స్ఫర్ అయింది. సర్ప్రైజ్ చేయాలని మీ అబ్బాయి కోరిక. తీరా మీరు ఎక్కడికయినా వెళితే మేమే సర్‌ప్రైజ్ అవ్వాల్సి వస్తుందని చెప్పేస్తున్నా.'

వంద బెలూన్లు గాలిలో ఎగురుతున్నాయా!

గాలి ఇంత తేలికగా ఉందే!

ఫోన్ పట్టుకుని పరిగెత్తాను ఇల్లంతా.. ఈయన్ని వెతుక్కుంటూ. ■


**'దేశభక్తి' కథల పోటీ**

**వా**సా ఫౌండేషన్, సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో 'దేశభక్తి' అంశంపై జాతీయస్థాయి డా.వాసా ప్రభావతి స్మారక కథల పోటీ నిర్వహిస్తున్నాం. కథ రాతప్రతిలో ఎ4 సైజులో నాలుగు పేజీలు, డిటిపి అయితే మూడు పేజీలకు మించరాదు. ప్రథమ బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి: రూ.2500 లతో పాటు ఐదు ప్రత్యేక బహుమతులు రూ.1000 చొప్పున 5 కథలకు అందజేస్తాం. కథలు పోస్టు/ కొరియర్ ద్వారా 30.04.2023 లోగా ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం. 11 – 13–154, రోడ్ నెం. 3, అలకాపురి, హైదరాబాద్–500102 చిరునామకు (సెల్: 9490751681)కు పంపాలి. **– పొత్తూరి సుబ్బారావు**

కవిత



## అనంత శ్రమ

**అ**మ్మకు పేరుంది
దుర్గమ్మనీ
ఆమె పనితనానికీ పేరుంది
అనంత శ్రమనీ!

ముంజలూరడవిలో
నరుక్కొచ్చిన వెదురుగొట్టంతో
పొయ్యూదిన శబ్దం
మా వూరిలో తొలి అలికిడి
అమ్మ లేచాక
బియ్యం చెరిగే సంగీతం
కోడిపుంజుకి అలారం

ఒంట్లో రోగాన్ని బెట్టుకుని
ఇంట్లో గడవాలనీ
నాయన వెనక
రేవుకావడై కిర్రుకిర్రుమనీ నడిచేది

తూర్పునున్న పులివాగులో
రోజంతా గుంజలా దిగబడి
నెత్తిమీద సూర్యుడు
పొయ్యిలా భగభగ కాగుతున్నా
ఐదుగూనల బట్టలు
ఒంటిచేస్తో ఉతికారేసేదీ
అమ్మ చేతిలో బాదబడ్డ బట్టలు
మల్లెపూల గుబాళింపుని మించిపోయేవీ

రొమ్ములో పాలు ఖాళీ అయేంత
స్తన్యమిచ్చాక
మామిడిచెట్టు కొమ్మకి
తన పాత చీరూయల కట్టి
నన్ను నిద్రపెట్టెలో తాళం బెట్టాకే
రేవు చాకిరీని గట్టెక్కించేదీ!

జావగిన్నెలన్నీ
పొయి బూడిదతో తోమి
నన్ను చంకనేసుకునీ
భుజంపై కావడేసుకునీ
సాయంత్రంతో
ఊసులాడుతూ ఇల్లు చేరేదీ

నాయన
ఇస్త్రీపెట్టెలో వేసి
బొగ్గులకు జీవితాన్నిస్తుంటే
అమ్మపుడు
మట్టిదాకలో గరిటై తిరిగేదీ

అందరికీ వడ్డించాక
అడుగుమాడిన అన్నం చెక్కలకీ
ఊరగాయ నంజుకుని
ఆకలికాకను చల్లబరిచేదీ

నిద్ర రాలేదంటే
ఒకమాటంటుండేదీ
రోజంతా శ్రమను మోసి
ఒళ్లు హూనమయితే
కునుకు తన్నుకుని వస్తదనేదీ!

బట్టలుదికి ఉదికీ
ఒళ్లంతా మురికిబోసుకుని
నల్లబడిన అమ్మముఖం ముందు
పున్నమి చంద్రుడు వెలవెలమంటాడు!

ననుగన్న అమ్మ
చాకితమ్మ
ఈ పద్యం నమస్కరిస్తుంది
అమ్మ శ్రమపాదాల పగుళ్లకు..!

**- మెట్టా నాగేశ్వరరావు**






# సాహిత్యంలో సాఫ్ట్‌వేర్ వసంతం

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**సా**ఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనగానే కొన్ని ఊహలు మన మదిలో మెదులుతాయి. లక్షల్లో జీతం, ఏసీ గదుల్లో జీవితం, అద్దాల భవనాల్లో పని, షిఫ్టుల్లో స్వేచ్ఛ... ఇంకా ఇట్లాంటివి మరికొన్ని. సాంకేతిక సంకెళ్లలో చిక్కుబడిపోయిన వారికి సాహిత్యం ఆమడ దూరంలో ఉంటుందనే అభిప్రాయం కూడా ఉంది. కానీ, అది అపోహేనని కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు నిరూపిస్తున్నారు. వినూత్న ఇతివృత్తాలతో కథ, కవిత్వ రంగాల్లో మెరుస్తున్నారు.

ఇటీవలి కాలంలో అలా నా దృష్టికొచ్చిన ఓ మెరుపు– కుడికాల వంశీధర్. ఓ పత్రికలో ప్రచురితమైన కవితను చదివి, ఫోన్ చేసి అభినందించాను. ఆ తర్వాత తాను వెలువరించిన రెండు నానీల సంపుటాలు 'నానీల వసంతం' (2019), 'సాఫ్ట్‌వేర్ నానీలు' (2021) చదివినప్పుడు మరింత ముచ్చటేసింది. 'సాఫ్ట్‌వేర్ నానీలు' చదివినప్పుడు నాకు రేపటి కవిత్వానికి ఢోకా లేదన్న నమ్మకం అంకురించింది.

నిజానికి, సాంకేతిక పరిజ్ఞానానికీ సామాన్యుడికీ వారధి నిర్మిస్తూ సాహిత్యదీపం వెలిగించాలనుకోవటం ఓ సాహసం. ఆ వారధి దాటే క్రమంలో ఎత్తుపల్లాల సారాంశాన్ని పాఠకుడు ఏ మేరకు అర్థం చేసుకోగలడనే ప్రశ్న విస్మరించరానిది. చదివేటప్పుడు కొన్ని నానీల దగ్గరైనా ఈ ప్రశ్న మొలకెత్తుతుంది. అయితే, ఎవరో ఒకరు పూనుకోకపోతే ఏ ప్రయోగమైనా ఎట్లా వేదికనెక్కుతుంది? ఆ ప్రయోగాన్ని విజయవంతంగా నానీల కెక్కించాడు వంశీధర్.

సాఫ్ట్‌వేర్ అనేది వైజ్ఞానిక సదుపాయ కల్పనే తప్ప– దానికి రంగు, రుచి, వాసన ఉండవు.

"హార్డ్‌వేర్ అంటే/ కనిపించే దేహం
సాఫ్ట్‌వేర్ అంటే/ పనిచేసే మంత్రం" అంటూ కంప్యూటర్ని తేలిగ్గా నిర్వచించి ...

"తెర సైజు/ పదిహేను అంగుళాలే
అఖిలాండ/ బ్రహ్మాండకోటి అందులోనే" ఉందంటూ దాని విశ్వరూపాన్ని వివరించాడు.

"జీతాలు/ పెద్దగా కనిపిస్తాయి/ నిజానికది/ రోజుకూలీల సందోహం" అని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం నిరంతర శ్రామికులేనని తీర్మానించాడు.

"ఏసీల్లో ఉంటే/ రాదంట చెమట
మీకు తెలుసా/ వారి మెదడుపై సమ్మెట" అని మరో ప్రశ్న సంధించాడు.

ఈ కవి నిరంతరం కవిత్వాన్నే కలవరిస్తాడు. ఏ పని చేస్తున్నా అందులో అక్షరచిత్రాలను దర్శిస్తుంటాడు. నిద్రలోనూ కవిత్వంతోనే సావాసం చేస్తాడు. కాబట్టే సాఫ్ట్‌వేర్ సాంకేతిక పదజాలంతో కమనీయ కవిత్వాన్ని నానీల రూపంలో రాబట్టాడు.

"మగతలో/ కీప్యాడ్‌పై చెయ్యి పడింది
అల్లుకున్న/ అక్షరాలు కవిత్వమైనై".

మనసుల మధ్య దూరం ఎందుకు పెరుగుతుంది?

"కొన్ని పరిచయాలు/ దూరమవుతాయి
వాడని/ పాస్‌వర్డ్ మరచిపోయినట్టు".

ఇవాళ ఎవరికి ఏం కావాలన్నా సింపుల్‌గా గూగులమ్మను ఆశ్రయిస్తున్నారు. ఏ అంశంపై అభ్యర్థన వదిలినా, అది ఇట్టే సమాధానం (అది ఎంతవరకూ సరైన, సమంజసమైన సమాధానమనేది పక్కన పెడదాం) వస్తుంది. అయితే దానికీ

పరిమితులున్నాయి. కవి ఏమంటాడో చూడండి...

"గుండెల్లో
గుబాళించాల్సిన ప్రేమ
అది గూగుల్‌లో
దొరకదు సుమా!".

స్త్రీ మనసు సముద్రం కన్నా లోతు. ఆమెను అర్థం చేసుకోవటంలో పురుషుడు ఎప్పుడూ ఆమడ దూరంలోనే ఆగిపోతున్నాడు. పోనీ, గూగుల్ కనిపెట్టగలదా? చూడండి, వంశీ ఏమంటున్నాడో...

"గూగుల్‌లో/ అన్నీ దొరుకుతాయి
ఆమె దుఃఖానికి/ కారణం తప్ప".

కాలం ఆధునికమయ్యే కొద్దీ మానవజీవనం ఆహ్లాదకరంగా మారాలి. వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ఆవిష్కరణలు పెరిగిపోతున్నాయే తప్ప ఆచరణలో అమలు కావటం లేదు. రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం, పేరుకుపోతున్న వ్యర్థాలు మనిషి బాధ్యతను హేళన చేస్తున్నాయి.

"సాంకేతికత/ చంద్రమండలం చేరుకుంది
భూగోళం/ దుఃఖ సముద్రమయ్యింది".

కంప్యూటరు కంటే ఫోనే ఇప్పుడు మనిషి జీవితాన్ని ఎక్కువగా ఆక్రమించింది. అది శరీరంలో ఆరో అవయవంలా మారింది. ప్రతి పనికీ అదో ఆధార'భూతమై' కూచుంది. పిల్లలూ దానికి బానిసలైపోతున్నారు. వాళ్ల అల్లరి మాన్పించటానికి మళ్లీ ఫోనే అవసరం. ఫోన్లో యాప్‌ను డౌన్లోడ్ చేసి, పిల్లల కథలు వినిపించక తప్పని స్థితిని స్థితిని ఇట్లా నానీకరిస్తున్నాడు...

"తల్లిదండ్రులు పిల్లలకి
మోరల్స్ చెప్పాలి
వెంటనే
ఫోన్‌లో యాప్ వేశారు".

పిల్లలు ఫోన్ బారిన పడకుండా జాగ్రత్త పడాలన్న తాపత్రయం నీటిమీద రాతలా మారింది. ముందు పెద్దలు ఆ చెర నుంచి విముక్తి పొందితేనే, పిల్లల్నీ దూరం చెయ్యగలరు. ఆ ప్రయత్నం 'అశ్వత్థామ హతః/ కుంజరః' అన్న రీతిలో ఉందని కవి హేళన చేస్తున్నాడు.

సాంకేతికత వరదై పారి, నట్టింట్లోకి చేరిన నేపథ్యంలో అన్నిటికీ ఆధారపడిపోతున్నాం. సొంత కాళ్లు కోల్పోతున్నాం. చేతులు ముడుచుకుంటున్నాం. మెదడును కోల్డ్ స్టోరేజిలో భద్రపరుస్తున్నాం. సాధన– పరాయిదైపోయింది. ఆశ్రయించటం తేలికైపోయింది. ఇంతకుముందు చాలా ఫోన్ నంబర్లు నోట్లో కొలువుండేవి. ధారలా కురిసేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. స్టోర్ రూములో అన్నీ దొరుకుతున్నాయి.

"కొన్ని పదాల/ స్పెల్లింగ్ మరిచావా?
అంతా వర్డ్‌లో/ స్పెల్ చెకర్ చలవ".

చేతిరాత ఇప్పుడు ఓ పురాతన ప్రతి. చూచిరాతలతో ఉపాధ్యాయులు మన వేళ్ల నడుమ కళాకృతులు భద్రపరిచిన రోజులు ఇప్పుడు కేవలం జ్ఞాపకాలు.

'కంప్యూటర్‌తో/ కీబోర్డ్ జత కట్టింది
కాగితం కోసం/ కలం వెదుకుతుంది'.

అదే సమయంలో దానివల్ల ఒనగూరిన సదుపాయాన్నీ విస్మరించలేం.

'కవిత్వం/ ఎప్పుడైనా వ్రాసుకోవచ్చు!
కంప్యూటరే/ నాకు కలం, కాగితం!'

మనుషుల మధ్య ఖాళీలు పెరిగిపోయాయి. మాటల వంతెన్లు శిథిలమవుతున్నాయి. మనసుల నడుమ శబ్దాలు మూగబోతున్నాయి. చెవుల్ని సాంకేతిక పరికరాలతో కలిపి కుట్టేసుకుంటున్నాం. పక్కవాడితో మాట్లాడాలన్నా మన చేతులు ఫోను మీదికే పోతున్నాయి.

'నాతో ఏదో/ చెబుతున్నాడని వెళ్తా
బ్లూటూత్‌లో/ మాట్లాడుతున్నాడు'.

ఇదే బాటలో మరొకటి...

'యంత్రాలకు/ మాటలు నేర్పుతారు
ఇంట్లోవారితో/ మౌనవ్రతం'.

కెరీర్ బిల్డింగ్ యావలో పడిపోయి, ఎత్తులకెదగటమనే తపన పెరిగిపోతోంది. ఈ వలయంలో చిక్కుకొని తల్లిదండ్రుల బాగోగులు చూడాలన్న బాధ్యత కూడా ట్రాష్‌లో పడిపోతోంది...

"మూడు పదులకే
ఇరవై పేటెంట్స్ సాధించాడు
ఇక్కడ
పేరెంట్స్‌ని మరిచాడు".

సాంకేతికత ఎంత విస్తారమైనా అది మనసును ప్రభావితం చెయ్యలేదు.

'వాడు హ్యాకరే/ పెద్ద దొంగ
మనసులోకి/ ప్రవేశించి చూడమనండి'.

మనం ఎక్కడికి వెళ్లినా అక్కడ ఇంటర్నెట్టు సదుపాయం ఉండాలి. ఆ సౌకర్యం లేని ఇళ్లూ కార్యాలయాలూ ఇవాళ వ్యర్థ పదార్థాల కింద లెక్క. ఆతిథ్యంలోని డొల్లతనాన్ని కవి పదునైన నానీగా ఎక్కుపెట్టాడు...

'వారి/ ఆతిథ్యం గొప్పది
టీ, టిఫిన్ కన్నా ముందే/ వైఫై పాస్‌వర్డ్ ఇచ్చారు'.

నిజంగా కొన్ని సాఫ్ట్‌వేర్లు పుట్టుకొస్తే, ఎన్నో బండారాలు బట్టబయలవుతాయి...

"మనసులో ఏముందో/ ప్రింటవుట్ తీయండి
అమ్మో!/ లోపల ఇంత విషముందా!" అని నోరెళ్లబెట్టక తప్పదు.

సామాజిక మాధ్యమాలు తామరతంపరగా పుట్టుకొచ్చిన నేపథ్యంలో ప్రతి విషయమూ వాటిల్లో ప్రత్యక్షమవుతోంది. ఏదో ఒక సమస్య గురించి, ఎవరో ఒకరు ఒక పోస్టు పెట్టగానే దానిమీద అర్థం లేని చర్చ చకచకా సాగుతుంది. ఆవేశం చల్లారగానే, ప్రతిస్పందన విశ్రమిస్తుంది. ఆ సమస్య అలాగే చిరంజీవిగా మిగిలిపోతుంది. నిజానికి, పోరాటభూమిక లేకుండా ఏ సమస్యకూ పరిష్కారం లభించదన్న సంగతిని ఓ నానీలో వంశీ చక్కగా ఆవిష్కరించాడు...

"సమస్యలపై పోస్ట్/ ట్విట్టర్‌లో ట్రెండ్ అయ్యింది
పోరాటం/ అక్కడే ఎండ్ అయ్యింది".

ఈ పరిస్థితిని కండగల కవిత్వంతో అలంకరించటమే కవి నైపుణ్యం. ఒక వ్యంగ్యబాణంతో పుట్టుకొచ్చిన మరో నానీ మనల్ని ఆశ్చర్యపరుస్తుంది...

"ట్విట్టర్‌లో/ పిచ్చికూతలు కనిపెట్టిందేమో
పిచ్చుక/ అలిగి వెళ్లిపోయింది!".

ఇదీ కవి చేయాల్సిన పని. ఇదీ కవిత్వంలో విరియాల్సిన వసంతం.

'అపోజిషనోళ్లకి/ వోట్లెక్కువ పడ్డాయి
సాఫ్ట్‌వేర్/ ప్రాబ్లమేనంట!'

సకల సుఖాలూ అందిస్తోందని మురిసిపోయే ముందు దాని వెనక పొంచి ఉన్న ప్రమాదాల్ని కూడా పసిగట్టాల్సిన అవసరాన్ని కవి నొక్కి చెబుతున్నాడు...

"అంతర్జాలం/ ఒక ప్రియనేస్తం
అదుపు తప్పిందా/ అదే భస్మాసుర హస్తం".

చాలామంది యువకులు చదువు పూర్తయ్యీ కాకముందే డాలర్ల వేట మొదలెడుతున్నారు. సముద్రాలు మీదగా ఎగురు కుంటూ వెళ్లి, విదేశీ జీవనసూత్రాలు భట్టీయం వేసేందుకు వెంపర్లాడుతున్నారు. సాక్ష్యం కావాలా? ఇదిగో, ఈ నానీ చూడండి...

'చేపలు/ గాలాన్ని వెదకడం చూశారా?
వీసాల కోసం/ వెళ్తున్నారు అదిగో!'

ప్రతి పేజీలోనూ నానీలతోపాటు ఇచ్చిన బొమ్మలు బాగున్నాయి. సాంకేతిక పదాలకు ఫుట్‌నోట్స్‌లో వివరణ ఇవ్వటం చాలా బాగుంది.

సాఫ్ట్‌వేర్ నేపథ్యంగా ఇన్ని నానీలు రాసేందుకు దారితీసిన పరిస్థితులను 'నానీల నాన్నారు' ఎన్.గోపి 'అమూర్త ప్రపంచం'లో ఆసక్తికరంగా వివరించారు. డాక్టర్ ఎస్.రఘు "న్యూ వర్షన్ ఏ వంశీధర్ నానీలు" శీర్షికన విలువైన ముందుమాట రాశారు. దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక అధ్యక్షులు రాపోలు సీతారామరాజు గారి మాటల్లో చెప్పాలంటే... "సాఫ్ట్‌వేర్‌లోనూ కవిత్వాన్ని, భావుకతను, తాత్వికతను చూసి, అందరికీ చూపిస్తున్న వంశీకి అభినందనలు".

మరింత అధ్యయనంతో, పరిశీలనా దృక్పథంతో నానీలే కాకుండా సీరియస్ కవిత్వం కూడా రాయాలని నా అభిలాష.

'సాఫ్ట్‌వేర్ నానీలు" సంపుటి ముఖపత్రంతోపాటు లోపలి పేజీల్లోని బొమ్మలతోనూ, చిక్కని కవిత్వంతోనూ ఆకట్టుకున్న కుడికాల వంశీధర్ (9885201600)... మరింత మంచి కవిత్వంతో ముున్ముందు మనకు విందు చేస్తాడన్న భరోసా కల్గిస్తున్నాడు. ■

## వి.మల్లికార్జున్‌కి డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

**త**న ప్రత్యేక శైలితో కథ, నవలా ప్రపంచాన్ని అబ్బురపరచిన విలక్షణ రచనాశీలి డాక్టర్ వి.చంద్రశేఖరరావు మరణించి ఆరు సంవత్సరాలు కావస్తోంది. ఏప్రిల్ 13 వారి జయంతి సందర్భంగా ఏటా వర్ధమాన సాహిత్యకారునికి ఆయన పేరున సాహిత్య పురస్కారాన్ని చంద్రశేఖరరావు సాహితీ కుటుంబం ప్రదానం చేస్తోంది. 2023 సంవత్సరానికి గాను ఈ పురస్కారాన్ని నల్గొండకు చెందిన యువ కథా రచయిత వి.మల్లికార్జున్‌కి ప్రదానం చేయాలని నిర్ణయించారు. గతంలో ఈ పురస్కారాన్ని ఎండపల్లి భారతి, సుంకోజి దేవేంద్రాచారి, ఇండ్ల చంద్రశేఖర్, దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి పొందారు.

**– డాక్టర్ వి.ప్రసూన,**
**డాక్టర్ వి.చంద్రశేఖర రావు సాహిత్య కుటుంబం**


## కలిమిశ్రీకి జాషువా పురస్కారం

**బ**హుముఖీనంగా తెలుగు సాహిత్యానికి సేవలందిస్తున్న కలిమిశ్రీకి పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 35వ వార్షికోత్సవ వేడుకల్లో మహాకవి జాషువా పురస్కారం అందజేయనుంది. ఏప్రిల్ 23న తెనాలిలో జరిగే వేడుకల్లో కలిమిశ్రీని 'సాహితీ తపస్వి' బిరుదుతో సత్కరించనున్నట్టు జాషువా స్మారక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పెద్దింటి యోహాన్ తెలిపారు. కలిమిశ్రీ అసలు పేరు కలిమికొండ సాంబశివరావు. ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, జ్యోతిచిత్ర పత్రికల్లో ఉప సంపాదకులుగా పనిచేశారు. సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ సాహిత్యంలో కొత్తతరాన్ని తయారుచేసే కృషిలో నిమగ్నమయ్యారు. 2007 నుంచి నవ మల్లెతీగ మాసపత్రికను నడుపుతున్నారు.

## అక్కడ బూమెలున్నాయట!

ఈ తీగగుండా పాకి
ఆ గూట్లో గుడ్లని కాజేసింది
స్పష్టంగానే కనబడుతోంది
ఆ పక్కనున్న పుట్టలో పామేనట
ఇంకేం...? ప్రాబ్లం సాల్వ్‌డ్ కదా!
లేదు లేదు
అంత స్పష్టంగా కనపడుతున్నా
దాని చేతిలోంచి పీకి దీనికియ్యకూడదట
మరి అది అంతర్జాతీయ ధర్మమట
ఇయ్యాలని ఉన్నా
అది ఏ పాతాళాల్లో పతనమైపోయిందో
ఎరుక దొరకదట
పాముని పట్టి బుట్టలో పడేస్తే పోలా?
అది అసాధ్యం
ఆ పుట్ట దుర్భేధ్యమట
అసలు ఆ పాంపుట్టకు దారే లేదట
ఆ సర్పాలు గ్యాంగులు కట్టి
పుట్టలతో సహా అడవుల్లోకి వెళ్లిపోతాయట
నువ్వక్కడికి పోతే భస్మమైపోతావట
అది ఒక సమాంతర రాజ్యం
నీ చేతుల్లో పని
ఆ పాముల చెవుల్లోని సమాచార చిచ్చుబుడ్డల్ని
పీకి పారేస్తే పోతుందిగా?
అది నీవల్ల కాదు
ఒకవేళ ఒకటో రెండో పీకేసినా
పీకేస్కో నో ప్రాబ్లం

ఏమిటీ...?
పిచ్చోడా! ఎన్నని పీకేస్తావు?
ఒక్కో పాము చెవిలో
కొన్ని వందల సిమ్ముబుడ్డలున్నాయట
ఒక్కో పాముకి ఒకే సిమ్ముబిల్లని కేటాయిస్తే!
ఇంకేముంది
కొంప కొల్లేరైపోతుంది
రాబందు గోచిలో రాయిబడిపోతుంది
బకాసురుడి బొందిలో ప్రాణం పోతుంది
కనెక్షన్లూ కలెక్షన్లూ అతలాకుతులమైపోతాయట



అంతెత్తు టవర్లు ఇట్టే కుదేలైపోతాయట
అదే జరగాలంటే అంత ఆషామాషీ కాదు
అక్కడ వేలుపెట్టడానికి
ఇంకా ఏ ఖాకీ భగీరథుడూ పుట్టలేదట
పోనీ తీగనే పీకిపడేస్తే!
వామ్మో అపశకునాలు పలక్కు
ప్రపంచపటం పసిఫిక్లో మునిగిపోతుంది
అదిగాదు గానీ... నువ్వు ఏమీ చేయలేవు
ఉస్సురని ఉడిగిపోవడం తప్ప
నీకు తెలుసా?
అసలు ఆ విషప్పురుగుల్ని
రాబందులే పెంచిపోషిస్తున్నాయట
అది రాజ్యం పెంచిపోషిస్తున్న కాలకూట విషం
ఇది విషవలయం
అందరం ఇష్టంగా ఇరుక్కుపోయాం
ఇది గ్లోబలైజేషన్ గందరగోళం
రాజ్యం సమాంతర రాజ్యం జట్టుకట్టిన వైనం
పిల్లిని పొడిచి పులిలా మార్చిన స్వయంకృతాపరాధం
అమ్మని అమ్మేసుకున్న పాపం
ప్రజాధిపత్యం పరాయిచేతుల్లో పెట్టిన ఫలితం
వ్యాఘ్రముూకల గుత్తరాజ్యాలు కూలిపోయాక
వ్యాపార సామ్రాజ్యాలు స్థాపించుకుని
అవి ప్రతిష్టించుకున్న
రబ్బరు స్టాంపుల తోడేళ్ల రాజ్యంలోని న్యాయం!

**(ఖాతాలు ఖాళీయై జనాలు గగ్గోలు పెడుతున్నా మోసపూరిత ఆన్లైన్ బ్యాంకింగ్ లావాదేవీలపై వ్యవస్థలు చేతులెత్తేస్తున్న సందర్భంలో)**

**- కవిత శ్రీ**
**94946 96990**

కవిత

## ఆ ఆకాశం మాది!

ఈ భూమ్మీద ఉన్నంతవరకు
మా నమ్మకంలో మమ్మల్ని బతకనివ్వండి
ఈ నేల మీద నడచినంత మేర
మా జ్ఞాపకాలు మాతోనే ఉండనివ్వండి
నిస్తేజంతో నిస్సహాయులుగా బతికినంతకాలం
ఏ ఆసరాకు నోచుకోలేకపోయాం
నిర్వేదంతో నిరాశాజనకంగా ఉన్నంతకాలం
నిరాశ్రయులుగానే మిగిలిపోయాం
వెలివేసిన జీవితాలతో బతకలేని స్థితిలో
జీవితాన్ని చక్కదిద్దుకునే దశలో
మా మార్గంలో మేం నడుస్తున్నాం
మతమూ కులమే కదా మనుషుల్ని వేరు చేసింది
బతుకు స్వేచ్ఛనే ఏనాడో రాజ్యాంగమిచ్చింది
అయినా మమ్మల్ని గుళ్ళకు దూరం చేశారు
మీ ఆచారాలు మమ్మల్ని ఊరు చివర బతకమన్నాయి
మతమంటే మాకు తెలిసింది మానవత్వమే
బతుకే భారమైన జీవితాల్లో
ఇప్పుడిప్పుడే కొత్త వెలుగు చూస్తున్నాం
ఈ బతుకు వద్దనుకుంటే
శాశ్వతంగా మమ్మల్ని పూడ్చిపెట్టండి
అవమానాలు కుల వివక్షలు
పురిట్లోనే మాకు ఎదురయ్యాయి
మీ చూపుల బాణాలు ఏమీ చేయలేవు
ఒకే గొడుగు కింద ఉండడం మీకిష్టం లేదు
మీ ఇష్టాలతో మాకు పనిలేదు
మాకు ఆకాశమే గొడుగు!

వెలుగును చూస్తే చీకటికి భయమే
ఆ భయమే ఇంతకాలం మమ్మల్ని కట్టి పడేసింది
భూమిని కబ్జా చేసినంత సులువు కాదు
ఆకాశాన్ని దోచుకోవడం దాచుకోవడం
ఇప్పుడు ఆ ఆకాశం మాది
మాలో కలుస్తుంది మాతో నడుస్తుంది
మమ్మల్ని పలకరిస్తుంది మాతోనే ఉంటుంది
ఆకాశం చూడడం తప్పు కాదు
ఆకాశాన్ని అందుకోవడం తప్పు
ఆకాశాన్ని అందుకోవాలని చూస్తే



పైనుంచి కింద పడతారు
మేం నడచినంతమేర
మా అడుగులు ప్రతిధ్వనిస్తుంటై
అడుగులు పిడుగులవ్వక ముందే
మా జీవితాలతో ఆడుకోకండి
గొంతెత్తే నోళ్ళను ఆపలేరు
కళ్ళముందు నిజాల్ని సమాధి చేయలేరు
పాత గాయాలు ఇంకా మాసిపోలేదు
రెచ్చిపోయి దాడి చేయాలని చూస్తే
మట్టిచేతులు ఊరుకోవు
పిడికిళ్లు బిగిస్తాయి
ఆ పిడికిళ్ళ ప్రవాహంలో
మీరంతా కొట్టుకుపోతారు!

- చొక్కర తాతారావు
63011 92215



# నవీన తెలుగు కవిత్వం మానవతా విలువలు

- డాక్టర్ కల్లూరి ఆనందరావు
81796 17807

**సా**మాన్యునికి సార్వభౌమత్వాన్ని ప్రసాదించాలని ప్రయత్నించిన మానవతావాదం ... వ్యక్తి స్వేచ్ఛను బలపరిచింది. అంధ విశ్వాసాలకు స్వస్తి చెప్పమంది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు యత్నించింది. వాస్తవికతకు నీరాజనం పట్టింది. సామాజిక అసమానతల్ని ఖండించింది. జాతీయ చైతన్య స్ఫూర్తిని కలిగించింది. దళితులకు, స్త్రీలకు, వెనకబడిన వాళ్ళకూ ఆత్మ గౌరవాన్ని, అభ్యుదయాన్ని ఆకాంక్షించింది. రాజా రామమోహనరాయ్ ఆత్మీయ సభ, బ్రహ్మసభగా మారి, బ్రహ్మ సమాజంగా రూపాంతరం చెంది ఆంధ్రదేశంలో మానవతా వాదానికి ప్రేరణ అయ్యింది. ఆధునికాంధ్ర కవిత్వానికి ఆలంబనగా మారింది.

'ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దారనేర్పించినన్"
అనుకొన్న కందుకూరి స్త్రీజనోద్ధరణం;
'యెల్ల లోకములక్కయిల్లై / వర్ణభేదం లెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియాలని" కాంక్షించిన గురజాడ సంస్కరణ తత్వం; ఆంధ్ర భాషా భిషక్కుల కృతక భాషా భేషజాన్ని దునుమాడిన గిడుగు పిడుగు నుడికారపు నేపథ్యాలలో, మానవతా స్పర్శతో సామాన్యున్ని మాన్యునిగా మలిచే ప్రయత్నం చేసిన ఆధునికాంధ్ర మానవతా కవిత్వానికి పదహారో శతాబ్దంలో ఐరోపాలో వెల్లివిరిసిన సాంస్కృతిక పునరుజ్జీవనం, పందొమ్మిదో శతాబ్దంలో తెలుగు కవిత్వాన్ని జ్వలింపజేసిన పునరుజ్జీవన దృక్పథం మూలమ్కొంది. అంతేగాక విశ్వవిద్యాలయాల స్థాపన, ఆంగ్ల విద్య, పాశ్చాత్య సాహితీ పరిచయం, ప్రభావం, పత్రికలు, ప్రచురణా సౌలభ్యం, రవాణా సౌకర్యాలు మొదలైన అంశాలు ఆంధ్రుల ఆలోచనల్లో కొంగొత్త భావాలకు రూపునిచ్చాయి. ఊపు నిచ్చాయి. "only a free man, it was held / was in the compleate sense a man at all, a slave was only half a man" అంటూ, తమ రచనల్లో స్వేచ్ఛా మానవత్వాన్ని ప్రతిష్ఠింపచేసుకొనేలా చేశాయి. జాతీయతను పున:స్థాపించుకొనే కృషికి శ్రీకారం చుట్టాయి. విస్మృతులకు సంఘంలో గౌరవాన్ని కల్పిస్తూ, స్థానాన్ని స్థాపిస్తూ, అంతరాలను తొలగించేందుకు ప్రయత్నించాయి.

సంఘ సంస్కరణానికి నడుంబిగించిన గురజాడ అప్పారావు తన నూత్న ఛందస్సు ముత్యాల సరాలతో
'దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్' అంటూ గిరులూ, తరులూ, నదీ, నదాల మొదలైనవి దేశం కావు, దేశమంటే మనుషులు అంటూ సొబగుల వర్ణనల కంటే, సోదరుల సౌఖ్యమే ప్రధానమన్న వాస్తవాన్ని ఎలుగెత్తి చాటారు.

'చెట్టాపట్టాల్ పట్టుకొని దేశస్తులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతి, మతములు మెలగవలెనోయ్"
అంటూ జాతీయతా స్ఫూర్తిని కలిగించాడు.

కులమతాలకతీతమైన మానవీయ సమాజాన్ని ఆకాంక్షిస్తూ,
'మంచి చెడ్డలు ఎంచి చూడగ
మనుజులందున రెండు కులములు
మంచియన్నది మాలయైతే
మాలనేనగుదున్' అంటూ గుణాధిక్యానికి పెద్దపీట వేశాడు.

మానవతా విలువల్ని ప్రతిపాదించే గురజాడ సంఘ సంస్కరణ కవిత్వంలో దైవాంశ సంభూతుడైన రాజో, ప్రభువో, రాయిరప్పలలో వెలసిన దేవుడో నాయకుడు కాదు, 'మానవ మాత్రుడే' దైవం. అందుకే,

'ధనములు రెండు తెలుగులు
ఒకటి మట్టిన బుట్టినది,
వేరొక్కటి హృత్కమలంపు సౌరభం" అంటూ హృదయ నైర్మల్యమున్న,

'నరుల చమటను తడసి మూలం
ధనం పంటలు పండాలని' కాంక్షించాడు.

పరుల కలిమికి ఏడ్వవద్దనీ, స్వంతలాభం కొంతమానుకొని, పొరుగువాడికి తోడుపడమని,

'పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయి' అంటూ మానవతా విలువల్ని తన కవిత్వంలో ప్రతిష్ఠించి, మానవత్వాన్ని, దేశభక్తిని చాటి చెప్పాడు.

కందుకూరి వీరేశలింగం స్త్రీల కష్టాలను తొలగించాలని కృషి చేస్తే గురజాడ అప్పారావు స్త్రీలకు ఇష్టాలను కలిగించేందుకై యత్నించాడు. కాసులు గేయంలో, స్త్రీలకు మేలును చేకూర్చే విలువల్ని ఓనమాలుగా దిద్దిస్తూ ...

'మరులు ప్రేమని మది దలంచకు
మరులు మరలును వయసుతోడనె
మాయమర్మములేని నేస్తము
మగువలకు మగవారికొక్కటే
బ్రతుకు సుకముకు రాజమార్గము
ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును' అంటూ నశ్వరమైన ఆకర్షణకు, శాశ్వతమైన ప్రేమకున్న వ్యత్యాసాన్ని హృదయాంగమంగా వివరించాడు.

మానవత్వానికి పునాది నెనరు. అది మనిషిని మనీషిని చేస్తుంది. మానవులు పరస్పరము నెనరుతో నెయ్యం కలపాలి. అందుకే,

'ప్రాణమిత్రుడు నీకు, నీ నెనరు
కలుగక యున్న పేదను, కలిగినను
నా పదవికి వేల్పులతేని ఎక్కడ" అంటూ
మిన్నంటిన ఆనందంతో సురరాజును మించి పోతాడు.

లవణరాజు కలలో మాలతె, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యకలు ఖండికలు గురజాడ అభ్యుదయానికి, ఆర్ద్రతకు, అధికారంపై తిరుగుబాటుకు ప్రతీకలు. స్త్రీ జనాభ్యుదయం మానవతా విలువల్లో విశిష్టాభరణం.

డా. సి.నారాయణరెడ్డిచే ఇద్దరు యుగకర్తలుగా సంభావింపబడిన గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావులిద్దరూ స్త్రీల సౌభాగ్యం, సౌశీల్యం, స్వేచ్ఛ, సమానత్వాలను ఆకాంక్షించినవారే.

ప్లేటో ప్రేమ సిద్ధాంతం కంటే ఒకమెట్టు పై నుండి స్త్రీ, పురుషుల మధ్య ప్రేమ ఉదాత్తంగాను, సమాన ప్రతిపత్తితోనూ, శారీరక సుఖాలకు దూరంగాను ఉండవచ్చునని ప్రతిపాదించి, తాను సంభావించే అమలిన శృంగారం ద్వారా స్త్రీలకు గౌరవాన్ని అందించినవాడు రాయప్రోలు సుబ్బారావు.

'కనుల నొండొరులను జూచుకొనుట కన్న
మనసులన్యోన్య రంజనల్ గొనుటకన్న
కొసరి 'యేమోయి' యని పిల్చుకొనుటకన్న
చెలులకిలమీద నేమి కావలయు సఖుడ' అంటూ భోగలాలస కంటే, మనో వికారాలకు లోనుగాని, స్నేహ భావనలు గల 'తృణకంకణం' నాయికకు పెద్ద పీట వేయించాడు. ఆయన 'స్నేహలత' వరకట్న దురాచారాన్ని నిరసించిన కావ్యం.

ఆంధ్రదేశం సాహితీక్షేత్రాన్ని దాదాపు మూడు శతాబ్దాల పాటు సస్యశ్యామలం చేసిన భావకవిత్వంలో దేశభక్తి కవిత్వం భారతీయుల జాతీయాభిమానాన్ని, ఆంధ్రుల అభిమానాన్ని వెలార్చింది. భారతీయుల స్వాతంత్ర్య కాంక్షను వ్యక్తం చేస్తూ, అందుకు ఆటంకంగా మారిన ఆంగ్లేయుల పాలనను దుయ్యబట్టింది.

'భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి' అంటూ చిలకమర్తి రాసిన పద్యం ఆంధ్రుల నోట ఊటయై, జాతీయ స్ఫూర్తిని రగిలించింది.

స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోరే తెలుగు కవిత్వం 'భరత ఖండంబె యొక పెద్ద బందెఖాన" అంటూ మాతృభూమి శృంఖలాలను త్రెంచటానికి వేగిరపడింది. 'నీచపు దాస్యవృత్తిలో మన నేరము' అంటూ కుండ బద్దలు కొట్టింది

' నాదు జాతి నా దేశము నాదు భాష
అను అహంకార దర్శనమందుమాంధ్రులారా!' అంటూ రాయప్రోలు పలుకుల్లో ఆత్మాభిమానాన్ని ప్రదర్శించింది.

జాతీయోద్యమ కాలంలో సంఘ సంస్కరణ కవిత్వం సంఘంలోని సామాన్యుల, ఆర్తుల అవసరాలను గుర్తించి 'నా జాతి మానవజాతి' బతికితే స్వతంత్రుణ్నయి బతుకుతాను లేకపోతే ఉండనే ఉండను' అంటూ మామూలు మానవుణ్ణి మకుటధారిని చేసే ప్రయత్నం చేసింది. కందుకూరి, గురజాడ,

త్రిపురనేని రామస్వామి చౌదరి వంటివారు ఈ మానవో ద్యమానికి మూలపురుషులు కాగా, ఆ కోవలో గాంధేయ దృక్పథంతో సర్వోదయ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన కవులు ఈ కవిత్వాన్ని సృష్టిచేశారు. దురాచార నిరసనం, వర్ణవ్యవస్థా నిరసనం; సంఘువ్యవస్థా నిరసనం, అస్పృశ్యతా నివారణ కవిత్వం ఈ కోవలోనివే.

'కల్లు త్రాగ బోకు – కడుపు మాడ్చుకోకు

నీ యిల్లు గుల్ల సేయగోరి – తమ్ముడా!' అంటూ పిలుపు నిచ్చిన గరిమెళ్ళ సత్యనారాయణ గీతం,

'తిన్నాడో పస్తులే యున్నాడో ముప్పొద్దు

గుడువ బెట్టును నీకు గడుపునిండ' అన్న కాటూరి కవిత్వం,

'మాలలు మాలలా ! భరతమాత గళాస్థచిరత్న రత్నసం లాలిత మాల'లన్న బహ్మభట్ట పట్టాభిరామశర్మ పంచమోద్ధార కవిత్వం ఈ కోవలోనివే.

గాంధీ సిద్ధాంత మార్దవ మార్గాటుడ నని చెప్పుకొన్న గుఱ్ఱం జాషువా 'అనాథ', 'గబ్బిలము' దళిత సమస్యనే ప్రధానంగా వస్తువు చేసుకొన్న కావ్యాలు. 'చిక్కిన కాసుచే దనివిజెందు నమాయకున్ని యెల్ల కష్టాలను బొక్కడు బువ్వతో మఱచి పోయే

కక్షుధానల దగ్ధమూర్తిని' కావ్య నాయకునిగా జేసి సహృదయుల వీక్షణాంచనాలు దళితులపైకి మళ్ళేలా చేసిన ఘనత జాషువాది. స్వీయానుభవంతో దళితుల సమస్యలను ఆర్థిక కోణంలో కూడా దర్శించి, అన్యాయాలను ధిక్కరించి,

'నన్ను తొలగించి లెక్కించినారు గాని,

తొలుత ఐదుగురమన్నదమ్ములము మేము' అని జాతీయతను ప్రకటించిన సహృదయ కవిత్వం జాషువాది.

'ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించే దేశంలో పేదల, ఫకీరుల శూన్య పాత్రలలో మెతుకు విదల్చేవారు" లేరని వాపోయిన జాషువా, 'నరుని కష్టపెట్టి నారాయణున్ని' కొలవటంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించిన కవి.

ఇన్ని అన్యాయాలకు, అంటరానితనానికి లోనౌతూ ఉన్నా 'నిఖిల లోకమెట్లు నిర్ణయించినగాని తిరుగులేదు, నాకు తిరుగు లేదు, విశ్వనరుడ'నంటూ 'నేను' కవితలో మానవౌన్నత్యాన్ని చాటి చెప్పిన కవి జాషువా.

ఆంధ్రుల కేతనం

జాషువా పద్యం

వ్యదార్థ జీవిత యదార్థ దృశ్యం

– డా. కొల్లూరి ఆనందరావు

'ఏ కులమంచు నన్ను వివరింపుల గూడినకుంటి ప్రశ్నలన్ వ్యాకుల పెట్టబోకుడదివ్యర్థ' మంటూ 'హృదయాకృతి జూచి సమాదరింపరే' యన్న బోయి భీమన్నది సంఘ సంస్కరణ

కవిత్వంలో బలమైన గొంతుక.

'చదువులే లేని నాకు ప్రాజదువు లేడ' అని వాపోయినా,

'ఉర్వి నాగతి నా చేత నుండె నేని

ముల్లుగా పుట్టి యందునా – పువ్వుగా కాక' అంటూ లోకహితాన్ని కోరిన మానవతావాది బోయి భీమన్న.

బోయి భీమన్న ఆశించేది –

'కులమత వర్ణ వర్గ విముక్తమైన

విశ్వైక మానవతా మార్గం.

అరుణ తరుణ గుణ వరీయులకు

ఆనంద రసాద్వైతం'.

అంటూ ఆర్థమతంలో అరమరికలు లేవంటాడు ఈ కవి.

అందుకే డా.కల్లూరి ఆనందరావు, బోయి భీమన్నను సంభావిస్తూ –

'శివ సోషలిజం

అద్వైత రసం

బోయి భీమన్న రమ్యాక్షర పథం' అంటాడు.

'నీకు నీవే దాసోహం

నీకు నీవె అభయంకరం

నీ పరిశ్రమే నీ సౌభాగ్యం

నీకు నీవే సమస్తం' అంటూ సామాన్యున్ని సంభావించిన కవి బోయి భీమన్న.

జంధ్యాల పాపయ్య శాస్త్రి కలం నుండి జాలువారిన –

'లెమ్మిక మేలుకొమ్ము! కదలింపుము క్రాంతి రథమ్ము శాంతి మా/ ర్గమ్మున, కాంతి పుంజములఖండములై నవజీవన ప్రభా

తమ్ములు నింప, సర్వసమతా సుమకోమల మానవాంతరం

గమ్ముల ప్రేమ సూత్రమున గట్టుము మంగళ తోరణమ్ములన్' అన్న పద్యం భావయుగంలో సమతా పరిమళాల్ని వెదజల్లిన వెలలేని మానవతా కుసుమం. ప్రేమతో మానవతా సూత్రంతో, సర్వమానవాళిని ముడి వేయాలన్న ఆకాంక్ష ఇందులో వ్యక్తమౌతుంది.

1952లో ప్రసాదరావు, పాండురంగారావు సంయుక్తంగా రచించిన 'కరుణా సింధువు' కావ్యంలో

'బీదసాదలనెల్ల ప్రేమించుమన్న

ఆదరింపగదన్న యార్తుల నెల్ల

శాంతియే లోకాల సత్య జీవనము

శాంతియే సౌఖ్యాల సర్వ కారణము' అంటూ మానవత్వం, శాంతికి మించిన శక్తి లేదని చాటుతారు. వేంకట పార్వతీశ కవులు రచించిన పంచమాభివందనములోని –

'మమత దప్పిన యాతడు మాలగాక

మాటదప్పిన యతడు మాలగాక

అన్నెమును బున్నెమెఱుగని యట్టి మాల
మాలయే? దేవు మెడ బూలమాలగాక !'

వంటి పద్యం అస్పృశ్యతా నివారణకై గళమెత్తిన మానవతా విలువలున్న గీతం.

'కదిలేదీ, కదిలించేదీ
మారేదీ, మార్పించేదీ
పాడేదీ, పాడించేదీ
పెను నిద్దుర వదిలించేదీ
మునుముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి' అంటూ అభ్యుదయ కవిత్వానికి బాటలు వేసిన శ్రీశ్రీ –

'నైలు నదీ నాగరికతలో/ సామాన్యుని జీవన మెట్టిది
తాజమహల్ నిర్మాణానికి/ రాళ్ళెత్తిన కూలి లెవ్వరు" అంటూ గనిలో, వనిలో, కారా?నాల్లో పరిశ్రమించే కర్షక, కార్మికుల ఘర్మ జలం కంటే విలువైనదేదీ లేదనటం మానవీయ విలువల కెత్తిన కేతనం.

"నూటికి యెనుబదియైదు/ మేటి కాపులుందు పుడమి
కూటికి బిచ్చము నెత్తుట/ లోటెకాదు సిగ్గు చేటు' అంటూ మానవ సమాజంలో తాండవమాడే పేదరికాన్ని సృష్టించిన వారిని నిరసించిన కాళోజీ నారాయణరావు.

"ఆర్జించెడు వారు లేక / ఆరగించువారుండిన
అమరతరువు కుబేరాస్తి / ఆగలేవు అంతమొందు' అంటూ సోమరులను నిరసించాడు.

'శక్తి మంతులగు వారలు /శక్తి వంచనంబు లేక
శ్రమల కోర్చునాడు గాని / జాతిధనం పెంపొందదు' అని శ్రమైక జీవనంలో వ్యక్తి వృద్ధిని, జాతీయ సంపద సమృద్ధిని ఆకాంక్షించాడు.

'స్వాతంత్ర్యంబున సఖుడా / స్వైరవిహారంబు గాదు
స్వైరవిహారుల కెపుడు / స్వాతంత్ర్యంబచ్చి రాదు' అంటూ బాధ్యత గలిగిన స్వేచ్ఛను ఆకాంక్షించటం ఆయన ప్రతిపాదించింది మానవతా విలువే.

'యాలరో ఈ మాదిగ బతుకు
ఎంత మొత్తుకున్నా దొరకదు మెతుకు' అన్న గద్దర్ గీతమైనా,
'ఆ రాత్రి పాలేరు వెంకన్న కలగన్నాడు
తాను కడుపునిండా భోంచేశానని' అన్న శివసాగర్ కవితైనా పేదల నికృష్టపు జీవితాలను ప్రతిబింబించేవే.

**స్త్రీవాద కవిత్వంలో:** తెలుగు కవిత్వంలో స్త్రీ సమస్యలపై వెలువడుతున్న కవిత్వం, 'అందమైన దోపిడీకీ – పవిత్రమైన హింసకూ; న్యాయమైన దాస్యానికీ – బలైపోతున్న' భారతీయ స్త్రీ గురించి... 'ఇంట్లో పెళ్ళాంగా/ నిత్యావసర వస్తువులై
వీధుల్లో / అవహేళనల మాటలు మోసే
కులం తక్కువ గాడిదలై
అటు గోడదెబ్బ, ఇటు చెంపదెబ్బా' తింటున్న స్త్రీలు, తమ సమస్యలపై రాసుకొన్న కవిత్వం ఇది.

"మూడుముళ్ళు ముప్పైక్షణాల్లో వేస్తే
మూడు కాళ్ళ ముదసలిలైనా
తలవొంచుకొనే నన్ను తరింపజేస్తున్నావ్" (డా.కల్లూరి ఆనందరావు) అంటూ భార్యలోని ఔన్నత్యాన్ని ప్రశంసించిన కవిత్వమూ, 'తల్లిగా ఆదిగురువై, బిడ్డకే అమాయక శిష్యరికం నెరిపే / శక్తియుక్తి ఆ మహత్తర మూర్తిదే' అంటూ తల్లిని తలకెత్తుకొన్న కవిత్వమూ మానవతా విలువలకు ఒక ఉదాహరణే.

**దళిత కవిత్వంలో** గుఱ్ఱం జాషువా, బోయిభీమన్న, కొలకలూరి ఇనాక్, శిఖామణి, ఎండ్లూరి సుధాకర్ మొదలైన కవులెందరో దళితుల దుర్భర పరిస్థితుల్ని చిత్రిస్తూ వారి అభ్యుదయానికై గళమెత్తుతూ రాసిన కవిత్వం 1909లో మాలవాండ్ర పాటతో మొదలైంది.

'అందారు పుట్టీరి హిందమ్మ తల్లివే
అందారు ఉందారి సూడంగ సక్కంగ' అంటూ అస్థిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం గళమెత్తిన దళిత కవుల కంఠం,

'పైసాలేని వారు/ పైగా దళితుడు
ప్రధానమంత్రి కాగలిగి/ ఐదేళ్ళూ ఉంది,
ఆపైన కదలి/ పైసా లేకుండా
బతగ్గలిగిననాడు / భారత దేశం బాగుపడ్డట్టు' అంటూ ఆచార్య కొలకలూరి ఇనాక్ కవితలో సమూహంగా ప్రతిధ్వనించింది. అభ్యుదయాన్ని ఆకాంక్షించింది.

"రండి !/ కాస్త సిగ్గుపడదాం
ఇన్నాళ్ళు మనల్ని క్షమిస్తూ వచ్చిన
ఆ దళితుడి కాళ్ళమీద పడి కన్నీళ్ళతో కడుగుదాం' అన్న రామిరెడ్డి కవిత్వం దళిత స్వరంలో సహృదయస్వనం.

మైనారిటీ, బి.సి., ప్రాంతీయ అస్తిత్వవాదాల్లో ముస్లిం, చేతివృత్తుల వారు, ప్రాంతీయంగా అస్థిత్వాన్ని కోరేవారూ సృష్టించిన కవిత్వం ఎంతో ఉంది. ఎంతగా మానవాభ్యుదయాన్ని కోరుతూ, మానవతా విలువల్ని ప్రతిబింబిస్తూ ఆధునికాంధ్ర కవిత్వం హోరెత్తినా, దువ్వూరి రామిరెడ్డి అన్నట్లు,

"ఏది సులువుగా సాధ్యపడదు లెమ్ము!
నరుడు నరుడౌట ఎంతొ దుష్కరమ్ము సుమ్ము !" ■

చిన్న కథ



# మెరిసేవన్నీ...

- శనగవరపు శిరీష

"సర్! ప్రభూ... సర్! త్వరగా రండి. మేడమ్ వెళ్ళిపోయా రంటే మనం బొకే ఇవ్వకుండానే తిరిగెళ్ళాలి." తొందర పెట్టాడు కమల్.

తమ ఆఫీస్ తరపు నుంచి బొకే ఇచ్చి, న్యూ ఇయర్ విషెస్ చెప్పడానికి ఎమ్మార్వో దగ్గరకు వచ్చారు వీఆర్వో ప్రభు, అతని అసిస్టెంట్ కమల్.

"ఆ...ఇంకా తొమ్మిదే కదా అయింది. ఎందుకంత తొందర? ఆవిడ రావాలి కదా! అసలే ఆడవారి సింగారం మామూలుగా ఉంటుందా?" బైక్ స్టాండ్ వేస్తూ, ఒకింత చులకనగా అన్నాడు ప్రభు.

"మీకు తెలీదు సర్! ఆ మేడమ్ మహా స్ట్రిక్ట్ అంట. టైమ్ అంటే టైమ్... మాటంటే మాట.. అని అందరూ చెప్పుకుంటు న్నారు." నెమ్మదిగా పక్కన చేరి చెప్పాడు కమల్.

"సరే! చూద్దాం!" అంటూ ఉండగానే కారు వచ్చి, ఎమ్మార్వో ఆఫీసు ముందు ఆగడం, అందులో నుండి ఆమె దిగి, హుందాగా నడుస్తూ... తనని విష్ చేసిన వారికి ప్రతి నమస్కారం చేస్తూ లోపలికి వస్తూండడం చూశాడు. పింక్ కలర్ చీర, అదే కలర్‌లో పెదవులకు లైట్‌గా అద్దిన లిప్‌స్టిక్, జారుముడి, మెడ, చెవులకి సన్నటి క్రిస్టల్ సెట్. కళ్ళలో కొట్టొచ్చినట్టు కనపడుతున్న ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తూ తన కేబిన్‌లోకి వెళ్ళిపోయింది.

కళ్ళ ముందు మెరుపు మెరిసిందా అన్నట్టు చూస్తూండి పోయాడు ప్రభు. ఆ...మె, ఆ...మె అనుకుంటూ, అయోమయం గా చూస్తూ.. నెమ్మదిగా అడుగులు వేసి, ఆఫీస్ కారిడార్‌లోకి చేరాడు.

"ఏంటి సర్?మేడమ్ వచ్చినపుడు మీరు కూడా బొకే ఇచ్చేయచ్చుగా? అసలే ఇంటి దగ్గర పిల్లలు గొడవ పెడు తున్నారు. ఇవాళ బయటకి తీసుకెళ్ళమని." ఒకింత విసుగ్గా అన్నాడు కమల్.

"ఇపుడు మేడమ్ రమ్మనేదాకా ఎదురుచూడాలి. ఎంత టైమ్ పట్టుద్దో..." సన్నగా నసుగుతున్న కమల్ వంక చురుగ్గా చూసి, అక్కడున్న కుర్చీలో కూలబడ్డాడు ప్రభు. అతని మనసంతా గందరగోళంగా ఉంది. తను ఏంజెల్‌యేనా? లేక తనేమైనా భ్రమ పడ్డాడా? అన్న సందేహంతో సతమతమవుతూ అతని ఆలోచనలు గతంలోకి పయనించాయి.

❖❖❖

ఏంజెల్ ... మదర్ థెరిసా ఆశ్రమంలో పెరిగిన అనాథ. పాతికేళ్ళ వయసుకే వీఆర్వో అయిన ప్రభు తన తల్లిదండ్రులతో కలిసి చర్చికి వెళ్ళినపుడు అక్కడ పాట పాడుతున్న ఏంజెల్‌ని చూసి, ఆమె సంస్కారానికి ప్రభు తల్లిదండ్రులు ముగ్ధులయ్యారు. ప్రభుకి కూడా ఆమె నచ్చడంతో ఆశ్రమం వారికి చెప్పి సంబంధం ఖాయం చేసుకున్నారు.

రెండు, మూడేళ్ల తరువాత ప్రభుకి ఆమె పట్ల విముఖత మొదలైంది. చిన్న చిన్న తగాదాలు వచ్చినా ఆమె సర్దుకు పోవడం అలవరుచుకుంది. ఎప్పుడూ ఏదో ఒక పనిలో ఉంటూ, వయసు మీద పడిన అత్తమామల సేవలో తలమునకలయ్యే ఏంజెల్ అతని కళ్ళకు నచ్చడం లేదు.

"ఆఫీస్ కొలీగ్స్‌లో ఆడవారు ఎంతందంగా రెడీ అవుతారో తెలుసా? నువ్వూ ఉంటావు... ఎప్పుడూ ముతక చీర, చింపిరి జుట్టు" అంటూ ఈసడించేవాడు.

"ఒక్కసారి ఆ ఆడవారిని ఇంటికెళ్ళి చూడు". అనాలనిపించేది ఆమెకు. కానీ ప్రభుకి ఒకఖిప్రాయం కలిగితే అది మార్చడం చాలా కష్టమని ఆమెకు తెలుసు. పుట్టిల్లున్నా కొన్నాళ్ల పాటు హాయిగా విశ్రాంతి తీసుకునే అవకాశం ఉండేది. అవేమీ లేని తనకు పనికి తోడు ఈ ఈసడింపులు అభిమానాన్ని దెబ్బ తీస్తున్నాయి. అత్తమామలు మంచివారే కానీ, ముందుగా అతనికి తల్లిదండ్రులు కదా! కొడుకును కాదని ఆమెకు సహకరించడం లాంటివి లేవు. 'సర్దుకుపోవాలమ్మా!' అంటూ నెమ్మదిగా చెప్పేవారు.

మరో ఏడాదిలో అత్తమామలు వరుసగా కాలం చేసారు. తను కూడా మోదరన్‌గా రెడీ అవుతూ అతనికి నచ్చేలా ఉండాలని ప్రయత్నించింది. కాని అప్పటికే ఆమె తన శరీరం పట్ల చూపించిన నిర్లక్ష్యం కారణంగా హార్మోన్స్ బేలెన్స్ తప్పి లావు అయిపోయింది. ప్రభు ఆగడాలు ఎక్కువైపోయాయి. చీటికి మాటికి ఆమెను కించపరిచే మాటలతో హింసించేవాడు,

"చదువుకున్న మొద్దువి" అంటూ ఈసడించిన క్షణం ఆమెలో సహనం నశించిపోయింది. ఆమె ఇల్లు వదిలి, ఆశ్రమంలో తలదాచుకోవడం, డివోర్స్ తీసుకోవడం వెంటవెంటనే జరిగిపోయాయి.

ఆ విడాకుల విషయంలో కూడా "ఇన్నేళ్ళలో ఆమెకు పిల్లలు కలగకపోవడానికి కారణం గొడవలు కాదనీ, ఆమెలో హార్మోన్స్ లోపమేనని" అడ్డంగా వాదించాడు. డివోర్స్ వచ్చాక అతడామె గూర్చి కనుక్కోలేదు.

❖ ❖ ❖

మళ్లీ ఇన్నేళ్ళకి ఇలా... ఏంజెల్ అన్న పేరుకు నిదర్శనంలా ఆమె ప్రత్యక్షమైంది. ముప్పై అయిదేళ్ల వయసులో ఆమె అంత ఠీవిగా తనముందుకు వస్తుందనీ, అదీ... తనకు ఉన్నతాధికారిగా వస్తుందని అతననుకోలేదు.

నిజానికి ఏంజెల్ మంచి రూపసి కనుకనే.. తల్లిదండ్రుల మాట వెంటనే ఒప్పుకుని ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఆమెలో వచ్చిన మార్పులన్నిటికీ కారణం అధిక శ్రమ, ఆమె పట్ల తను చూపిన నిర్లక్ష్య ధోరణితో ఆమెలో కలిగే ఒత్తిడి అని, ప్రభుకి తెలుసు. కానీ... అందుకు ఒప్పుకోలేని అహం తనది.

మరొకామెను పెళ్ళి చేసుకున్నా అతని జీవితంలో శాంతి కరువైంది. ఇదివరకులా ఎప్పుడు పడితే అప్పుడు ఇంటికి వెళ్లడం, ఏ మాట పడితే ఆ మాట అనడం చేస్తే ఆమె అస్సలు ఊరుకోదు. పైగా ఆమె తండ్రికి పోలీస్ డిపార్ట్మెంట్‌లో మంచి పలుకుబడి ఉన్న కారణంగా బయట మనుషులతో మాట్లాడినపుడు గొప్పగా బిల్డప్ ఇచ్చినా ఇంట్లో తన పరిస్థితి పిల్లి కన్నా హీనమే!

ఏంజెల్ మొదట్లో తన జీవితం ఇలా అయిందేమిటోనని బాధపడినా, శ్రేయోభిలాషులిచ్చిన ప్రోత్సాహంతో కోచింగ్ తీసుకుని గ్రూప్ పరీక్షలు రాసి, ఎమ్మార్వోగా సెలెక్ట్ అయింది. ఒక క్రమపద్ధతిలో తన జీవన విధానం మార్చుకుని నేడు ఇలా ప్రభు పనిచేసే చోటుకే ట్రాన్స్ఫర్ మీద వచ్చింది.

❖ ❖ ❖

"సార్...సా..ర్ మేడమ్ లోపలికి రమ్మన్నారు." అన్న అసిస్టెంట్ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు ప్రభు.

గతంలో తన మాటలతో అవమానించిన ఆమె ముందు, ఇప్పుడు తను మర్యాదిస్తూ... నిలబడాలంటే చాలా బాధగా ఉంది. నిజం చెప్పాలంటే మనసులో గిల్టీగా ఉంది. అయినా తప్పక కుర్చీలో నుంచి లేచాడు.

"ఇప్పుడేమంటుందో... పాత విషయాలు మనసులో పెట్టుకుని ఉద్యోగపరంగా తననెన్ని మాటలంటుందో... "

ఏ ప్రశ్నలడిగితే, ఎలా సమాధానం చెప్పాలి? గతాన్ని గుర్తు చేస్తే ఎలా రియాక్ట్ అవాలి? అనే ఆలోచనల చదరంగం అతని బుర్రలో గిర్రున తిరుగుతోంది. గుండె గుబగుబ లాడుతుండగా అసిస్టెంట్ త్వరపెడుతుంటే లోనికి నడిచాడు. ఎదురుగా హుందాగా కూర్చుని ఉన్న ఆమెకు బొకే అందించి విష్ చేసాడు. చాలా సాధారణంగా మాట్లాడి, అతను పనిచేసే ఏరియాకు చెందిన కొన్ని ప్రశ్నలడిగింది ఆమె. తడబడుతూ.. తనకు తెలియకుండానే వినయం ప్రదర్శిస్తూ.. జవాబులిచ్చి, బయటకు నడిచాడు. బయటకు వస్తూ..వస్తూ... "అసలు తను ఏంజెల్ అవునా కాదా? అనలిలా ఎలా జరిగింది?'' అనుకుంటూ... అక్కడున్న నేమ్ ప్లేట్ వంక చూసాడు. ఏంజెల్ అన్న అందమైన అక్షరాలు మెరుస్తూ, కనపడ్డాయి.

అన్యమనస్కంగా ఇంటికి చేరిన అతనికి టీవీలో సాంగ్‌కి రెండు కాళ్ళూ రిథమ్‌కి అనుగుణంగా కదుపుతూ స్టెప్స్ ప్రాక్టీస్ చేస్తున్న భార్య కనపడింది. విడిచిన బట్టలు, ఉతికిన బట్టలు కలగాపులగంగా సోఫా, కుర్చీల్లో ఉన్నాయి.

గొంతు ఎండినట్టుగా అనిపించి, మంచినీళ్ల కోసం కిచెన్‌లోకి వెళ్ళాడు. పనిమనిషి రాలేదేమో! సింక్ నిండా రాత్రి పడేసిన అంట్లు... వాసన వస్తూ అలాగే ఉన్నాయి.


నీరసంగా సోఫాలో కూలపడ్డాడు. తనకేమీ పట్టనట్టు ఆమె టీవీలో లీనమైపోయే ఉంది. మధ్యలో ఒకసారి తల తిప్పి చూసి, "నాకు మధ్యాహ్నం ఫ్రెండ్స్‌తో పార్టీ ఉంది. నువ్వు స్విగ్గీలో ఆర్డర్ పెట్టేసుకో..!" అంది.

ఒక్కసారిగా మనసులో ఏంజెల్ మెదిలింది అతనికి. బాధ్యతల బరువు మొత్తం ఆమె మీద పెట్టి తను స్వేచ్ఛగా విహరించేవాడు. ఒకప్పుడు నానామాటలాడిన తనను కావాలంటే ఉద్యోగపరంగా అవమానించే అవకాశం ఉన్నా, అలా ఏమీ జరగనట్టు అవసరమైనంత వరకే మాట్లాడి పంపించింది. ఆమె తనకందనంత ఎత్తుగా ఆకాశమే హద్దుగా సాగుతున్నట్టు, తను తన అహం కారణంగా నేలలోకి దిగబడి పోయినట్టు అనిపించ సాగింది.

అంతలోనే పార్టీకి రెడీ అవుతున్న అందమైన తన భార్యను చూసి నిట్టూర్చి,మనసులో అనుకున్నాడు. 'మెరిసేవన్నీ... బంగారం కాదు.' అని. ■

## డా.వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

**సు**ప్రసిద్ధ సాహితీవేత్త డా. వాసా ప్రభావతి సంస్మరణార్థం నిర్వహిస్తున్న కవితల పోటీకి భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భమే ప్రధాన వస్తువు. రూ. 3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయి. రూ.500 చొప్పున 8 ప్రత్యేక బహుమతులు ఉంటాయి. దేశభక్తిని పెంపొందించే అంశాలకు ప్రాధాన్యం కుల, మతాల విభేదాలని మరచి శాంతి సామరస్యాలతో ప్రజలంతా పురోగామిపథంలో ప్రయాణించాలన్న భావనలకు బలం చేకూరే అంశాలు వస్తువుగా ఉండటం ఉపయుక్తం. వచన కవితలు ఎన్ని లైన్లయినా ఉండొచ్చు. కవితలు పంపించడానికి చివరి తేదీ : 30 ఏప్రిల్ 2023. పంపించాల్సిన చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500 044. ఫోను : 94900 99327. palapittamag@gmail.com



## పొద్దు పోతున్న దిక్కు

పొద్దు పోతున్న కొద్దీ
మెల్లమెల్లగా మెతుకు ఆశలు మేల్కొంటాయి
చేనంచున వాలితేనే వాళ్ల పాణం పచ్చబడుతుంది
వలాంచి వరి మునుము
కొడవలి పదును కొయ్య కాళ్ళ చదును
వాళ్ళిద్దరి చేతుల్లోనే అడుగులేస్తయి
మెదలన్ని తలమీద మేల్తలపులవుతయి

పొద్దుపోతున్న దిక్కున చీకటి చిక్కనవుతున్న కొద్దీ
మంచె ముఖం మీద మనాది తప్ప
ఏ నిదుర పిట్టా వాలదు
పొద్దు పొరలుతున్న దిక్కున
తూర్పార పట్టిన కళ్ళం కతలు
గట్టి గింజలా మిగిలే లోపు
వట్టి పొట్టులా ఊడ్చుకుపోతుంటయి
పొద్దు పోతున్న సందీ
చీకటి ముసురుతున్న కొద్దీ
రాజనాల బండ మీద దిగులు ముఖాన్ని దిద్దుకుంటరు

పొద్దు గడుస్తున్న దిక్కు
చేదు చెట్టు కింద
మైసమ్మ తల్లి ఒక్క పొద్దూ ఇడవలేదు
తమ్ముడు పోతరాజు నాలుక పదన పట్టలేదు
పొద్దు పోరుతున్న దిక్కున
ఈరకోలతో చవిటి చట్టాల వీపును చాచి కొడితే
దేశం వెన్నెముక మేరులా నిలిచి గెలుస్తుంది

ఈ పొద్దు
పొద్దు పోతున్న ఎదురు దిక్కులో
దుక్కి వేళ్ళే కొత్త పొద్దును నున్నగా దిద్దుతాయి!

**- బొప్పెన వెంకటేష్**

## అయిదో గది కావాలి!

రేకులు విచ్చుకోని లేత గులాబీని
నులిమేస్తున్న రాక్షస హస్తాలు!
ఆడతనానికి ఖరీదు కట్టి
అంగడిలో వేలం వేస్తున్న అపర కీచకులు!
రెక్కల కష్టాన్ని రాబందులై తన్నుకుపోతున్న దళారులు!
అక్రమార్జనపై అక్కరతో
వక్రమార్గాన్ని వ్యసనంగా మార్చుకున్న వ్యాపారులు!

అధికారాన్ని అత్యాదాయ వనరుగా మార్చుకుని
సామాన్యుల జీవితాన్ని శాసిస్తున్న
అవినీతి తిమింగలాలు!
కలానికి, హలానికీ కూడా కులతిలకమంటించి
మానిపోయిన గాయాల మచ్చలు చూపి,
ఓట్ల కోసం కక్షల కాష్టాలను
రగిలిస్తున్న కుటిల రాజకీయాలు!
మండుతున్నవి మానవత్వపు శకలాలని
మరచిపోయి
ప్రజాస్వామ్యంలో ప్రేక్షకపాత్ర పోషిస్తున్న పాలక వర్గాలు!
పైసల పోరులో ప్రేమాభిమానాలకు నీళ్ళదిలి
పేట్రేగిపోతున్న పైశాచికత్వాలు!
పంపకాల తరాజులో తూగలేక
వృధాశ్రమాల పాలవుతున్న ప్రేగుబంధాలు!
సంపాదనపై మోజు శకుని పాత్ర పోషిస్తూ
కుటుంబానికో కురుక్షేత్ర బీజం వేస్తుంటే
ధర్మాన్ని, న్యాయాన్ని ధృతరాష్ట్ర కౌగిలికి
వదిలేసిన నేటి (అ)నాగరిక సమాజంలో
మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలే!
స్వార్థం సిరలలో, దానవత్వం ధమనుల్లో చేరి
నాలుగు గదులనూ నియంత్రిస్తుంటే
మంచి చెడుల విచక్షణను మేల్కొలిపి
మానవత్వాన్ని మరలా నింపుకునేందుకు,
మనిషి గుండెకిప్పుడు మరో ఖాళీ గది కావాలి!
యంత్రాల సహవాసంలో
మొద్దుబారిపోయిన మనసుకు ,
మనిషితనాన్ని గుర్తు చేస్తూ మ్రోగే
సరికొత్త గడియారమొకటి అమర్చుకోవాలి!

**- సత్య చాగంటి**
**9948834608**



## అయినా, ఒక పిలుపు ...

వచ్చేవాళ్లు వెళ్లే వాళ్ళు ఉండేవాళ్ళు
నిత్య జాతరలా ఆసుపత్రి.
పాత్రలు మారే
ఉత్సవమూర్తులతో..
ఆసుపత్రి ఒక దేవాలయం.

చెట్లపై పక్షులు
నేలపై గడ్డి పురుగులు
రంగురంగుల గోడలపై
రంగు వెలసిన కీటకాలు,
అనేక మరణాల్ని,
అనేక పుట్టుకలని జ్ఞప్తికి తెస్తూనే ఉంటాయి.
ఆసుపత్రి ఒక అరణ్యం.

నిశ్శబ్దం, నిర్వేదం, అయోమయం సందిగ్ధం,
ఒక వెతుకులాట
అలసిపోయిన వాళ్ళు, పోరాడే వాళ్ళు,
అలుపన్నదే తెలియని వాళ్లు కొందరు.
ఆసుపత్రి ఒక క్రీడా మైదానం.

పలకరింపుల భజనలు
ఫోన్ కాల్స్ లోనే ప్రేమలు
ప్రేమతో కదిలి వచ్చే వాళ్ళు కొందరే.
కాలమంతా మాటలతోనే  ఎందరో.
ఎన్నో పాత్రలు,
నటనలు, కథనాలు,
మలుపులు, ముగింపులు
ఆసుపత్రి ఒక నాటకం.

నవ్వులు, దుఃఖాలు,
ఆందోళనలు ఆదుర్దాలు, సంతోషాలు, పరిచర్యలు ,
ఇంకా ఎన్నో కొత్త కొత్త పరిచయాలు..

రోగం పాతబడే కొద్దీ
మనిషికి మాటే ధైర్యం, ఉపశమనం.

తనకోసమో ఇతరుల కోసమో
ఆసుపత్రిని సందర్శించని మనిషే  లేదు.
అయినా
ఒకప్పుడు ధైర్యం చెప్పిన వాళ్ళే
ఇంకొకప్పుడు అధైర్యపడతారు
ఒకప్పుడు అధైర్య పడినవాళ్ళే
ఇంకొకప్పుడు ధైర్యం చెబుతారు.
దుఃఖం ధైర్యం ఓదార్పు మారతాయి.

కలతలు, కన్నీళ్ళు ,మమతలు, ఊరడింపులు మారుతాయి.
మనుషులు మారుతారు.
తారుమారవుతారు
ఆసుపత్రి ఒక మాయాజాలం.

❖❖❖

దూరమైన వాళ్ళు కళ్ళల్లోనే మిగిలిపోతారు.
అప్పుడు ఆసుపత్రులు
చేదు విషపు గుళికలవుతాయి.
వేదాంతం, విరక్తి, దుఃఖోపశమనం
ఆసుపత్రి ఒక ప్రహేళిక.


ఎప్పుడో, అక్కడ ఉన్నట్టుండి
ఒక పసిబిడ్డ గొంతు విప్పుతుంది.
అనేక దుఃఖాల మధ్య అనేక విరామాల మధ్య
ఎన్నెన్నో జ్ఞాపకాల మధ్య
ఆ పసి ఏడుపు, ఆ పసి పిలుపు
మనిషిని మళ్లీ ఈలోకంలోకి తెచ్చిపడేస్తాయి ..

అప్పుడు కదా అప్పుడు కదా
మనిషి కళ్ళనిండా వెలుగు
మొహం నిండా ఒక నవ్వు.

ఆసుపత్రి
అప్పుడు
నిజంగా శక్తి క్షేత్రం !

**- పలమనేరు బాలాజీ,**
**94409 95010**

**పరిచయం**






# విప్లవ చారిత్రిక నవల 'డిసెంబ్రిష్టు ఖైదీ'

**- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**
**94402 22117**

**"తమ తిరుగుబాటు ఒక జార్‌ని దించేసి మరో జార్‌ని, లేదా మరో పాలకుడ్ని సింహాసనం మీద కూర్చోబెట్టడం కాదు. ఒక మహాలక్ష్యం కోసం ఉద్దేశించినది" (సెర్గీ మాట)**

**The secret of beauty is the secret of life. The beauty of life is the beauty of struggle.** (Y. Borev : Aesthetics, p.44 & 46)

**(జీవిత రహస్యమే సౌందర్య రహస్యం. సంఘర్షణ సౌందర్యమే జీవిత సౌందర్యం)**

జీవితం, సంఘర్షణ, సౌందర్యం – ఇవి ఒక విడదీయరాని త్రయం. రచయిత నాగభూషణ్ రచించిన బృహన్నవల "డిసెంబరిస్టు ఖైదీ" ఒక చారిత్రక నవల. ఒక ఉద్యమ చరిత్రను ప్రతిబింబించిన నవల. 1825 డిసెంబరులో రష్యాలో జరిగిన తిరుగుబాటు, దాని పరిణామాలు దీని వస్తువు. 1917 నాటి సోవియట్ బోల్షివిక్ విప్లవం ప్రపంచమంతా తెలిసిన ఉద్యమం. కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ రూపొందించిన మార్క్సిజం సిద్ధాంతాలకు అనుగుణంగా వి.ఐ.లెనిన్ నాయకత్వంలో శ్రామిక ప్రజలు జార్ పాలకుల మీద తిరుగుబాటు చేసిన విప్లవం బోల్షివిక్ విప్లవం. ఈ విప్లవానికి ముందే రెండు విప్లవోద్యమాలు జరిగాయి. 1825 డిసెంబరులో జరిగిన సాయుధ సైనిక తిరుగుబాటునే డిసెంబరిస్టు విప్లవం అంటారు. 1860 – 70 దశకాల మధ్యకాలంలో వచ్చిన మరో ఉద్యమాన్ని నరోద్నిక్ విప్లవం అంటారు. ఈ రెండు విప్లవాలు వచ్చినట్టే వచ్చి, అణచివేతకు గురయ్యాయి. ఈ రెండింటి వైఫల్యాల నుంచే మూడో విజయం సాధ్యమైంది. రెండు అపజయాలు తుది విజయానికి దారిని సుగమం చేశాయి. వాటిలో మొదటి విప్లవం అయిన డిసెంబరిస్టు విప్లవం మీద నాగభూషణ్ పరిశోధన, అధ్యయనం చేసి రచించిన 'డిసెంబరిస్టు ఖైదీ' ... ఒక రాజకీయ చారిత్రక నవల. ఒక విప్లవ చారిత్రక నవల.

ఉద్యమ నవలలు రెండు రకాలుగా ఉంటాయి. 1. సమకాలీన ఉద్యమ నవలలు. 2. ఉద్యమ చారిత్రక నవలలు. సమకాలీన ఉద్యమ నవలలు ఉద్యమం నడుస్తున్న కాలంలోనే వస్తాయి. వాటిని ఉద్యమంలో పాల్గొన్నవాళ్ళు గానీ, ఉద్యమాన్ని చూసిన వాళ్ళు గానీ రాస్తారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' ఇలాంటి నవల. 1920 – 22 మధ్య పల్నాడు ప్రాంతంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో ఉన్నవ పాల్గొన్నారు. 1921 –22 మధ్య రాయవేలూరు జైలులో ఖైదీగా శిక్షను అనుభవిస్తూ ఆ నవలను రాశారు. ఆ కాలపు ఉద్యమాన్నే మహీధర రామమోహనరావు గారు 1950 తర్వాత 'కొల్లాయి గట్టితేనేమి?' నవలగా రాశారు. 1921 – 22 నాటి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఆయన మూడున్నర దశాబ్దాల తర్వాత నవలగా రాశారు. అది ఉద్యమ చారిత్రక నవల. నాగభూషణ్ గారి "డిసెంబరిస్టు ఖైదీ" అలాంటి ఉద్యమ చారిత్రక నవల. 1825 నాటి ఉద్యమాన్ని రెండొందల ఏళ్ళ తర్వాత ఆయన నవలగా రాశారు. మహీధర భారతీయుడు, తెలుగువాడు. ఆ ఉద్యమం భారతదేశంలో, తెలుగునాట జరిగింది. ఆ ఉద్యమం నాటికే ఆయన ఉన్నారు. 'డిసెంబరిస్టు ఖైదీ' రష్యాలో జరిగిన ఉద్యమం. 1825లో జరిగింది. రచయిత భారతీయుడు, తెలుగువాడు. ఆ ఉద్యమం నాటికి రచయిత పుట్టలేదు. అది ఆయన అధ్యయనంలోంచి, ఆయన భావజాలంలోంచి పుట్టుకొచ్చిన నవల. ఇది చాలా శ్రమతో కూడిన పని. నాగభూషణ్ శ్రమకోర్చి రాసిన నవల 'డిసెంబరిస్టు ఖైదీ'. సమకాలీన ఉద్యమ నవల రాయాలంటే, ఉద్యమానుభవం, లేదా ఉద్యమ పరిశీలనాజ్ఞానం ఉంటే చాలు. ఉద్యమ చారిత్రక

నవల రాయాలంటే చారిత్రక అధ్యయనం చేయాలి. చరిత్ర జ్ఞాపకంతోపాటు దాని అవగాహన కూడా ఉండడం చాలా అవసరం. అధ్యయనం చేసేవాళ్ళ భావజాలాన్ని బట్టి, వాళ్ళకు చరిత్ర అర్థమౌతుంది. నాగభూషణ్ రష్యన్ చరిత్రనూ, రష్యన్ సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథం నుంచి అధ్యయనం చేశారు. డిసెంబరిస్టు ద్యమాన్ని రచయిత వర్గదృక్పథంతో అర్థం చేసుకున్నారు. అలాగే రాశారు. ఈ నవలలో కూడా కొన్ని చారిత్రక పాత్రలు, కొన్ని కల్పిత పాత్రలు కూడా ఉన్నాయి. చారిత్రక పాత్రలకే రచయిత అధిక ప్రాధాన్యతనిచ్చాడు.

ఎక్కడో సుదూరంగా ఉన్న దేశంలో, అది కూడా వేరే శీతోష్ణస్థితులు కలిగిన దేశంలో రెండొందల ఏళ్ల కిందట జరిగిన సంఘటనలను చాలా కూలంకషంగా అధ్యయనం చేసి తన ప్రతిభనంతా రంగరించి సైబీరియా ప్రాంత రచయిత రాయగలిగినంత వాస్తవికంగా రాయగలగడం పాఠకులను ఆశ్చర్యంలో ముంచివేస్తుంది. చరిత్రలో కలిసిపోయిన కథలను ఆ కాలపు వాతావరణంలో, అప్పటి సంఘర్షణలను కళ్లకు కట్టినట్లు రాశాడు రచయిత.

మహీధర రామమోహనరావు గారి 'కొల్లాయి గట్టితేనేమి?' నవల మీద ఒక పెద్ద వ్యాసం రాస్తూ, రాచమల్లు రామచంద్రా రెడ్డి గారు ఆ నవలను ఒక గొప్ప చారిత్రక నవలగా నిర్వచించారు. ఆ సందర్భంగా ఆయన చారిత్రక నవలకు నాలుగు ముఖ్యమైన లక్షణాలను పేర్కొన్నారు. అవి : 1. చారిత్రకత 2. దేశకాల నిర్దిష్టత. 3. చారిత్రక శక్తులకు, చారిత్రక ధర్మాలకు ప్రతినిధులుగా పాత్రల సృష్టి 4. నవలలో చిత్రింపబడిన చరిత్ర తన గత చరిత్ర అనే అనుభూతిని పాఠకులకు కలిగించడం. (రారా : సారస్వత వివేచన, పు. 17)

'డిసెంబరిస్టు ఖైదీ' నవలలో ఈ నాలుగు లక్షణాలు చక్కగా అమరాయి. డిసెంబరిస్టు విప్లవం రష్యా చరిత్రలో ఒక దశా విశేషం. దేశకాల నిర్దిష్టతను నవలా రచయిత చాలా జాగ్రత్తగా పునర్నిర్మాణం చేశారు. ప్రయాణ సౌకర్యాలు లేని ఆ కాలంలో రోజుల తరబడి గుర్రపు బండ్లలో రాజ కుటుంబాలు సైతం చేసిన ప్రయాణాన్ని రచయిత చాలా సమాచార సేకరణతో చిత్రించారు. అప్పటి దేశకాల పరిస్థితులకు నవలలోని పాత్రలకు, సన్నివేశాలకు కార్యకారణ సంబంధాన్ని రచయిత చక్కగా కల్పించాడు. ఈ నవలలోని పాత్రలు చారిత్రక వ్యక్తులుగా ఉంటూనే చారిత్రక సమూహాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న అనుభూతి కలిగిస్తారు. నవలలోని పాత్రల మధ్య జరిగే సంఘర్షణ అప్పటి వర్గాల మధ్య జరిగే సంఘర్షణగానే అర్థమవుతుంది. సోవియట్ రష్యా పతనం, జర్మనీ పరిణామాలు, తూర్పు యూరప్ పరిణామాలు, చాలా దేశాల్లో వామపక్షాలు విజయాలు సాధిస్తూ ఉండడం వంటివి చూస్తుంటే ఆ కార్యకారణ సంబంధం అర్థమౌతుంది. చారిత్రక నవల అయిన 'డిసెంబరిస్టు ఖైదీ' నవల చరిత్రకు డాక్యుమెంట్‌గా రూపొందలేదు. నవలగా పరిణతి చెంది ఇప్పటి రూపం తీసుకుంది.

◆ ◆ ◆

ఒకనాటి రష్యాను అనేకమంది జార్ చక్రవర్తులు సుదీర్ఘకాలం పాలించారు. ఈ నవలలో అయిదుగురు జార్ చక్రవర్తులు కనిపిస్తారు. జార్ చక్రవర్తుల దుర్మార్గ పాలన మీద తిరుగుబాటే డిసెంబరిస్టు ఉద్యమం. సాధారణంగా ఒక విప్లవోద్యమం పీడితుల నుంచి ప్రాణం పోసుకుంటుంది. బాధితుల నుంచి పుడుతుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం రాజుల, దేశముఖ్, పటేల్ పట్వారీల నిరంకుశత్వంలో నలిగిన శ్రామిక జనమంతా చేసిన పోరాటం. భారత స్వాతంత్ర్యోద్యమం పరాయి పాలనలో నలిగిపోయిన ప్రజలు నడిపిన ఉద్యమం. 1917లో విజయం సాధించిన బోల్షివిక్ విప్లవం కూడా జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా శ్రామికులు నడిపిన ఉద్యమ ఫలితం. అయితే డిసెంబరిస్టు ఉద్యమం అలాంటిది కాదు. సంపన్నులు, జార్ చక్రవర్తి దగ్గర పెద్ద ఉద్యోగాలు చేసేవాళ్ళు నడిపిన ఉద్యమం. వాళ్ళంతా జారిస్టు పాలన వల్ల లాభపడినవాళ్ళు. వాళ్ళు రాచరికం లేని రిపబ్లిక్‌ను కోరుకున్నారు. దున్నేవాళ్ళకే భూమి చెందాలని కోరుకున్నారు. జాతుల వివక్ష రద్దు కావాలని కోరుకున్నారు. బానిసత్వ నిర్మూలనను కోరుకున్నారు. అందరికీ సమానత్వ హక్కులను కోరుకున్నారు. పురుషులు విప్లవంలో ఉంటే, వాళ్ళ స్త్రీలు సైబీరియా ప్రాంత అభివృద్ధికి కృషిచేయడం, జార్ నిరంకుశత్వాన్ని ధిక్కరించడం ఈ నవలలో చూడవచ్చు.

ఇది పేరుకు డిసెంబరిస్టు విప్లవ నవల అయినా, ఇది ఆ విప్లవంతో ఆగలేదు. నరోద్నిక్ విప్లవం, బోల్షివిక్ విప్లవం కూడా ఈ నవలలో క్లుప్తంగా చిత్రింపబడ్డాయి. అందువల్ల ఈ నవల దాదాపు నూరేళ్ళ రష్యన్ చరిత్రకు ప్రతిబింబం.

ఈ నవల ప్రధానంగా సైబీరియా కేంద్రంగా నడుస్తుంది. అందువల్ల రచయిత మొదట ప్రవేశిక అనే శీర్షికలో మొదట సైబీరియా రష్యాలో కలిసిన తీరును ఆసక్తికరంగా వివరించారు. ఆ పరిచయం లేకుంటే విదేశీ చరిత్ర వస్తువుగా గల ఈ తెలుగు నవలను ఇప్పటి పాఠకులు అర్థం చేసుకోవడం కష్టమయ్యేది.

సైబీరియా రష్యాలో అంతర్భాగమైన రెండున్నర శతాబ్దాల తర్వాత జరిగిన కథ ఈ నవలలో కథ. దాదాపు అది జరిగిన తర్వాత నూరేళ్ళ చరిత్రను ఈ నవల మనకు చెబుతుంది.

ఇలాంటి వస్తువును నవలగా రాయడం కత్తిమీద సామే. ఈ నవలలో చాలా చరిత్ర, ప్రయాణ సమయంలోనూ, తీరిక సమయంలో సంభాషణా రూపంలోనూ చిత్రింపబడింది. రచయిత శిల్పపరమైన జాగ్రత్త తీసుకోవడం వల్ల ఈ పద్ధతి ఫలవంతమైంది.

నవల ప్రారంభమే మాస్కో రాజమార్గంలో 'కబీత్క' అనేరకం గుర్రపుబండిలో ఇద్దరు మహిళలు ప్రయాణం మొదలు బెట్టడంతో జరుగుతుంది. ఆ ప్రయాణం సుదీర్ఘమైనది. కష్టమైనది. ఆ ప్రయాణం మనకు చాలా చరిత్రను ఆసక్తికరంగా చెబుతుంది. రష్యా దేశానికి తేయాకుకు సంబంధం ఏర్పడిన కథనం చాలా ఆసక్తిగా ఉంది. ఆ గుర్రబ్బండిలో ప్రభు వంశానికి చెందిన యువతి మరీయావోల్కోన్స్కయా, ఆమె సహాయకురాలు మాషా ఉంటారు. మరీయ తన ఏడాది నిండని కొడుకును – నీకొలస్‌ను అత్త దగ్గర వదలిపెట్టి, అనారోగ్యంతో యుద్ధఖైదీ శిక్షను అనుభవిస్తున్న భర్త దగ్గరికి బయలుదేరడంతో నవల మొదలౌతుంది. ఆమె భర్తను చేరుకోవడానికి అనేక బాధలు పడడం, భర్తకు దూరం కావడం, ఇద్దరూ చెరొక రకంగా ప్రాణాలు వదలడం – ఈ పద్ధతిలో కథ సాగుతుంది. ఈ మధ్యలో డిసెంబరిస్టు విప్లవం జరగడం, విఫలం కావడం, నరోద్నిక్ విప్లవం మొదలు కావడం, అదీ విఫలం కావడం – జరుగుతుంది. బోల్షివిక్ విప్లవ విజయంతో నవల ముగుస్తుంది. చరిత్రను చరిత్రగా, రాజకీయాలను రాజకీయాలుగా ఏకరువు పెట్టకుండా, రచయిత తన చేయి తిరిగినతనంతో వాటిని సృజనాత్మకంగా కొన్ని ఫ్రేముల్లో బిగించారు.

ఈ నవలలో రష్యా రాజచరిత్ర, ఉద్యమాలు ఒక భాగం. అక్కడి మానవ సంబంధాలు, సంస్కృతి మరో భాగం. ఈ రెండు భాగాలనూ రచయిత తన అధ్యయన అనుభవాన్ని రచనా సామర్థ్యంతో రంగరించి పాఠకుల ముందుంచారు.

సాధారణంగా పాలనాపరమైన రాజకీయాలలో ఏ చిన్న మార్పు వచ్చినా ప్రజలు ఆ మార్పు పట్ల కొంత ఆసక్తి చూపిస్తారు. కానీ, ఈ నవలలో జార్ చక్రవర్తులు మారుతున్న ప్పటికీ ప్రజలు అసలు పట్టించుకోరు. ఎందుకంటే జార్ చక్రవర్తులు మారుతున్నా పాలనలో మార్పులు ఉండవు. అదే నిరంకుశత్వం కొనసాగుతూనే ఉంటుంది. నేపథ్యం అనే శీర్షికలో పాల్–1 హఠాత్తుగా చనిపోయిన సందర్భంలో ఈ విషయం చెప్పాడు రచయిత. "అధికశాతం జనాభా బానిసత్వంతో మగ్గే ఆ సామ్రాజ్యానికి ఏ జార్ వచ్చినా ఏమీ ఒరగదు. పేర్లు మారినా వ్యక్తుల తీరు అదే. నిజానికి జార్‌లంతా వారి ప్రాణాలకు యముళ్ళన్నమాటే" అంటాడు రచయిత. ఈ మాటవల్ల ఎలాంటి రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా డిసెంబరిస్టులు తిరగబడ్డారో అర్థమౌతుంది. పాల్–1 మరణం తర్వాత అలెగ్జాండర్ –1 రాజు కావడం, ఆ తర్వాత జరిగిన యుద్ధాలు, నెపోలియన్‌తో రష్యా చేసిన యుద్ధం, అందులో ఆమె భర్త సెర్యోషా (సెర్గీ) నిర్వహించిన వీరోచిత పాత్ర, అతనితో తన వివాహం, జారిజం మీద జరిగిన తిరుగుబాటు, అందులో సెర్యోషా పాత్ర, అతను ఖైదీ కావడం – ఇలాంటివన్నీ ఆమె గుర్తు చేసుకొనే పద్ధతిలో నవల సాగుతుంది.

సెర్యోషా రాజకుటుంబానికి చెందిన సైనికాధికారి. అతడు నెపోలియన్‌తో యుద్ధం చేసినప్పుడు గొప్ప దేశభక్తుడు. అతడే స్వదేశీ జార్ పాలకుల మీద తిరుగుబాటు చేస్తే నేరస్థుడు అయ్యాడు. ఇది ఈ నవలలో ముఖ్యమైన విషయం. విదేశీ దురాక్రమణను అడ్డుకుంటే దేశభక్తుడు. స్వదేశీ దుర్మార్గాలను అడ్డుకుంటే నేరగాడు కావడం ఈ నవల చేసిన ప్రతిపాదన.

ఈ నవలలో సెర్గీ, మరీయ ప్రధాన పాత్రలు. ఇద్దరూ రాజ కుటుంబాలకు చెందిన వారు. కళాకారులు. అందమైన వాళ్ళు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. సెర్గీ తల్లికి కొడుకంటే కోపం, తిరుగుబాటు ఉద్యమం లేవదీశాడని. మరీయ తల్లికి కూతుర్లంటే ఎందుకో అయిష్టత. ఈ ఇద్దరూ కళాకార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరికీ శ్రామికజనం పట్ల సానుభూతి ఉంది. ఉద్యమంలో ఇద్దరూ తమవైన పద్ధతుల్లో పాల్గొన్నారు. అయితే ఇద్దరి మధ్య ఒక ప్రధానమైన తేడా ఉంది. సెర్గీ (సెర్యోషా) డిసెంబరిస్టు ఉద్యమంలో రాజకుటుంబ లక్షణాలన్నిటినీ వదులుకొని సామాన్యమైన రైతు స్థాయికి చేరుకున్నాడు. వ్యవసాయం చేశాడు. సామాన్యులతో, శ్రామికులతో కలసి జీవించాడు. అసలు సిసలైన విప్లవకారుడయ్యాడు. మరీయ కూడా ఈ మార్గంలోనే చాలావరకు నడిచింది. గుడిసెలలో బతికింది. కాని ఎంతవద్దన్నా తన వర్గ అభిజాత్య లక్షణంతో సాగింది. ఈ నవల ఈ వాస్తవాలను చాలా వివరంగా, పాఠకులకు విసుగు కలగకుండా చిత్రించింది. ఉద్యమాలలో జీవితం గడిపే స్త్రీ, పురుష సంబంధాల్లో ఎలాంటి పరిణామాలు వస్తాయో, ఒక్కోసారి ఆ పరిణామాలు హృదయ విదారకంగానే కాదు, అతి బాధాకరంగా ఉంటాయన్న సంగతి కూడా ఈ నవల చూపించింది. రాజ కుటుంబాలలో పుట్టి, వైభవోపేతమైన జీవితం గడిపవలసిన మరీయ, సెర్గీ తమ వర్గం నుంచి దూరమై కింది వర్గం కోసం ఉద్యమించడంలో వాళ్ళు చేసిన త్యాగాలు ఒకవైపు, వాళ్ళలోని వైరుధ్యాలు మరోవైపు పాఠకులను ఆలోచనలో పడవేస్తాయి. ఈ నవలలో ప్రగతిశీల పాఠకులకే కాదు, సామాన్యులకు సైతం బాగా నచ్చేది సెర్గీ అవర్గీకరణ

స్వభావం. ఇది మనకు ఇవాళ చాలా ముఖ్యమైనది. అణచి వేయబడిన వర్గాల్లో పుట్టి ఆధిపత్యవాద వర్గ స్వభావాన్ని అలవరచుకొనేవాళ్ళు సెర్గీని చదవాలి. ఆధిపత్యవాద వర్గంలో పుట్టి ఆధిపత్య దోపిడీ చేసేవారు కూడా సెర్గీని చదవాలి. అలాగే ఆధిపత్యవాద వర్గంలో పుట్టి శ్రామిక వర్గ సంస్కృతివైపు ఆకర్షించబడి కూడా ఆధిపత్యవర్గ స్వభావాన్ని వదిలించుకోలేని వాళ్లు కూడా ఈ నవల చదవాలి.

♦ ♦ ♦

ఈ నవలలో సోవియట్ సాహిత్యంతో పరిచయమున్న వాళ్ళకు పుష్కిన్, టాల్‌స్టాయ్ వంటి రచయితలు తారస పడతారు. మనకు పరిచయమున్న వాళ్ళు కనిపించినంత ఆనందం కలుగుతుంది. ఈ నవలలో ప్రధాన కథ 'డిసెంబరిస్టు విప్లవం'. అది విఫల ఉద్యమం. భారతదేశంలో సంఘ సంస్కరణ ఉద్యమం వచ్చింది. అది మేధావులు ప్రజలకోసం నడిపిన ఉద్యమం. భారత స్వాతంత్ర్యోద్యమం వచ్చింది. అది మేధావులు, ప్రజలు కలిపి నడిపిన ఉద్యమం. దానికన్నా ఎక్కువ ప్రజాస్వభావం గల ఉద్యమం తెలంగాణ రైతాంగ పోరాటం. మొదటిది అంతగా విజయం సాధించలేకపోయింది. దానికి కారణాలున్నాయి. ఆ ఉద్యమ వైఫల్య ఫలితాలను ఇంకా మనం అనుభవిస్తున్నాం. తక్కిన రెండూ ఫలవంతమయ్యాయి. వాటికీ కారణాలున్నాయి. డిసెంబరిస్టు ఉద్యమం మన సంఘ సంస్కరణోద్యమమంత బలహీనమైనది కాదు గానీ, అది విఫలమైంది. బోల్షివిక్ విప్లవం విజయం సాధించింది. డిసెంబరిస్టు ఉద్యమం ఎందుకు విజయం సాధించలేక పోయింది? ఈ ప్రశ్నకు ఈ నవలే సమాధానం చెబుతుంది.

డిసెంబరిస్టు ఉద్యమం సమాజం పట్ల తమకు బాధ్యత ఉందనుకొన్న పైవర్గాల వాళ్ళు చేసిన ఉద్యమం. రాచరిక వ్యవస్థ నశించి రిపబ్లిక్ వ్యవస్థ రావడం, బానిసత్వం రద్దుకావడం, సమాన హక్కులు రావడం, రైతుల దోపిడీ నశించడం వంటి ఆరోగ్యకరమైన అంశాలు వాళ్ళ ప్రణాళికలో ఉన్నాయి. అయినా ఉద్యమం విఫలమైంది. ఎందుకంటే అందులో ప్రజల భాగస్వామ్యం లేదు. ఈ విషయం డిసెంబరిస్టు ఉద్యమనేత అయిన సెర్గీకి ఆలస్యంగా అవగాహన కొచ్చింది. ఈ విప్లవం విఫలమైనా, ఏమీ సాధించకుండా పోలేదు. సంపూర్ణ విజయం సాధించాలంటే ప్రజలు భాగస్వాములు కావడం ద్వారానే విప్లవం విజయవంత మౌతుందని ఈ నవల రుజువు చేసింది.

ఈ నవలలో మానవ జీవితం మీద సాహిత్యం చూపే ప్రభావం, పాలకులు గ్రంథాలను నిషేధించడం, అణచివేత, నిరంకుశ చట్టాలు చేయడం, మత మార్పిడులు, ఒక ఇంట్లోనే భిన్న భావజాలాలు గల వాళ్ళు ఉండడం, ఒక ఉద్యమకారుల సమూహంలోనే భిన్నాభిప్రాయాలు ఉండడం, ఉద్యమంలో ఐక్యత, ఘర్షణ సంబంధాలుండడం, పై వర్గాల అక్రమ సంబంధాలు, విప్లవకారులకు సామాన్యులు ఇచ్చే సహకారం, ఉద్యమకారుల బలహీనతలు ఉద్యమాలకు నష్టం చేయడం, తల్లిదండ్రుల స్వభావాలు, రాజద్రోహుల క్రూర ప్రవర్తన, పాలకుల హత్యాకాండ, పాలకులలోనే హత్యాకాండ వంటి అనేకాంశాలు చిత్రింపబడ్డాయి. ఇంత పెద్ద నవలను పఠనీయంగా రాయడం నాగభూషణ్ గారికి రష్యన్ సాహిత్యం తో గల అనుభవం కారణం కావొచ్చు. రష్యన్ నవలల్లో ప్రతి చిన్న విషయాన్ని, సూక్ష్మాంశాన్ని వదిలిపెట్టకుండా చిత్రిస్తారు. మానవ జీవితాన్ని ప్రకృతిలో అంతర్భాగంగా చిత్రిస్తారు. ఈ నవలలో ఈ ధోరణి బాగా కనిపిస్తుంది. రచయిత దేనినీ పనిగట్టుకొని చిత్రించినట్లు కనిపించదు. ఇది పరిణతి చెందిన రచయిత చేసే పని.


నూరేళ్ళ రష్యా దేశ ఉద్యమ చరిత్రను నాగభూషణ్ మన కళ్ళముందుంచారు. ప్రపంచీకరణ ప్రవేశించి మనుషుల్ని విభజించి, అన్ని ఉద్యమాలనూ అణచివేసే పాలకుల్ని సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ నవల రావడం ముఖ్యమైన పరిణామం. దేశభక్తి అంటే, ఉన్నదానినంతా ఆమోదించడ మేనని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పాలక వ్యవస్థపై తిరుగుబాటు జరిగిన ఉదంతాన్ని నవలగా రాయడం, ఇప్పుడున్న ఉద్యమావసరాలను గుర్తుచేయడమే! ప్రపంచీకరణ దెబ్బకు అందరూ ప్రాదేశికతా పలవరింతలో మునిగిపోతున్న సమయంలో ఒక విదేశీ చరిత్రను వస్తువుగా తీసుకొని నవల రాయడం, ఆ పలవరింతను వ్యతిరేకించడం కాదు గానీ, మళ్ళీ మనం అంతర్జాతీయ చైతన్యంతో చేతులు కలపాలన్న సందేశం ఇవ్వడమే! మనదేశంలో ఎంత నిరంకుశత్వం కొనసాగుతున్నా, కొన్ని చారిత్రాత్మక ఉద్యమాలు నడుస్తున్న సమయంలో ఈ నవల రావడం గుర్తించాలి. చారిత్రకాభాస నవలలతో మునిగిపోయిన తెలుగు నవలా చరిత్రలో వాస్తవిక చారిత్రక నవలలు పరిమితంగానైనా కొన్ని వచ్చాయి. వాటిలో గొప్ప విప్లవ చారిత్రక నవల 'డిసెంబరిస్టు ఖైదీ'.

**'ఏ తిరుగుబాటు ఉద్యమానికైనా, అది కొంతకాలం పాటు నిలదొక్కుకొని సాగాలంటే, ప్రజల మద్దతు తప్పనిసరి అని చెప్పక తప్పదు. భవిష్యత్తులో జరిగే ఏ పోరాటమైనా దీన్ని గుర్తించక తప్పదు. డిసెంబరిస్టు ఉద్యమం నేర్పే పాఠం ఇదే' (సెర్గీ మాట)**

**"Art is a textbook of life" Y.Borev**

**: Aesthetics. P.112**

■



## విశ్వాంతరాల్లో ...

**అ**నంత విశ్వం నాదే అని
ఓ అహంకారాన్ని నెత్తిన మోసుకొని
నడుస్తున్న ఓ మనిషీ !

నదీ నదుల మీదుగా
కొండ కోనల నడుమ
యుద్ధం చేస్తూనే.. స్వార్థం మోస్తూనే
ఎటు పడితే అటు నడుస్తూ
ఎటు గాలి వీస్తే అటు గాలిపటంలా ఎగురుతూ
అంతరిక్షంలోనూ ..
అంతటా  అధినేతనని భ్రమ పడుతున్నావు!

ప్రకృతంతా నాదేనంటూ
అడుగులో అడుగేస్తూ
అడవిలో గాలి పాటలు పాడుతున్నాడు..
ఎగిరే పక్షులనే చూస్తూనే
వాలే కొమ్మలని నేల పాలు చేస్తున్నాడు..
పుడమిని చీల్చి పునాదులు వేస్తూ
ఆకాశానికి వంతెన వేస్తున్నాడు..

అంతా నాదే అనే ఓ  వెర్రి భ్రమ
అంతా నాకే తెలుసనే  ఓ వాదన
విశ్వంలో నిజాయితీ మోసే  మనుషులు
ఎపుడు ఓడిపోతూనే వున్నారు..
గెలవలేకనో, ప్రశ్నించ లేకనో కాదు..
భ్రమల గ్రహణం వీడినపుడే
వాస్తవాల తలుపులు తెరుచుకుంటాయి..
విశ్వమంటే వినువీధిలో విహరించడం కాదు;
చుట్టూ ఉన్న మనో స్పర్శలని తాకి చూడటం...
ఆ మహత్తు మట్టి సోకిన పాదాలకి
మానవత్వం ఉన్న మనుషులకి బాగా తెలుసు!

**- స్వప్న మేకల**
**90522 21870**



## అసూయ

**అ**సూయ
భయం లేకుండా బతుకుతున్న సింహాన్ని చూసి,
ఈఎంఐ లేకుండా ఇల్లు కట్టుకున్న చీమల్ని చూసి,
వీసాలు లేకుండా ప్రపంచమంతా తిరుగుతున్న పక్షిని చూసి,
ఏసీ లు లేకుండా ఆదమరచి నిద్రిస్తున్న ఆవుని చూసి ...

అసూయ ...
వాహనం లేకుండా గమ్యాన్ని చేరుతున్న చిరుతని చూసి,
స్విమ్మింగ్ పూల్ అవసరం లేని చేపని చూసి,
ఆర్థికమాంద్యంతో సంబంధం లేని రామచిలక జాతకం చూసి,
డబ్బు,పబ్బు లేకపోయినా ఆనందంతో నాట్యమాడే నెమలిని చూసి

అసూయ ...
శిక్ష పడకుండా కక్ష తీర్చుకుంటున్న ప్రకృతిని చూసి,
టిక్కెట్టు లేకుండా భూమ్మీద జరిగే సినిమాని చూస్తున్న ఆకాశాన్ని చూసి,
నిద్ర లేస్తూనే జనాలతో నమస్కారం పెట్టించుకుంటున్న సూర్యున్ని చూసి,
పగటిని విడచి నిషిలోని ప్రశాంతతని అనుభవిస్తున్న చందమామని చూసి

అసూయ
రేడియో లేకుండా సంగీతాన్ని ఆస్వాదిస్తున్న అడవిని చూసి,
ప్రకృతిలో పరవశిస్తూ ప్రవహించే నదిని చూసి,
ఎవరికీ అందనంత ఎత్తు ఎదిగిన పర్వతాన్ని చూసి,
అలలతో అలరిస్తున్న సముద్రాన్ని చూసి ...

జాలి ...
నాలుగు గోడల మధ్య నవాబుని అనుకునే నరుడుని చూసి,
పచ్చనోటుతో ప్రపంచాన్ని జయించాననే అవివేకం చూసి,
జబ్బులతో బయటకి వెళ్లలేని నిస్సహాయతని చూసి,
దురదృష్టంతో మనిషిగా పుట్టిన జన్మని చూసి ...

**- రావుల దయాకర్**

# కొత్త రెక్కలు

- చిన్ని నారాయణ రావు
94402 02942



ప్రాభవం ఓ అపురూపమైన
అద్వితీయ తీయని గురుతు
చిరకాలం గుర్తుండిపోయే కమ్మని జ్ఞాపకం
తేనెటీగల గూడు కట్టుకొని
తేనెల ఆస్తుల మకరందాల్ని కూటుకట్టినట్లు
వర్తక వాణిజ్య విహాయస యాత్రలో
ఏళ్ళకు ఏళ్ళు కాళ్ళ కింద నలిగిపోతే
బంగారానికి పుటం పెట్టి దగద్ధాయమైనట్లు
కాలం దివిటీ వెలిగించి సుసారవంతమైన
సార్ధక ప్రాభవాన్ని అంబారీ మీద మోసుకొస్తుంది.
చినుకుల్లా రాలి వాగుల్లా నిండగానే
తోజోవంతమైన ప్రకాశమై వికాసం వెల్లువెత్తదు
చినుకు చినుకు మడికట్టి బంజరు భూమిని
మేలైన కాల్వతో బంగరు పంట పండిస్తే
మహత్తరమైన పునరుత్తేజం
సాష్టాంగ పడ్డట్టు నమస్కరిస్తుంది.

ఈ ప్రక్రియలో ఏ క్షణం ఏమరుపాటు ఎదురైతే
కరోనాలో డీలా పడ్డట్టు ధ్వనిస్తుంది.
అప్రమత్తతో వడిసిపట్టుకొని దుందుభికేసి చూడకపోతే
పాకిస్తాన్ పొదిలో కౌగిలింత భ్రాంతవుతుంది
వైజ్ఞానిక విజయాంతర శ్రమాంతర శక్తి దకద్దే
వడివడిగా విజయాల విహాయసం
దివిటీలా కిరీటమై భాసిస్తుంది.
నెలవంకల్ని వంచి త్రుంచి
జేబుకు అలంకరించుకొనే సామర్థ్య రచనతోనే
పతాకాలు పరవశిస్తాయి

మార్గాన్వేషణలో నిరంతరం స్పృహ కోల్పోతే
నక్షత్ర రహదారి పూలతెమ్మెర
కమ్మని వాసనల స్వాగతం పల్కుతుంది.
వైభవం ఊరంతా తిరిగొచ్చేలోగానే
ప్రాభవం ఓ చుంబనం అందించి ఆశ చూపిస్తుంది.

విజేతలు ఎప్పుడూ ఒంటరి పోరాటం చేయరు
విజేత శబ్దంలోనే సామూహికత నర్మగర్భత ఘోషిస్తుంది
జన సాంద్రతని, జన సమీకరణని ముందు
నిల్పడమే విజేత విజయఘోషకు నిండైన అర్థం!


అకుంఠిత దీక్షా పరత్వానికి అలుపెరుగని
పిలుపు ఎదురుకోల నాట్యమాడి స్వాగతిస్తుంది
ఊహల మలుపులపై శుభోదయాల్ని
ఆవిష్కరిస్తుంది.
మార్కెట్ తంత్రానికి కొత్త రెక్కలు తొడిగి
సరికొత్త ఆక్సిజన్ పొదిగి నవీన సమీకరణలు
పొదిగితే సరికొత్త వీణాతంత్రులు కమ్మని
సంగీతానికి నెలవవుతాయి
కొత్త రెక్కలు తారకమంత్రాన్ని విన్పిస్తాయి
వెలుగుల దుప్పట్లను కప్పుతాయి. ■

## రూపకం

**బ**డి నాకు కొత్తకాదు
చదువుకున్న బడి
చదువు చెప్తున్న బడి
అప్పుడూ ఇప్పుడూ
బడిని చూస్తే నదిలా కదులుతున్నట్టుంటుంది
బడంటే నది నదంటే బడి
నదీ బడి రెండూ ఒక్కటే!
నిలబడిన చోటే నిలబడినట్లుండి
ప్రవహిస్తుంటాయి

- ఈ.రాఘవేంద్ర
94940 74022

## పరిచయం




# 'ఉదయ గీతిక' ఓ ఉత్తేజ పతాక

- చెరుకూరి సత్యనారాయణ
98486 64587

ఇంగ్లీషు, రష్యన్ భాషల నుంచి వచ్చిన అనువాద నవలలతో పోల్చితే ఇతర విదేశీ భాషల నుంచి తెలుగులో వచ్చిన నవలలు తక్కువే. రష్యన్‌తో సమానంగా రావాల్సిన చైనీ నవలలు ఎందుకనో తెలుగులోకి చాలా చాలా తక్కువగా వచ్చాయి. 60వ దశకంలో 'కొడుకులు కూతుళ్లు' నవల ఎంతో ఉత్తేజపరిచింది. కానీ, ఆ నవల ఇప్పుడు అందుబాటులో లేదు. ఆ తర్వాత దశకంలో 'ఉదయ గీతిక' పేరుతో 'యాంగ్‌మో' అనే ఉద్యమకారిణి అయిన రచయిత్రి రాసిన నవల వచ్చింది. మొదట ఇంగ్లీషులో 'ది సాంగ్ ఆఫ్ యూత్' పేరిట వచ్చిన ఈ నవలను తెలుగులో వీక్షణం వేణుగోపాల్ అనువదించగా ఇప్పటికి మూడు వేర్వేరు ప్రచురణ సంస్థల ద్వారా మూడుసార్లు ముద్రణ పొందింది. ఈ 600 పేజీల ఇంగ్లీషు ప్రతిని 300 పేజీల్లోకి సంక్షిప్తపరచిన వేణుగోపాల్ అనువాదం చాలా బాగుంది.

ఎనిమిదేళ్లు జపాన్‌కు, మూడేళ్ల పాటు కొమిటాంగ్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ బతికిన రచయిత యాంగ్‌మో స్వతంత్ర బీజింగ్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఈ నవల రచనకు పూనుకున్నారు. మన సమాజం వంటి సమాజం, మన పోరాటాల వంటి పోరాటాలు, మన ఉద్యమాల లాగే విజయాలు, వైఫల్యాలు, ద్రోహాలు అన్నీ మనవే అన్నట్లు కనపడతాయి. 1930 తొలి రోజుల్లో అభివృద్ధి నిరోధక ప్రభుత్వాల చేతుల్లో బలైన 3 లక్షల మంది యువ యోధుల్లో కొంతమందైనా ఈ నవలలో తారసపడతారు. లాచియా చువాన్ లాంటి అమరులు, తాయియు లాంటి ద్రోహులు, అమ్ముడుపోయినవారు అన్ని దేశాల ఉద్యమాల్లోనూ కన్పడతారు.

సాధారణ యువతీ యువకులు అసాధారణ శక్తిని సంతరించుకుని కేవలం ఒట్టి చేతులతో చరిత్ర నిర్మించిన క్రమాన్ని, నిరాశలో జీవితాన్ని అంతం చేసుకోవాలనుకున్న టావ్‌చింగ్ లాంటి యువతిని అత్యంత శక్తివంతమైన విప్లవ కారిణిగా మార్క్సిస్టు అవగాహన తీర్చిదిద్దుతుంది.

జపాన్ సామ్రాజ్యవాదులు చైనాను కబళిస్తుండగా.. దానికి సాగిలపడటమేగాక జపాన్‌ను నిరసిస్తున్న లక్షల మంది చైనీయుల్ని ఊచకోత కోసిన కొమింటాంగ్ ప్రభుత్వ నీచత్వాన్ని ఈ నవల ఎత్తిచూపింది. జైళ్లు, విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు పోరాట కేంద్రాలుగా మారి దేశభక్తికి వర్గ పోరాటాల్ని రంగరించి ప్రజల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్ది తమ దేశాన్ని 1949లో విముక్తి గావించుకున్న చైనా ప్రజల 'ఉదయ గీతిక' ఈ నవల.

నవల సారాంశం ఇదీ : రిన్‌పొటాంగ్ – సిమోన్‌ల బిడ్డ టావ్‌చింగ్. ఈమెకు సవతి తల్లి సుఫెంగ్‌యింగ్. ఎవరైనా ధనికుడికి ఇచ్చి టావ్‌చింగ్‌ని పెళ్లి చేసి అతని ఆదరువుతో జీవించాలని సుఫెంగ్ ఆలోచన. ఆమె నుంచి తప్పించుకొని తన అన్న టీచరుగా పనిచేస్తున్న యాంగ్ చువాంగ్ అనే సముద్రతీర గ్రామాన్ని చేరుతుంది టావ్‌చింగ్. అక్కడ అన్నా వదినలు లేకపోవటంతో యంగ్‌సే అనే పెకింగ్ విశ్వ విద్యాలయంలో చదువుతున్న వ్యక్తి సహాయంతో ఉపాధ్యాయిని గా చేరుతుంది. అతనితో సహజీవనం చేస్తుంది.

చియాంగ్ కైషేక్ అసమర్థ, క్రియారహిత విధానాల వల్ల చైనా మూడు ఈశాన్య రాష్ట్రాల్ని కోల్పోతుంది. టావ్‌చింగ్ జపాన్ వ్యతిరేక భావాలతో కమ్యూనిస్టులకు అనుకూలంగా మారుతుంది. ఉద్యమకారుడు 'లూచియా చువాన్'తో సన్నిహితంగా ఉంటుంది. దీన్ని యంగ్‌సే అపార్థం చేసు కుంటాడు. కమ్యూనిస్టులపై వ్యతిరేకత కల్పించటానికి

ప్రయత్నించగా 'నేను కమ్యూనిస్టుల్ని నమ్ముతున్నాను. నా అభిప్రాయాల కారణంగా వచ్చే పరిణామాల్ని ఎదుర్కోవటానికి సిద్ధంగా వున్నాను' అంటుంది.

మరోవైపు దేశవ్యాపితంగా దేశభక్త ఉద్యమాన్ని దారుణ నిర్బంధంతో కొమింటాంగ్ ప్రభుత్వం అడ్డుకుంది. టావ్‌చింగ్ కూడా ఉద్యమంతో కల్సింది. ఉద్యమానికి నాయకత్వం వహించిన లూచియా చువాన్ పట్ల ఆరాధనా భావం ఏర్పరచు కుంటుంది. శిశిరం తర్వాత వసంతం రాకుండా ఉంటుందా? విద్యార్థుల మధ్య జరిగే చర్చల్ని గమనిస్తే మన దేశ ఉద్యమంలో తలెత్తిన అతివాద, మితవాద పోకడలన్నీ చైనాలో కూడా తలెత్తాయని అర్థమవుతుంది. లీపింగ్ అనే మిత్రురాలు టావ్‌చింగ్‌ని, లూచియా చువాన్‌ని పరస్పరం దగ్గర చేయాలని చూస్తుంది. యంగ్‌సే ఆమెకు ఏ మాత్రం తగడని ఇద్దరికీ చెబుతుంది. కాని ఈ ప్రతిపాదన టావ్‌చింగ్, లూ ఇద్దరూ అంగీకరించరు. మరోవైపు సునింగ్–సియుయు పరస్పరం ఇష్టపడినా ఉద్యమం కోసం చాంగ్ కొండలకెళితే, సునింగ్ మాత్రం కుటుంబ వ్యామోహాలకు లోనై వెళ్లలేదు. అయినా పోలీసులు అరెస్టు చేయటానికి వస్తే ఆశ్చర్యకరంగా ఆమె పోలీసుల్ని ఎదిరిస్తోంది.

లూచియా చువాన్‌తో మాట్లాడిన టావ్‌చింగ్ ఉద్యమంలో పనిచేయటానికి నిర్ణయించుకుంది. యంగ్‌సేని శాశ్వతంగా వదిలేసింది. తాయియు ద్రోహిగా మారాడు. అతని ద్రోహం కారణంగా లూచియా చువాన్‌తో సహా అనేకమంది అరెస్టు అయ్యారు. ఎన్ని చిత్రహింసలు పెట్టినా, లూచియా రహస్యాలేమీ చెప్పడు. టావ్‌చింగ్ కూడా అరెస్టయింది. ఆమె రహస్యాలన్నీ శత్రువుకెలా తెలిశాయో తనకి అర్థం కాలేదు. ఎలాగో తప్పించుకున్న టావ్‌చింగ్ కీన్‌లో టీచరుగా ఉద్యోగంలో చేరింది. సుహోయి పంపగా చియాంగ్ హువా అనే వ్యక్తి అక్కడికి వచ్చాడు. అతనికీ అక్కడ ఉద్యోగం ఇప్పించింది. చియాంగ్ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త. ఒకరోజు గాయపడి వచ్చి తర్వాత అక్కడినుండి వెళ్లిపోతాడు. అతని సలహాతో అక్కడే ఉద్యమానికి మద్దతు సమీకరించే క్రమంలో చావో అనే సహచర ఉపాధ్యాయునితో కల్సి చాలామంది విద్యార్థుల్ని, టీచర్లని సానుభూతిపరులుగా మార్చారు.

తాయియు అక్కడికొచ్చాడు. అతను ద్రోహి అనే విషయం తెలియక అక్కడి విశేషాలన్నీ చెప్పింది. కొద్దిరోజులకే పోలీసుల దాడి జరిగింది. టావ్‌చింగ్ తప్పుకుంది కానీ, 'చావో' దొరికి పోయాడు. అక్కడ నుంచి తప్పుకున్న టావ్‌చింగ్‌కు చియాంగ్ హువా చెప్పిన 'అత్త' కనపడి వాళ్లింటికి తీసుకెళ్లింది. అక్కడ ఒక భూస్వామి కుటుంబంలో టీచర్‌గా కుదిర్చింది. భూస్వామి కొడుకు పట్నం వెళ్లి టావ్‌చింగ్ ఎవరో తెల్సుకొని ఆమెను పట్టించాలని అనుకుంటాడు. బండితోలే వ్యక్తి ద్వారా విషయం తెల్సుకుని టావ్‌చింగ్ తప్పుకుంటుంది.

ఒక కమ్యూనిస్టును తప్పించుకుపోనిచ్చే కంటే వెయ్యి మంది అమాయకుల్ని చంపేయటం మంచిది అనే చియాంగ్ కైషేక్ సిద్ధాంతాన్ని వంటపట్టించుకున్న అధికారులు ఎట్టకేలకు టావ్‌చింగ్‌ను అరెస్టు చేసి చిత్రహింసలు పెడతారు. ఉత్తర చైనాపై తనకున్న సార్వభౌమిక అధికారాలను జపాన్ పాదాక్రాంతం చేసి దక్షిణానికి తరలివెళ్తూ కొమింటాంగ్‌లు టావ్‌చింగ్‌ను, ఇతరుల్ని వదిలివేస్తారు.

ఒకవేళ నేను చనిపోతే మరణానంతరమైనా నాకు కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం ఇవ్వరా? అని అడిగిన టావ్‌చింగ్‌కు ఎట్టకేలకు పార్టీ సభ్యత్వం ఇవ్వబడింది. "ఒకనుండి నేను బేషరతుగా నా జీవితాన్ని ఒక గొప్ప ధ్యేయం కోసం పార్టీకి సమర్పిస్తున్నాను" అంటుంది. ఈమెను మొదట పార్టీ ఆఫీసులో పనిచేయమన్నారు. తాయియు ద్రోహి అని, గూఢచారి అని పార్టీ నిర్ణయించింది. ఇది తెల్సి అతణ్ణి ఇష్టపడిన సియావోయెన్ బాధపడింది. టావ్‌చింగ్ లుఫాన్ అనే పేరుతో పెకింగ్ విశ్వవిద్యాలయంలో పార్టీని బలోపేతం చేయటానికి వెళుతుంది.

చైనా విప్లవ చరిత్రలో 'మే 4 ఉద్యమం', 'డిసెంబర్ 9 ఉద్యమాలు' ప్రసిద్ధాలు. జపాన్ దురాక్రమణను నిరసిస్తూ చైనాను రక్షించాలని వేలమంది విద్యార్థులు సాగించిన ఊరేగింపుల నేపథ్యంలో అనేకమంది విద్యార్థులు ఉద్యమ కార్యకర్తలుగా, గెరిల్లా యోధులుగా మారిన వైనాన్ని ఈ నవల చిత్రించింది. కాల్పనిక సాహిత్యాన్ని ఇష్టపడే పాఠకులకు కాకుండా వామపక్ష ఉద్యమాల్లో పనిచేస్తున్న యువతకి ఈ నవల ఆసక్తిని కల్గిస్తుంది. మూడు ముద్రణలు పొందినా మార్కెట్లో కన్పించని ఈ 'ఉదయ గీతిక' ఇటీవల విజయవాడ 'అనేక' వారి దగ్గర కాపీలు కన్పడ్డాయి. వాళ్ల నంబరు : 92472 53884. ■


## సాహిత్యప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను**

**సంప్రదించండి.**



## న్యాయం ఎలా?

నేరాలు నెత్తిమీద చింపిరి జట్టులా పెరుగుతుంటే
లాఠీల విచారణలోనే సగం పోతది ప్రాణం
న్యాయానికి కింది నుంచి పైదాకా కోర్టు మెట్లు ఎలాస్టిక్‌లు
నేరస్తులు రోడ్డుపై దర్జా, కుమిలిపోయే బాధితులు
న్యాయం ఏ 'లా'లో దొరుకుతుంది?

ర్యాగింగ్ ఈకలు పీకుతుంటే
తల్లడిల్లుతున్న సున్నిత పక్షులు
మాటల అత్యాచారాలు, హత్యలు
ఆడతనమంటే అలుసా, చదువులు చావుదలకా?

డంబాచారం రాజకీయ కేసులది
లోకమంతా కోడై కూసే ప్రచారం
తప్పుడు విజేత నేతపై కేసు వేస్తే
తీర్పుకు పదవీకాలం చాలదు
నేతలు సంతలో పరుచుకున్న కూరగాయలు
తాము కొంటే న్యాయం, పరులు కొంటే నేరం

కరిచే కుక్కకు
వాదనా పటిమతో మొరిగే కుక్కలు తోడు
దుర్యోధనుని ఆగడాలు అడ్డుకోలేని ధృతరాష్ట్రుడిలా
లసుగుల చట్టాలు, లోపాయికారీ ఒప్పందాలు
కోర్టుల వాయిదాల పర్వానికి జయంతులే జయంతులు
న్యాయవాదుల కత్తెరల పదునుకు
కక్షిదారులకు జేబులు మిగలవు
తీర్పు వెలువడేనాటికి అవుతుంది వర్ధంతి!

న్యాయ దేవత కళ్ళకు గంతలే కాదు
చేతులకు కట్లు, కాళ్లకు సంకెళ్ల
కొన్నిసార్లు న్యాయం అంగట్లో బొమ్మ
న్యాయం ఎలా జరుగుతుంది?

**- కొమురవెల్లి అంజయ్య**
**98480 05676**

## ఎవరైనా ఉన్నారా?

సముద్రం మధ్యలో కుర్చీ వేసుకుని
పెయింటింగ్ వేసుకుందామనుకునే
నా కలల్ని అమ్మేద్దామనుకుంటున్నా
కొనుక్కునే వారెవరైనా ఉన్నారా ?

కోకిలను పిలిచి వేప పూతను వలిచి
బెల్లాన్ని కొలిచి చెరకు ముక్కల్ని విరిచి
చింతపండు పులుపుని తగిలించి
మామిడి ముక్కల వగరును
చేర్చి రాద్దామనుకుంటున్న
నా కవితల్ని రుచి చూసే వారున్నారా?

ఆకాశం మధ్యలో చుక్కల్ని తెచ్చి
పరుసవేది రాయితో బంగారంలా
మార్చుదామనుకునే నా ఆలోచనకు
పదును పెట్టే వారున్నారా?
కాలం మీద కలాలు పులిమే
హెూలీ రంగుల్ని చెంపలకు
పూసుకునేవాళ్లెవరైనా ఉన్నారా ?

అసలింతకీ ఈ కాంక్రీట్ అడవిలో
కిటికీలు, అద్దాలు
ఇటుకలు, సిమెంటుకి పుట్టిన ఇళ్ళేనా...
మనుషులంటూ ఎవరైనా ఉన్నారా ?

**- అమూల్య చందు**
**9059824800**



## కథ



# గరళం


- చాగంటి ప్రసాద్

90002 06163


"**ట**క్‌టక్‌మన్న తలుపు మీద కొట్టిన శబ్దానికి వంటింట్లో వున్న శారద వచ్చి తలుపు తీసింది. భర్త రాజు ఇంట్లోకి అడుగు పెట్టాడు. మంచి నీళ్ళు ఇచ్చి, అతడు స్నానం చేసి రాగానే భోజనం వడ్డించింది.

పక్కనే కూర్చుని నెమ్మదిగా, "వినోద్ సరిగ్గా చదవడం లేదండి. ఎప్పుడూ పరధ్యానంగా ఉంటున్నాడు. చదువు మీద దృష్టి పెట్టడం లేదు. అసలే పదో తరగతి! ప్యాసు అవుతాడో లేదో అని భయంగా వుంది. వాడ్ని ఏదైనా ట్యూషన్‌లో చేర్చండి." చెప్పింది శారద.

"హాయిగా ముప్పొద్దుల తిండి, మంచి బట్టలు, చేతిలో సెల్ ఫోను ఇన్ని అమర్చాం. చదుకోవడానికి వాడికేమిటి దొబ్బిడాయి? నాకు ఈ మధ్య ఫ్యాక్టరీలో పని బాగా పెరిగింది. అస్సలు ఖాళీ అన్నది దొరకడం లేదు. ఈ గోల అంతా నువ్వే చూసుకోవాలి..' కోపంగా అన్నాడు రాజు. తండ్రి గొంతు వినగానే, వినోద్ పుస్తకం తీసాడు. వాడికి దృష్టి నిలవలేదు. ఏవో ఆలోచనలు మనసులో ముసురుకున్నాయి. ఈలోపు అమ్మ నాన్న పడుకునే గదిలో లైటు ఆరిపోయింది. వెంటనే మొబైలు ఫోను తీసి చూడడం మొదలు పెట్టి వాటిల్లో లీనమై, నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు.

■■■

తెల్లవారింది. కాలనీ మట్టి రోడ్డు మీద కోళ్ళు తిరుగాడుతూ.. తిండి సంపాదనలో బిజీగా వున్నాయి. శారద లేచి, కుళాయి కింద ప్లాస్టిక్ బకెట్ పెట్టింది. తమకొచ్చే నెలవారీ జీతం లాగానే ఎంతో కష్టం మీద ,కుళాయి అతి సన్నని ధారగా నీరు వదులుతోంది. భర్తకి అన్నం వండి క్యారేజి సర్దే పనిలో పడింది.. బారెడు పొద్దెక్కినా వినోద్ నిద్ర లేవక పోవడంతో బాధగా నిట్టూర్చి పనిలో పడిపోయింది. కొడుకు సోమరిలా తయారవడం ఆమెకి మింగుడు పడడం లేదు. ముందు క్లాసు వరకు బాగానే చదివేవాడు. ఈ మధ్యనే వాడిలో అనూహ్యమైన మార్పు చూస్తోంది. ఆ మార్పు ఏమిటో అర్థం కావడం లేదు.

ఇంతలో పక్కింటి మాలతి ఆరేళ్ళ కూతురు అవని "ఆంటీ! అమ్మ నాలుగు ఉల్లిపాయలు ఇమ్మంది" అంటూ వచ్చింది.

"అంకుల్‌కి ఆఫీసుకి టైము అవుతోంది. చెయ్యి ఖాళీ లేదు, కాసేపు ఆగు" ఇస్తాను అంది.

"అలాగే ఆంటీ! అన్నయ్య లేడా? అంటూ వినోద్ గురించి అడిగింది. వేలితో బాత్‌రూమ్ వైపు చూపించింది.. సమాధానంగా.

"ఓహో! అంటూ, బాత్‌రూమ్ బయట గోడ పక్కన దాక్కుని వినోద్ బయటకి రాగానే... భౌభౌమని భయపెట్టడానికి ప్రయత్నం చేసింది.

"వాడు చివ్వున వెనక్కి తిరిగి నాకేమీ భయం లేదు!" అంటూ అవని చెయ్యి గట్టిగా మెలి తిప్పాడు.

"అమ్మా!" అని బాధతో గట్టిగా అరిచింది అవని.

"శారద ఆ కేక విని వంటిట్లోంచి బయటకి వచ్చి... "ఏం చేసావురా పాపం దాన్ని!" అంటూ అవనిని దగ్గరకు తీసుకుంది.

"అబ్బే! ఏం చెయ్యలేదు! జస్ట్ పట్టుకున్నాను" నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఏం పిల్లాడో? ఏంటో... ఏమ్మా అవని! నెప్పిగా ఉందా? అంటూ చెయ్యి నిమురుతూ, దగ్గరకు తీసుకుని.. ఇంట్లో వున్న స్వీటు చేతిలో పెట్టి ముద్దు చేసి పంపించేసింది.

వినోద్ ఎలా చదువుతున్నాడో తెలుసుకుందామని స్కూల్‌కి వెళ్ళిన శారదతో... క్లాసు టీచర్ సరోజ.. "మీ పిల్లాడు అస్సలు చదవడం లేదు. ఎప్పుడూ ఏదో ప్రపంచంలో ఉంటాడు. ఏది అడిగినా సరిగ్గా సమాధానం చెప్పడు. ఒకోసారి స్కూల్‌కి కూడా సరిగా రావడం లేదు. గట్టిగా అడిగితే ఏదో సాకు చెప్తాడు. ఇలాంటి పిల్లలు మా క్లాసులో మరో ఇద్దరు వున్నారు. వాళ్ళూ అంతే! ముగ్గురూ ఒక మూల కూర్చుని గుసగుసలాడుకుంటూ వుంటారు. ఎన్నిసార్లు బయటకి పంపించి నీల్ డౌన్ వేయించినా .. అదే పరిస్థితి ..." అంటూ... హఠాత్తుగా మొబైల్ మోగగానే దానిలో మాట్లాడుతూ శారదని పట్టించుకోవడం మానేసింది.

శారదకి ఏం మాట్లాడాలో తెలియలేదు. కొడుకు దారి తప్పుతున్నాడని మాత్రం గ్రహించింది. చదువుకుని అభివృద్ధి లోకి వస్తాడని కలలు కంది. ఎందుకు కొరగాకుండా పోతున్నాడో, ఎలా దారిలో పెట్టాలో అర్థం కాలేదు. ఆలోచిస్తూ ఇంటివైపు దారి తీసింది.

■■■

వంటింట్లో పని గబగబ పూర్తి చేసుకుని.. వినోద్ వుండే గదిలోకి వెళ్ళింది. మంచం మీద పడుకుని మొబైల్ తీక్షణంగా చూస్తూ ఆటలాడుతున్నాడు. శారదకి చిర్రెత్తుకొచ్చింది.

"బుద్ధి లేదా? పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. ఫోన్‌లో ఆటలేంటీ?" అని మొబైలు లాక్కోబోయింది. ఉండమ్మా! ఒక్క అరగంట ..." అంటూ మొబైల్‌ని గట్టిగా పట్టుకున్నాడు.

"నాన్న రానీ! నీ పని చెప్తా ..." అని భయపెట్టింది. వాడు ఆమె మాటల్ని పెడ చెవిని పెట్టి నుదుట మీద పడుతున్న జుట్టుని చేత్తో విసురుగా పైకి లాక్కొని, మొబైల్‌కి అతుక్కు పోయాడు. శారద నిస్సహాయంగా హాల్లోకి వెళ్లి కుర్చీలో కూలబడింది. ఇంతలో వీధి తలుపు తెరుచుకున్న చప్పుడు వినిపించింది. రాజు రావడం గమనించిన శారద ... అతని చేతిలో క్యారేజీ బాగ్ తీసుకుందామని వేగంగా నడిచింది. గుప్పున మద్యం కంపు కొట్టింది. తూలుతూ వచ్చిన అతని వాలకం చూసి చూసి దిగ్భ్రాంతికి లోనైంది. ఆమె మొహం పాలిపోయింది బాధతో. కోపాన్ని అణుచుకుంటూ, 'తాగారా?' అని గొంతు పెగలదీసుకుని అడిగింది.

"ఆ ... షుబ్బారావుకి జీతం పెరిగింది. షిన్న పార్టీ ఇచ్చాడు ..." తూలుతూ పడక గదిలోకి వెళ్లి మంచం మీద అడ్డంగా పడి గురక పెడుతూ నిద్రలోకి జారుకున్నాడు. దారి తప్పుతున్న కొడుకుని దారిలో పెట్టవలసిన తండ్రే తప్ప తాగి ఇంటికి వస్తే, తన బాధ ఎవరికి చెప్పుకుంటుంది? నిస్సత్తువుగా మోకాళ్లమీద తల పెట్టుకుని రోదించింది. ఆమె గుండెల నిండా నిరాశ కరిమబ్బులా కమ్ముకుంది.

■■■

బారెడు పొద్దెక్కేక లేచిన వినోద్‌ని చూసింది శారద. ఏం తిట్టినా ప్రయోజనం లేదని, తన పనిలో తాను మునిగి పోయింది. బద్ధకం, స్కూల్ బాగ్ రెండూ మోసుకుని భారంగా స్కూల్‌కి వెళ్లేసరికి ... మెయిన్ గేటు మూసేశారు. బయట అతని సావాసగాళ్ళు చరణ్, రాకేష్‌ల పరిస్థితి కూడా అదే! స్కూల్ బిల్డింగ్‌లోంచి మెయిన్ గేట్ దగ్గరకు వస్తున్న హెడ్ మాస్టర్ వేదవ్యాస్ వీళ్ళని చూసాడు. వడివడిగా వాళ్ళ దగ్గరకు వచ్చి.. "ఏరా! ఆలస్యంగా వచ్చారా? చదువు మీద శ్రద్ధ లేదురా మీకు... ఇంట్లో అమ్మా నాన్న అన్నీ అమిర్చి పెడుతుంటే, చదువుకోవడానికి ఏ కష్టం వచ్చిందిరా? స్కూలుకి టైముకి రాలేర్రా?" అంటూ తిట్ల దండకం అందుకున్నాడు.

"ఒరేయ్! ఇదే ఫైనల్ వార్నింగ్ .. స్కూల్‌కి తగలడండి!" అంటూ గేటు తెరిపించబోయాడు వేదవ్యాస్.. ఆయన మాటల్ని పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా తలలు ఎగరేసి, వేగంగా అక్కడ నుంచి స్కూల్లోకి రాకుండా వెళ్లిపోయారు ఆ ముగ్గురూ.

'వేరుపురుగు చేరి వృక్షంబు జెఱచును చీడ పురుగు చేరి చెట్టు చెఱచు కుత్సితుండు' ... అన్న వేమన పద్యం గుర్తుకు వచ్చింది మాష్టారికి. ఇలా వదిలేస్తే, మిగిలిన విద్యార్థులు కూడా పాడైపోయే ప్రమాదం వుంది. వీళ్ళని ఎలాగో అలాగ దారిలో పెట్టాలి" అనుకుంటూ తన రూమ్ లోకి దారి తీశాడు.

■■■

స్కూలుకి కొంత దూరంలో సంరక్షణకి నోచుకోని, ఒక పార్కులో విరిగిపోయిన బెంచ్ మీద కూర్చున్నారు ముగ్గురూ.

"ఒరేయి చరణ్ ! త్వరగా వీడియో ఓపెన్ చెయ్యి" అంటూ వినోద్, ఇంకో పిల్లాడు రాకేష్ తొందర పెడుతున్నారు.

"వుండండి రా.. డేటా యుసేజి ఓపెన్ చేయాలా" అంటూ తీక్షణంగా చూస్తూ .. జుగుప్సాకరమైన విశృంఖల కామకేళి వీడియోలను చూపించాడు. చెమటలు కారుతున్నాయి. రక్తం ఉరకలు పెడుతోంది. ఏదో తెలియని ఆవేశం, ఏదో చేసేయ్యాలనే తలంపు వాళ్ళ బుర్రల్ని ఆక్రమించుకుంది. ఊపిరి ఉద్వేగంగా పీలుస్తున్నారు. వాటిని చూస్తూ మైమరిచి పోయిన స్థితిలో వాళ్ళ నరాల్లో ఏదో కదలిక... మెదళ్ళలో కాలకూట విషంలాంటి ఆలోచన ఆక్రమించింది.

"ఏయ్ బచ్చేం! జావ్! బాహర్ జావ్!" అని గట్టిగా పార్కు వాచ్‌మాన్ అరిచేసరికి ... ఉలిక్కిపడి కంగారుగా ఫోన్ ఆపేసాడు చరణ్. బయటకి పరిగెత్తారు ముగ్గురూ. ఏదో

ట్రాన్స్‌లో ఉన్నట్టుగా నడుస్తూ ఇంటికి చేరాడు వినోద్. రాత్రంతా వాడికి నిద్ర పట్టలేదు. దొంగ చాటుగా చూసిన ఆ దృశ్యాలు మనసులో చెరగని ముద్ర వేసాయి. కలవర పరిచాయి. కలత నిద్ర పోయాడు.

■■■

ఒంటిమీద బట్టలు లేకుండా దిసమొలతో నేలమీద కూర్చుని వణికిపోతూ పోలీసు స్టేషన్ సెల్‌లో వున్న వినోద్‌ని చూసిన శారద, గట్టిగా ఏడుస్తూ కొడుకుని ... "ఏం చేసావురా?" అంటూ కంగారుగా వాడి దగ్గరకు రాబోయింది. అక్కడున్న లేడి కానిస్టేబుల్ "ఆగవమ్మా! నీ కొడుకు ఎంత నీచపు పని చేసాడో తెలిస్తే గుండె ఆగి చస్తావు" అంటూ అడ్డుకుంది. "మా వాడు అమాయకుడు ఇన్‌స్పెక్టర్ గారూ... అసలు ఏం జరిగింది?" అంటున్న రాజుని.. చూసిన సిఐ సుందర్రావు ...

"ఏవయ్యా! పిల్లల్ని అలా అచ్చోసిన ఆంబోతుల్లా ఊరి మీదకు వదిలేయడమేనా? బయట తిరగనిస్తే ఎంత ప్రమాదం?" అంటూ దిగ్గున కుర్చీలోంచి లేచి... "ఈ లం... కొడుకు .. ఆరేళ్ళ పిల్లని రేప్ చేసాడు." అంటూ బూతులు, తిట్లూ లంకించుకున్నాడు. "ఆ పిల్ల సావు బతుకుల్లో హాస్పిటల్లో పడివుంది" అంటూ తలమీద టోపీ బల్ల మీద పెట్టాడు.

ఆ మాట విని, ఏడుస్తూ అక్కడే కుప్ప కూలిపోయింది శారద. రాజు దు:ఖంతో తలమీద చేతులు పెట్టుకుని అక్కడే కూర్చుండి పోయాడు. వినోద్ బిక్క మొహం వేసుకుని భయం భయంగా దిక్కులు చూస్తున్నాడు.

"మా అమ్మకి ఒంట్లో బాగాలేదని మా సొంత వూరు వెళ్ళామయ్యా! వీడికి స్కూల్ పోతుందని, మా పక్కనే వుండే మాలతి అనే వాళ్ళకి వినోద్‌ని చూస్తూ ఉండమని చెప్పి వెళ్ళాం. ఎలా జరిగిందో ఇది!" అంటూ నమ్మశక్యం లేనట్టుగా పక్కనే వున్నా కానిస్టేబుల్‌కి తన గోడు వెళ్ళగక్కింది శారద.

"ఆ సమయంలో మీ పక్క ఇంటి వాళ్ళ ఆరేళ్ళ ఆడబిడ్డ మీ ఇంటికి వచ్చింది. నీ కొడుకు ఆ పిల్ల మీద పడి రేప్ చేసాడు. ఆ పిల్లకి రక్తస్రావం అయ్యి స్పృహ తప్పి పడిపోయింది. అది చూసి భయపడి పారిపోయాడు. ఆ పిల్ల అమ్మ, నాన్న కూతురు ఏమైందో తెలియక వెతుకుతూ మీ ఇంటికి వచ్చి ఆ దృశ్యం చూసి వెంటనే హాస్పటల్‌లో జాయిన్ చేసాక తెలిసింది, ఆ చిన్నారి మీద లైంగిక దాడి జరిగిందని. మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారో తెలుసుకుని... వెంటనే పార్కులో తచ్చాడుతూ కనబడ్డ నీ కొడుకుని పట్టుకున్నాం" అంటూ కోపంగా వినోద్ కేసి చూసాడు సిఐ.

"చిన్నపిల్లాడండి.. వాడే చేసాడని సాక్ష్యం ఏంటి?" అన్నాడు రాజు.

"చిన్నపిల్లాడా? ఇలాంటి పిల్లలే ఇలాంటి పెద్ద పనులు చేస్తున్నారు. అయినా నీకు సమాధానం చెప్పే అవసరం నాకు లేదు. నాలుగు పీకితే నీ కొడుకే చెప్పాడు..." అన్నాడు మరింత కోపంగా సుందర్రావు.

"అయ్యో! అవని మీద అంత అఘాయిత్యం చేసాడా ఈ వెధవ ..." అంటూ వాడి కేసి ఛీత్కారంగా చూసి, హాస్పిటల్‌కి పరిగెత్తింది శారద.

■■■

రాష్ట్రం, దేశం ఈ సంఘటనకి ఉలిక్కిపడింది. వినోద్ మైనర్ కాబట్టి, జువెనైల్ జస్టిస్ చట్టాలని బట్టి వాడికి శిక్ష పడేలా చర్యలు చేబట్టింది.

"రోజురోజుకి ఆడవాళ్ళ మీద జరుగుతున్న అత్యాచారాలకి సభ్య సమాజం సిగ్గు పడాలి. పసికందులని కూడా వదలడం లేదు ఈ దుర్మార్గులు. వాళ్ళని కఠినంగా శిక్షించాలి" అంటూ కొన్ని మహిళా సంఘాలు డిమాండు చేశాయి. మీడియాలో ఎక్కడ చూసినా ఈ అంశం మీదనే వార్తలూ, చర్చలూ.

వేదవ్యాస్ స్టాఫ్ మీటింగ్ పెట్టాడు. "మన స్కూల్ పిల్లాడు ఇలాంటి అకృత్యానికి ఒడికట్టడం నేను జీర్ణించుకోలేక పోతున్నాను. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో మనం విఫలమవుతున్నాం. ఇకనైనా మనం మేలుకోకపోతే వృత్తికి తీరని ద్రోహం చేసినవాళ్ళమవుతాం. నేను ఈరోజు అవనిని జాయిన్ చేసిన హాస్పిటల్‌కి వెళ్ళాను. ఆ పసికూన బెడ్ మీద కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. అవని తల్లి దండ్రుల దుఃఖం ఎవరు తీర్చలేనిది..." అంటూ చెమర్చిన కళ్ళని రుమాలుతో తుడుచుకున్నాడు.

ఒక పక్క వినోద్‌ని కిరాతకుడు, రాక్షసుడు అని శారద, రాజు బాధ్యత తెలియని తల్లిదండ్రులు అని సమాజం దుమ్మెత్తి పోస్తోంది.

"లాంటి పిల్లాడు ఈ భూమ్మీద బతకకూడదు సర్.." అంటూ గట్టిగా అరిచింది సరోజా టీచరు.

"సరే! వాడికి శిక్ష పడుతుంది. కానీ మరొక సంఘటన జరగదని నమ్మకం ఏమిటి? అసలు ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయి? పసి వయసులో ఇలాంటి ఘోరాలు ఎందుకు చేస్తున్నారు? ఇలాంటివి ఎలా ఆపాలి.." ప్రశ్నించాడు వేదవ్యాస్.

"చట్టాలు స్ట్రిక్టుగా అమలు పరిచి ఈ అఘాయిత్యాలను ఆపాలి..." అన్నాడు లెక్కల మాస్టారు సుబ్బారెడ్డి. " ప్రభుత్వాలు ఎంతమందిని కాపాడగలవు? ఎంతమందికి శిక్ష వేయించ గలవు ? ఎన్నో చట్టాలు తెచ్చారు. అయినా ఆగాయా?" అన్నారు హెచ్‌ఎం.

"మరి మన చేతుల్లో ఏముంది సర్" అన్నారు టీచర్లు.

"సమాజం పట్ల బాధ్యతగల వాళ్లగా మన వంతుగా ఏదైనా చేసి ఆపడానికి ప్రయత్నించాలి." ధృఢంగా అన్నాడు వేదవ్యాస్.

"ఎలా సర్? పిల్లలందరికీ చదువు చెప్పడమే చాలా కష్టంగా వుంది. ఇవన్నీ మనం నెత్తిన వేసుకుంటే మన స్కూల్ పాస్ పర్సెంటేజ్ తగ్గిపోతుంది" అన్నాడు ఇంగ్లీష్ టీచర్ రఘు.

" చదువుతో పాటు , మంచి నడవడిక కూడా వుంటేనే దానికి విద్య అని పేరు. అప్పుడే వాళ్ళు మంచి పౌరులుగా తయారవుతారు. అప్పుడే చదువుకి సార్ధకత లభిస్తుంది. అసలు ఈ సంఘటనకి కారణం తెలుసా ?..అడిగాడు.

తెలియదన్నట్టు మొహాలు పెట్టారందరు .

"స్మార్ట్ ఫోనులో మితిమీరిన పోర్నో వెబ్ సైటుల్లో దఅశ్యాలు చూడడానికి అలవాటు పడి వినోద్ దానికి బానిస అయ్యాడు. ఏది చెయ్యచ్చో ఏది చెయ్యకూడదో తెలియని మితిమీరిన విపరీత ధోరణితో, ఉద్రేకంలో అ పసికూన మీద అత్యాచారం చేశాడుట..

"ఆ ! .. అంటూ అందరు పైకే అన్నారు. నిజమా?.. అంటూ.. ఆయన కేసి చూసారు నమ్మకం కుదరక.

"అవును పచ్చి నిజం ! అవసరం వున్నా లేకపోయినా చిన్న వయస్సులోనే స్మార్ట్ ఫోను లు ఇచ్చి పిల్లల్ని పాడు చేసున్నాము.,జిజ్ఞాస కొద్ది ,,వాటిల్లో ఏముందా అని ఎదిగి ఎదగని వయస్సులో వున్న పిల్లలు చూడకూడనివి చూస్తున్నారు,,చెయ్యకూడనివి చేస్తున్నారు. నాలుగు గదుల మధ్య గుట్టుని ,బాహాటంగా, పచ్చిగా,ఫక్తు వ్యాపారంగా చూపిస్తూ మనిషి మనస్సులని కలుషితం చేస్తున్నారు వ్యాపారస్తులు . పిల్లలు అవి చూసి సర్వ నాశనం అయిపోతున్నారు, నేరాలకి పాల్పడుతున్నారు. అర చేతిలోకే అందుబాటులోకి వచ్చిన ఈ సోకాల్డ్ టెక్నాలజీ కాలనాగై పసివాళ్ళని కాటు వేస్తోంది. తల్లిదండ్రుల్లో చాలా మందికి పిల్లలు ఫోన్ లో ఏం చూస్తున్నారో అనే విషయం కూడా తెలియదు. కొన్నాళ్ళు పోతే ,, ప్రతి ఇంటిలో ఇలాంటి నేరస్తుడు ఒకడు తయారవ్వచ్చు . ఇక్కడ వినోద్ లాంటి వాళ్ళు దారి తప్పడానికి కారణం , ఆ వయస్సులో ఆ ఫోను కొనిచ్చిన తల్లి దండ్రులది, ఉపాధ్యాయ వఅత్తిలో వున్నా నిర్లిప్తం గా వున్న మనది కూడా ! ఈ సంఘటనకి మనమందరం బాధ్యులమే!

"మరి దీనికి మనం చేయవలిసినది ఏముంది సార్! అడిగింది సరోజ సందేహంగా .

మనం తెలియజెప్పాలి సరోజ గారు ! మైనారిటీ దాటని పిల్లలకి ఫోనులు ఇవ్వకుండా కట్టడి చెయ్యమని, ఒక వేళ ఫోను అవసరమనుకుంటే పిల్లలు ఏం చూస్తున్నారో కనిపెట్టుకుని ఉండమని కనీసం మన స్కూల్ పిల్లల తల్లిదండ్రులకైనా తెలియజేద్దాం .అలాగే ఇలాంటి వెబ్ సైట్ల ని కట్టడి చేయమని ప్రభుత్వానికి విన్నపం పంపుదాం. ఇలాగైన గురువులుగా మన బాధ్యత కొంతైనా నిర్వర్తిద్దాం" ముగించాడు హెడ్ మాస్టారు వేదవ్యాస్. అందరూ ఆయన చెప్పిన సూచనలని అమలు చేసే పనిలో పడ్డారు. వినోద్ చెప్పిన సమాచారం తెలుసుకుని,, చరణ్,రాకేష్ లని వాళ్ళ తల్లి దండ్రులని పోలీసులు కౌన్సిలింగ్ చేస్తున్నారని తెలిసి వేదవ్యాస్ ఊపిరి పీల్చుకున్నాడు. ■

## కావ్ .. కావ్ ...

**నే**ను రంగు నలుపు నా అరుపు గోల

నా ఆహారం మెతుకు
ముక్కలంటే ఆరాటం
చెట్టు నా ఆ ఆవాసం
నా బలగం మెండు

మాలో ఒక్కరూ పోయినా
వాలుతాం దండిగా
మా ఐక్యత మెండు
విప్లవం మా గళంలో

నాలో వుంది దేహమే
జీర్ణవ్యవస్థ సైతం నాలో మామూలే
ఏ ఆత్మా నా దరి జేరదు

నేనో చిన్ని ఆకారం నాలో లేదు జిజ్ఞాస
నా మెదడు ప్రకృతి ధర్మంగానే ..
ఆలోచన లేని మనిషి
నాలో సచ్చిన మనిషిని దర్శించు!

అది దినం కూడో పెళ్ళి కూడో నేనెరుగ
విస్తర్లో సకల వంటలు
నా చిన్ని పొట్టకి ఒక ముక్కో మెతుకో చాలు
జనం దూరం జరగగానే వాలుతా
నాకు ఆకలైతే.. అంతే ,,!

నేను ముట్టకపోతే
సకల వాదనలన్నీ హేతు రహితం
మాధ్యంలో మనిషి
ద్రవ్యం వ్యర్థం కాలమూ వృథా
కాలం చేసిన మనిషి మట్టిలోనో మంటల్లోనో కలువు
కాకినైన నాకే తెలుసు
మనిషి ఎప్పుడు ఎరుగునో?!

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
**94933 88201**



## ఆమె ఒక సమున్నత పతాకం!

ఎదగని సమాజం చేతిలో
నలుగుతున్న పిండిముద్ద ఆమె
ఏ మతమైతేనేం
ఆచారాల నెగడులో కాలిపోతున్న ఆశ ఆమె
పుట్టకమునుపే రంగు, రూపు నిర్ణయింపబడే బతుకు
ఏ మాత్రం తక్కువైనా వెతల చితులే తుదివరకు..!
ఆమె కోసమే పూజలు
వ్రతాలు ఉపవాసాలు
నిర్దయగా నుదుటి
తిలకం చెరిపే విధి విధానాలు
ఆమె పైనే సమస్త బరువు బాధ్యతలు
ఓటికుండ లాంటి కుటుంబ పరువుమోతలు
అయినా ఆమె ఎదుగుతోంది సమున్నతంగా

అదొక కనబడని ఉలి
యుగాలుగా ఆమెనే మొలుస్తూ...
మొలవటంలో రాటుదేలిపోయిన ఉలి
ఆమె ఒంటినిండా కనబడని గాయాలే
మనసు నిండా ఆరని హింసల చారలే
ఏనాడూ చరిత్రకెక్కని దైన్యాలే
అయినా ఆమె
ఎదుగుతోంది సమున్నతంగా ...

అడుగు అడుగుకు అడ్డుపడే ఆంక్షల ముళ్లు
అవయవాల కొలతలు తీసే ఆకలి కళ్లు
ఆమె అంగీకారంతో పని లేని అవసరాల పెళ్ళిళ్ళు
అక్కడే నీ బతుకైనా చావైనా అనే అదిలింపుల వేళ్లు
అయినా ఆమె ఎదుగుతోంది, సమున్నతంగా ....
అదే మగతనపు ఉలి చెక్కిన రెండు పార్శ్వాల ఆమె
ఒకదానికొకటి విరుద్ధంగా ...

అందం అభినయం విశృంఖలత్వం...
ఆమె ముఖమే హృదయ రాణి అక్కడ
అణకువ పనితనం విధేయత
అదీ ఆమె ముఖమే, పాదదాసి మాత్రమే ఇక్కడ....

ఒక ముఖాన్ని మరో ముఖంలో వెతుకుతూ వేధిస్తున్న
మృగత్వాన్ని సహిస్తూ ఎదుగుతోంది ఆమె సమున్నత వ్యక్తిగా
సమాజం తృణీకరించలేని మహిళా శక్తిగా ...

పరువు హత్యల కరకు కుత్తుకలు తెగేలా
వేధింపుల ఆత్మహత్యల కత్తులు తునాతునకలయ్యేలా
కనబడని శీలపు బండరాళ్లు పగలేలా
విజ్ఞత, సంస్కారం, నైతికత
ఆయుధాలుగా ఆమె యుద్ధం చేస్తోంది
కులరొంపిలో కుళ్లిపోయిన
మురుగు బుర్రలతో కనబడని యుద్ధం చేస్తోంది!

నవీన విజ్ఞానపు రెక్కలామెకు తొడగండి
శాంతి సామరస్యాలస్వేచ్ఛను ఆమెకివ్వండి
సమ సమాజపు నింగిన
ఎగిరే శ్వేతపావురపు మెరుపులాంటి
'వినూత్న' విజయాన్ని ఆమెకివ్వండి
ఇదిగో ఇదే నా వాగ్దానం
జనరంజితమైన భవిష్యత్తు
ఆమె మీకివ్వగలదు ..!

**- కెఆర్ఎస్ రామసుబ్బమ్మ**
సహ ఉపాధ్యాయిని,
జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ముద్దనూరు

## సమీక్ష



# రావిశాస్త్రి 'కార్నర్ సీటు' కథ పాత్రల్లో కథనాత్మకత

- డాక్టర్ ఎ.రవీంద్రబాబు
80086 36981

రావిశాస్త్రి కథకుడిగా, నవలాకారుడిగా తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన వ్యక్తి. కింది తరగతి ప్రజల జీవితాన్ని సాహిత్యంలోకి తీసుకొచ్చిన రచయితగా, మాండలిక భాషా ప్రయోగవాదిగా వారి స్థానం ఆధునిక సాహిత్యంలో పదిలం. అలాంటి రావిశాస్త్రి శత జయంతి తెలుగు సాహిత్య చరిత్రలో ఓ మేలి మలుపులా భావించదగిన విషయం.

రావిశాస్త్రి కథల్లో సామాన్యులు, పీడితులు, తాడితులు, సంఘ బహిష్కృతులు పాత్రలుగా కనిపిస్తారు. సమాజంలోని కింది తరగతి ప్రజల జీవితం వ్యక్తమవుతుంది. ఆరుసారా కథలు, ఋక్కులు కథలు, విడిగా రాసిన కథలు, అన్నీ వారి సైద్ధాంతిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. కథా వస్తువు, నేపథ్యాల్లోనే కాదు, కథన పద్ధతుల్లోనూ వారిది భిన్నమైన శైలి. వారి 'కార్నర్ సీట్' కథలోని వస్తువును, శిల్పాన్ని, వాటి మధ్య ఉన్న సంబంధాన్ని పాత్రల దృష్ట్యా విశ్లేషించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం. ఈ కథలో మానవ జీవన విధానమే కాదు, భౌతిక పరిస్థితులు, మానసిక స్థితులు, జీవుని వేదన వంటి ఎన్నో అంశాలను అద్భుతంగా చూపించాడు రాచకొండ విశ్వనాథశాస్త్రి అనే రావిశాస్త్రి.

ఈ కథలో ప్రధానంగా కనిపించేవి రెండే పాత్రలు. ఒకటి రాజు. రెండో పాత్రకు పేరు లేదు. కేవలం పచ్చకోటు వ్యక్తిగా మాత్రమే చెప్తాడు రచయిత. కథంతా రాజు పాత్ర నుంచే చెప్తాడు. రాజు మాటలు, వ్యక్తిత్వం, ఆలోచనలు, దృక్పథంలోంచి పచ్చకోటు వ్యక్తిని చెప్పే ప్రయత్నం చేస్తాడు. ఆ చెప్పే విధానంలో రాజు మాటతీరు, ప్రవర్తన వాటి ద్వారా వ్యక్తమయ్యే అతడి వ్యక్తిత్వం పాఠకులకు చేరుతుంది. అంతేకాదు పచ్చకోటు వ్యక్తి మాటతీరు, వేషధారణ, ప్రవర్తన రాజు చూసే, చెప్పే విధానంలోంచే అతడి స్వభావం కూడా తెలుస్తుంది. శిల్పపరంగా ఇదో అద్భుతమైన టెక్నిక్. ఒక పాత్రను మరో పాత్ర దృష్టిలోంచి చూడడం, చెప్పడం, వివరించడం, విశ్లేషించడం అనే కథన పద్ధతిని చాలా తక్కువమందే వాడగలరు. పచ్చకోటు వ్యక్తి పాత్రను పాఠకుడు నేరుగా అర్థం చేసుకోలేడు. పాత్రను, దాని తీరుతెన్నులను అంచనా వేయలేడు. ఎందుకంటే... ఆ అవకాశం రచయిత పాఠకులకు ఇవ్వలేదు. మరో పాత్రయిన రాజు అతడి గురించి ఏం చెప్తే అదే. అతడిని ఎలా చూస్తే అలానే. రచయిత కూడా పచ్చకోటు పాత్ర గురించి చెప్పడానికి, వర్ణించడానికి నేరుగా కథలోకి ప్రవేశించడు. రాజునే చెప్పమంటాడు. రాజు ద్వారానే చూడమంటాడు. అందుకే ఈ కథన పద్ధతి భిన్నమైంది. వైవిధ్యమైంది. సంక్లిష్టమైంది. చేయి తిరిగిన కథకుడు రావిశాస్త్రి ఈ టెక్నిక్‌ను అద్భుతంగా వాడారు.

ఇక కథలోకి వెళ్తే రాజు పాత్ర ప్రవేశంతో 'కార్నర్ సీటు' కథ ప్రారంభమవుతుంది. రాజు మాటలు, ప్రవర్తన, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే అనేక వర్ణనలు, సన్నివేశాలు, మాటలు కథలో కనిపిస్తాయి. ఇవి కేవలం రాజు పాత్రనే కాకుండా కథను విస్తృతం చేయడంలో, కథను ముందుకు నడిపించడంలో, మరో పాత్రను నిర్దేశించడంలో, నిర్ణయించడంలో, పరిధిని గీయడంలో, పాఠకులకు సూచనలు, సలహాలు, ఆలోచనలు ఇవ్వడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. రాజు పాత్ర ప్రవేశంలోనే అతడిలోని ఆందోళన కనిపిస్తుంది. హడావుడి కనిపిస్తుంది. నిలకడ, స్థిమితం లేని వ్యక్తిత్వం ద్యోతకమవుతుంది.

"ఏ క్షణంలో బయల్దేరిపోతుందో అనే ఆందోళనతో కుడిచేత్తో టిక్కెట్టూ, ఎడం చేత్తో తోలు సంచీ పట్టుకుని పరిగెత్తేడు రాజు ప్లాట్‌ఫారం వైపు". అతను ఊరికి ఎందుకు వెళ్తున్నాడో చెప్పే సందర్భంలో, అతడు ఆ పనిని ఇష్టంతో చేయడం లేదు. తప్పదు కాబట్టి పెళ్లికి వెళ్తున్నాడు అనే విషయం వ్యక్తమవుతుంది.

"మేనల్లుడి పెళ్ళికి వెళ్ళకపోతే బావుండదని బయల్దేరేడు. ఆ బండి తప్పిపోతే ఇహ పెళ్లికి వెళ్లినట్టే! బండి తప్పిపోయిందని అక్కయ్య నమ్మదు. బావకి కోపం వస్తుంది. పెళ్ళిళ్ల రోజులవడం చేత ట్రెయిన్‌లో జనం కిటకిటలాడుతున్నారు. ఎక్కడా ఖాళీ ఉన్నట్టు లేదు" పచ్చకోటువ్యక్తి కార్నర్ సీటులో కూర్చున్నప్పుడు, అతడి గురించి అన్న మాటల్లో అతడికి కార్నర్ సీటు దొరికిందన్న

జెలసీ రాజులో కనిపిస్తుంది. తనకు దొరకలేదు అన్న కోపం కూడా వ్యక్తమవుతుంది. "తిన్నగా పోయి వెనకవైపున కిటికీ పక్క మూల సీట్లో కూర్చున్నాడు. అతణ్ణి వెనక్కి తోసేయడానికి వీలు చిక్కని రాజు అగ్గిరాముడై పోయేడు. "నేనెక్కడ ముందుగా వెళ్లి అక్కడ కూర్చుంటానో అని జోరుగా పరుగులెత్తిపోయి మరీ కూర్చున్నాడు దొంగవెధవ" అని కూడా తిట్టుకుంటాడు. "వీడి పిండాకూడుగాని పచ్చరంగు కోటు తొడుక్కోవడం ఏమిటి?" అని ఎగతాళిగా తనలో తాను అనుకుంటాడు.

అతడికి పేపర్లో వార్తలేవి నచ్చకపోవడం, యుద్ధం గురించిన వార్తల గురించి అతడు వెధవగోల అని వ్యాఖ్యానించడం, పచ్చకోటువాణ్ణి 'ఎక్కడ దిగుతావు?' అని ప్రశ్నించడం. అతడు విసుక్కొని సమాధానం చెప్పకపోయేసరికి 'వీడికి పొగరు, దౌర్భాగ్యపు వెధవ, దిష్టిపిడతా' అని కొరకొరగా చూడ్డం... వంటివన్నీ రాజు వ్యక్తిత్వాన్ని, కార్నర్ సీటు కోసం అతడు పడే తపనని తెలియజేస్తాయి. పచ్చకోటు వ్యక్తి టిక్కెట్టు కొని ఉండడని ఊహించుకోవడం, టీసీ వస్తే దించేయాలని ఆలోచన చేయడం, రైల్వే డిపార్ట్‌మెంటు వాళ్లను తిట్టటం, అతడికి క్షయవ్యాధి ఉండొచ్చని భావించటం, మరో స్టేషన్ రాగానే ట్రెయిన్ దిగిన ఇద్దరు బికార్లతో "ఈ బికారి కూడా ఇక్కడే దిగిపోయే బావుణ్ణు" అని అనుకోవటం "ఫకీరు వెధవ! శనిదేవత" అని తిట్టడం... వంటివన్నీ రాజులోని అసమంజస ఆలోచనలను, వ్యక్తిత్వ లోపాలను తెలియజేస్తాయి. కేవలం తనకు నచ్చిన కార్నర్ సీటులో అతడు కూర్చున్నాడన్న జెలసీతోనే ఇవన్నీ ఆలోచిస్తాడు. ఇది రాజు వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించే సన్నివేశాలు, మాటలు.

రావిశాస్త్రి రాజు పాత్రను అతడి ఆలోచనా ధోరణి నుంచి, మాటల తీరునుంచి పాఠకులకు అంచనా వేసే అవకాశం కల్పించాడు. కేవలం తనకు ఇష్టమైన, కూర్చోవాలనుకున్న సీటులో పచ్చకోటు వ్యక్తి కూర్చోవడం వల్ల మాత్రమే రాజు అతనిని శత్రువుగా భావించాడు. అతడి గురించి లేనిపోని సొంతవైన ఆలోచనలు చేశాడు. అవి అన్నీ అతడిని చెడుగా అంచనా వేసేవే. రాజులోని దుష్ట స్వభావాన్ని సూచించేవే. కానీ పచ్చకోటు వ్యక్తి మరణించిన తర్వాత రాజు పాత్రలో మార్పు కనిపిస్తుంది. చావు మనిషి ప్రవర్తనను, మాటలను, దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని ఎలా మారుస్తుందో రాజు పాత్రను గమనిస్తే ఇట్టే అర్థమవుతుంది. ఇది బహుముఖ పాత్రగా మనం చెప్పుకోవచ్చు. అంటే రాజు పాత్రలో వచ్చిన మార్పే ఇందుకు సంకేతం.

చనిపోయిన పచ్చకోటు వ్యక్తి పాదాలను కూడా సరిగా చూడలేకపోతాడు రాజు. "ఇహ నే చూడలేను భగవంతుడా" అని వచ్చేసి ట్రైన్‌లో కూర్చుంటాడు. "చావంటే ఎంత భయం! చచ్చినవాడి సీట్లో కూర్చుందికే భయం, అనుకొని ఖాళీ అయిన కిటికీ కార్నర్ సీట్లో కూర్చుందామా మాన్దామా అని ఆలోచించి "కూర్చోడానికి నాకు భయం లేదు. కాని తరువాత చూద్దాం" అని అప్పటివరకు తనకి ఎంతో ఇష్టమైన కార్నర్ సీట్ ఖాళీగా ఉన్నా రాజు కూర్చోడు." అంతేకాదు, అతడి మరణం తర్వాత రాజు ఆలోచనలు పరిపరి విధాలుగా ఉంటాయి. అతడిని శత్రువుగా చూశానని కూడా మర్చిపోతాడు. దిగులు పడతాడు. పొగరు, వెధవ, బికారి అని తిట్టుకున్న మనసుతోనే అతడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాల గురించి ఆలోచిస్తాడు.

ఇది రాజుపాత్రలో వచ్చిన పరిణామం. చావు ద్వారా వచ్చిన మార్పు. పరిచయం లేని, సంబంధం లేని, మాట కూడా సరిగా మాట్లాడని మరో వ్యక్తి గురించి మరణానికి ముందు, మరణం తర్వాత ఓ వ్యక్తి ఆలోచనల పరంపరే ఈ కథ. అంటే రాజు పాత్ర స్వభావంలో వచ్చిన మార్పే ఈ కథా వస్తువు. పాత్రే కథను నడిపిస్తుంది. ఆ పాత్రే కథను చెప్తుంది. చూపిస్తుంది. వినిపిస్తుంది.

■■■

రెండో పాత్ర పచ్చకోటు వ్యక్తి. ఈ వ్యక్తిని కూడా రావిశాస్త్రి రాజు కోణం నుంచి, అతడి ఆలోచనల నుంచి, అతడి దృష్టి నుంచి వర్ణించే, వివరించే ప్రయత్నం చేశాడు. ఈ వివరాల్లో నుంచే రెండో పాత్రను మనం అర్థం చేసుకోవాలి. అంచనా వేసుకోవాలి. రచయిత కూడా ఎక్కడా ప్రవేశించడు. ఒక పాత్ర, మరో పాత్రకు ఆధారమవడం ఈ కథలోని టెక్నిక్.

పచ్చకోటు వ్యక్తిని రాజు తోసేయబోవడంతో ఆ పాత్ర కథలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత రాజు కూర్చుకోవాలనుకున్న కార్నర్ సీటులో ఒక్క అడుగు ముందడుగు వేయడం వల్ల అతడు వెళ్లి కూర్చుంటాడు. ఆ తర్వాత అతడి భౌతిక రూపాన్ని రాజు చూసిన విధానం కనిపిస్తుంది. 'పచ్చకోటు చెప్పలేనంతగా మాసింది. అతడు తొడుక్కున్న షర్టు తెల్లగా పువ్వులా ఉంది. కట్టుకున్న మాసీ మాయని పంచ అక్కడక్కడా చినిగి ఉంది. నెత్తి మీద పెట్టుకున్న నల్లటి మరాఠీటోపీ కింద జుత్తు బాగా పండిపోయినట్టు కనిపిస్తోంది. అతని వయసు నలభై సంవత్సరాలకి మించక పోవచ్చు. ముక్కు చాలా ఎత్తుగా ఉండడం చేతా, కళ్ళు చాలా లోతుకు పోవడం చేతా, మనిషి గెద్దలా ఉన్నాడు. అతడు ఎవ్వరి వైపూ చూడ్డంలేదు. కిటికీలో ఎడం చెయ్యి ఆన్చుకొని, కాల్తున్న సిగరెట్టు కుడిచెత్తో పట్టుకొని ఏదో ఆలోచిస్తూ కూర్చొన్నాడు.'

ఈ వర్ణనను బట్టి అతడు బాగా బతికి, ప్రస్తుతం చితికిపోయిన వ్యక్తి అని అర్థమవుతుంది. కష్టాలు, నష్టాలు అతడిని వెంటాడుతున్నాయేమో అనే ఆలోచన పాఠకుడికి కలుగుతుంది.

"మీరెక్కడండీ దిగుతారూ?" అని రాజు ప్రశ్నించినప్పుడూ అతడు జవాబు చెప్పకపోవటం, తీవ్రంగా ఆలోచిస్తూ సిగరెట్టు మాటిమాటికి పీల్చడం, ఎండిన పెదవుల్ని తడిచేసుకోవటం, లోతుకుపోయిన కళ్ళతో లోపల లోతుల్లోకి చూసుకుంటున్నాడు" అని రాజు చెప్పడంలోనే అతడు అస్తవ్యస్తమైన చిత్తంతో ఉన్నాడని అర్థమవుతుంది. ఇక "పచ్చకోటువాడు ఏదో నిశ్చయానికి వచ్చినట్టుగా గాబాల్న లేచి కంపార్ట్‌మెంట్‌లోంచి వెనక గుమ్మంలోంచి వెనకవైపుకు దిగిపోయాడు" అన్న మాటల్లో ఈ పాత్ర ద్వారానే కథ మలుపునకు తిరుగుతుంది అని పసికట్టవచ్చు.

అలాగే చనిపోయే ముందు అతడిని రాజు చూసిన విధానం... 'గర్వంగా ఠీవిగా ఉన్నాడు. అతని కళ్ళలో వెలుగు కనిపిస్తోంది. అతన్లో ఏదో తేజస్సు ప్రజ్వరిల్లుతున్నట్లుగా ఉంది. జగత్తునంతా తృణీకరించి చూస్తున్నట్టుగా ఉన్నాడు. నిర్లక్ష్యంగా నిటారుగా నిల్చున్నాడు" దీనినిబట్టి అతడు తీసుకున్న నిర్ణయం ఎంత తీవ్రమైందో, అతడు ఏదో చేయకూడని కార్యానికి సిద్ధమయ్యాడన్న భావి సూచనను కూడా గమనించవచ్చు. పాత్ర మానసిక స్థితిని చెప్పడం ద్వారా ఆ పాత్ర భవిష్యత్ కార్యాచరణని సూచించడం ఇక్కడ గమనించవచ్చు. కేవలం పాత్రోచిత కథనంలో నడిచే ఇలాంటి కథన నిర్మాణంలో ఇలాంటివి మనకు అరుదుగా దొరుకుతాయి. పచ్చకోటువాని మాట, ప్రవర్తన వెనక ఏముందో, ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు ఏమిటో... రచయిత చెప్పడు. పాఠకుడికి ఊహకు, ప్రతిభకు వదిలేశాడు. అతడి చిత్తవృత్తులను మరో పాత్ర ద్వారా చెప్పడం వల్ల అందుకు సంబంధించిన ఆలోచనలను మాత్రం సూచనప్రాయం చేశాడు.

ఇక కథలో కనిపించే మరో మూడు అప్రధాన పాత్రల గురించి కూడా చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. రెండు పచ్చకోటు వ్యక్తి చనిపోయినప్పుడు ప్రవర్తించే తీరును రాజు పాత్ర ద్వారా చెప్పిస్తాడు రచయిత రావిశాస్త్రి. ఒకటి కూలీ మనిషిలా కనపించే ఆడమనిషి. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తుంది. మనిషి మరణాన్ని చూసిన ఆమె జాలితో, గుండెబరువును ఆపుకోలేక ఏడుస్తుంది. "నిండు ప్రాణమా, మజాకానా? పోతే ఏడుపు రాదూ" అని కళ్లు తుడుచుకుంటుంది. సహజమైన మానవత్వం కలిగిన మానవ ప్రవృత్తికి ఈ పాత్ర నిదర్శనం.

మరో పాత్ర "చనిపోయిన పచ్చకోటు వ్యక్తి నాకు తెలుసు" అని చెప్పుకోవడం వల్ల జనాల్లో గుర్తింపును కోరుకుంటుంది. కానీ నిజానికి అతడు పచ్చకోటు వ్యక్తితో మాట్లాడికాని, అతడి ఎదురుగా కూర్చొని కానీ ఎరుగడు. రాజు పాత్రను తనకు ఆపాదించుకొని ప్రవర్తిస్తుంటాడు. చావులో కూడా తమ గొప్పలను ప్రదర్శించే వాళ్లను సూచించే పాత్ర ఇది. మూడోది పచ్చకోటు వ్యక్తి చనిపోయిన తర్వాత అదే సీటులో వచ్చి కూర్చొని, అతడి టోపిని చూసి, అతడు కూర్చున్న సీటు అని రాజు ద్వారా తెలుసుకొన్నాక, భయంతో అక్కడ నుంచి వెళ్లిపోతుంది. మనిషికి చావంటే ఎంతో భయమో! ఆ విషయం తెలిసిన తర్వాత ప్రవర్తనలో పిరికితనం ఎలా ఉంటుందో తెలియజేస్తుందీ పాత్ర.

'కార్నర్ సీటు' కథలో ప్రధానమైన పాత్రలు రెండు. కథ శిల్పపరంగా ఉన్నతమైంది. కథా వస్తువును ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక వహించేది రాజు పాత్ర. రెండోదైన పచ్చకోటు వ్యక్తి ఆత్మహత్యతో కథను మలుపుతిప్పడంతో పాటు మొదటి పాత్ర వ్యక్తిత్వాన్ని మార్చేస్తుంది. అలాగే నేపథ్యం ప్రయాణం అయినా అక్కడక్కడా వర్ణనలు వాస్తవికతతో కూడి పాత్రల స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని, పరివర్తనను ప్రతిబింబిస్తున్నాయి. నిజానికి ఇదో కొత్త కథా టెక్నిక్. ■

## ప్చ్...

**నా**కు.. నా వంతు ఆకాశానికి మధ్యగా
ఆవరించిన తుమ్మకంపలను దాటుకుంటూ
నేనొక్కతినే
దిగంతాల వైపు చూస్తూ నిల్చున్నప్పుడు
పడమటి దిక్కున సూర్యుడు
పసుపు ఎరుపు సమ్మేళనంగా
పొద్దును దాటుతున్నపుడు
నన్ను ఎత్తుకున్న భూమి
నా తలపై ఎగిరే పిట్టలు
ఖాళీ ఖాళీగా పడిన
పంజరాలను చూస్తున్నపుడు
బహుశా నేను నిజంగా నవ్వుకొనుంటాను!

పక్షి పరిమాణం, రెక్కల విస్తీర్ణం
పరిగణనలోకి తీసుకోకుంటున్నప్పుడు
గూడు కట్టుకున్న బాధల భారం ఎంతున్నా
రెక్కల బలం
గుండెలో ధైర్యం గుర్తుపెట్టుకుని
ఎగరాలని
పరిణామం గూర్చి మాట్లాడమని
నేనంటున్నప్పుడు
బహుశా నిజంగా నా కళ్ళు మెరిసే ఉంటాయి

పూలు నవ్వే సమయాలు
ఆకాశం తుళ్లిపడిన సందర్భాలు
పండుటాకుల ఎడబాటుకు
గండి పడిన చెట్టు గుండె చెరువుతో
నిమిత్తం లేకుండా..
వసంతం విరజిమ్మే రంగులు
బిడ్డ లొదిలేసిన పోడు
అడవి ఆక్రందనలు
కూలిన గూడు కోసం పిట్ట గోడు
ప్రగతి ఎగుడు దిగుళ్ళు
పంపకాల తారతమ్యాలు.. చీకటి మూలలు
మానవతా ఎత్తులు మనసుల లోతులు..
ఎన్నెన్నో.. ఆకాశం కింద
నవ్వో కాదో చెప్పలేను
పెదవులైతే 'ప్చ్' అంటూ విచ్చుకుంటాయి!

**- డా.దారల విజయ కుమారి**
**91771 92275**



# కాలానుగుణంగా సాహిత్య సృజనలో కొత్తదనం

**- ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ**

**'చల్లనైన జీవనానందదాయకమైన ప్రాతఃకాలపు పొగమంచు లాంటి అందమైన వాక్యాలు ఈ తరం కవులు సృష్టిస్తున్నారు. కాలంతో నడవడమే కదా సృజనకారుల పని!' అంటారు ప్రముఖ కవి డా.పెరుగు రామకృష్ణ. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య సాహిత్య ప్రస్థానం తరపున ఆయన ముచ్చటించారు. ఆ ముఖాముఖీ ఇదీ...**

**మీ బాల్యం, విద్యాభ్యాసం, కవితాసక్తి గురించి చెప్పండి.**

విశ్వకవి రవీంద్రుడు జన్మించిన మే నెల 27వ తేది 1960 లో నెల్లూరులో జన్మించాను. మా అమ్మ కమలమ్మ, నాన్న పెరుగు వెంకటేశ్వర్లు. ఇద్దరు అక్కయ్యలు, ఒక అన్నయ్య. మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. నాన్న రెవిన్యూ శాఖలో సర్వేయర్‌గా పనిచేసేవారు. హైస్కూలు దశలోనే కవిత్వంపై మక్కువ కలిగింది. తెలుగు వాచకంలో పద్యాలు, కవితలు బహుశా స్ఫూర్తి కలిగించా యనుకుంటాను. పోతన పద్యం "ఎవ్వనిచే జనించు.. జగమెవ్వని లోపల నుండు" పద్యం ఇష్టంగా వుండేది.

**మీ నాన్నగారు, అన్నయ్య ఫణికుమార్ పద్యరచన చేశారు కదా? మీరు వచన కవిత్వంపై మోజెందుకు పెంచుకున్నారు?**

నాన్న చందోబద్ధ పద్యాలు రాసేవారని అమ్మ చెప్పేది. అన్నయ్య పద్యం, వచనకవిత, ఆంగ్ల కవితలు రాసేవారు. పత్రికలకు పంపేవారు కాదు. ఇంట్లో చిన్నాన్న సాహిత్యం చదవడం రాయడం ప్రోత్సహించేవారు. 1975లో నా తొలి కవిత పురాణం సుబ్రహ్మణ్య శర్మ సంపాదకులుగా వున్న ఆంధ్రజ్యోతి వారపత్రికలో కొత్త కలాలు శీర్షికలో ప్రచురితమైంది. నేనప్పుడు పదో తరగతి చదువుతున్నాను.

**కవిత్వంలో గురువులుగా భావించి, మీరు ప్రేరణ పొందిన వారెవరైనా ఉన్నారా?**

నాగభైరవ కోటేశ్వరరావు, అద్దేపల్లి రామ్మోహనరావు ,గుంటూరు శేషేంద్ర శర్మలను కవిత్వ గురుతుల్యుగా భావించాను. నాగభైరవ గారు యువవసంతకాలు శీర్షిక నిర్వహిస్తూ అందులో నన్ను యువకవిగా పరిచయం కూడా చేశారు. అద్దేపల్లి వారితో చాలా సాన్నిహిత్యం ఉండేది. వారి పొగచూరిన ఆకాశం కవిత్వ సంపుటి స్ఫూర్తితో నేనూ ప్రపంచీకరణ నేపథ్య కవితలు రాసి పూలమ్మిన ఊరు కవితా సంపుటి వెలువరించాను. నా ఫ్లెమింగో దీర్ఘ కావ్య రచనకు శేషేంద్ర శైలి ప్రభావితం చేసిందని అను కుంటాను. హైదరాబాద్లో గ్యాన్‌బాగ్ ప్యాలెస్‌లో వారిని అనేక సార్లు కలిసాను. నా తొలి కవితా సంపుటి వెన్నెల జలపాతంకు ఆయన భూమిక రాసి ఆశీర్వాదం అందించారు.

**మీ శ్రీమతి సుజనారామం గారు కూడా రచయిత్రే కదా? మీ ప్రోత్సాహమా లేక ముందే వారికి ఆసక్తి ఉండేదా?**

తను విద్యార్థిగా వున్నప్పుడే కవిత్వం రాసేది. ముద్దబంతి పువ్వు కవిత తొమ్మిదో తరగతిలో, ఆ తర్వాత యుద్ధం కవిత, తదనంతరం డిగ్రీ చదివేప్పుడు కాలేజీ మాగజైన్లో రచనలు చేశారు. వివాహానంతరం ఇంట్లో సాహిత్య వాతావరణం వుండడం వల్ల మరింత రచయిత్రిగా గుర్తింపు పొందారు. మౌనబాష్పం తెలుగు, హిందీ అనువాదం కలిపి కవితా సంపుటి; మల్లెమొగ్గలు పేర చిన్నారుల వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు. నాతో కలిసి సార్క్ దేశాల రచయితల సదస్సు, వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయట్స్‌లో పాల్గొని కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ తన విద్యార్థుల చేత కూడా కవిత్వం రాయించి ప్రోత్సహిస్తుంది.

**మీరు వివిధ దేశాలు సందర్శించారు కదా! అక్కడి కవిత్వానికి తెలుగు కవిత్వానికి తేడా ఏమిటి?**

అమెరికా , యూరపులో గ్రీసు, చెక్ రిపబ్లిక్, మలేషియా, సింగపూర్, ఇతర దేశాల్లో వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయట్స్, అంతర్జాతీయ బహు భాషా కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాను. అమెరికాలోని వరల్డ్ అకాడెమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్, యునైటెడ్

పొయెట్ లారియట్స్ ఇంటర్నేషనల్ సంస్థలు క్రమం తప్పకుండా ప్రతియేటా నిర్ణయించిన దేశాల్లో ఈ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయెట్స్ సమావేశాలు జరుపుతున్నాయి. సుమారు 65 భాషలనుంచి 200 మంది కవులు పాల్గొంటారు. నిశితంగా పరిశీలిస్తే అక్కడి కవిత్వంలో కన్నా భారతీయ కవిత్వం శిల్ప పరంగా, రూపపరంగా, వస్తువైవిధ్యం కలిగి, భిన్న వాదాలు కలిగి వుంటుంది. ఏ దేశ కవిత్వమైనా ఆయా దేశాల భౌగోళిక, సామాజిక అంశాల నేపధ్యాల మీద ఆధార పడివుంటుంది. ఆ దేశాల్లో సామాజిక స్పృహ, సృజన తక్కువే. స్పానిష్, మెక్సికన్, చైనా కవులు ఎక్కువగా వీటిలో పాల్గొంటారు. వారి కవిత్వంలో ప్రకృతి, ప్రేమ, ప్రపంచశాంతి లాంటి అంశాలు వినిపిస్తాయి. అమెరికాలో నల్లజాతీయుల కవిత్వం గాఢంగాను, సాంద్రతతో నుంచి రంగు వివక్షపై నిరసన తెలుపుతూ వుంటుంది. స్వీడిష్ కవిత్వం చాలా కొత్తగా వుంటుంది. ఈ సమావేశాలకు భారతీయ కవిగా హాజరయినప్పుడు మొదట తెలుగు కవిత పరిచయం చేసి తరువాత దాని ఆంగ్ల అనువాదం వినిపించడం ఒక ఆనవాయితీగా పెట్టుకున్నాను.

**మీరు ఆంగ్లంలో కూడా కవిత్వం రాస్తారని విన్నాను. ఆ వివరాలు చెప్పండి?**

నేను డిగ్రీ స్థాయిలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం చదువుకున్నాను. ఆంగ్ల కవితలు కొన్ని అంతర్జాల పత్రికలు వెబ్‌సైట్‌లలో ప్రచురణ చేశాను. పొయెమ్ హంటర్, పి ఫర్ పొయట్రీ, మ్యూజ్ ఇండియా లాంటి అనేక సంచికలు నా ఆంగ్ల కవితలు, ఆంగ్ల అనువాద కవితలు ప్రచురించాయి. నా తెలుగు కవితలు మిత్రులు జగద్ధాత్రి, మైదవోలు వెంకట శేష సత్యనారాయణ, అంబికా అనంత్, డాక్టర్ కోపూరి శ్రీకాంత్, గంగా భవాని లాంటి కవులు ఎప్పటి కప్పుడు అనువాదం చేయడం వల్ల విస్తృతంగా ప్రపంచ వేదికలకు, విశ్వ సంకలనా లకు సులువుగా చేరగలిగాను. నేను ఇంగ్లీషు నుంచి నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారికి *హృదయబంధం* పేర చేసిన బాలల బొమ్మల నవలిక, కేంద్ర సాహిత్య అకాడెమీ వారిచ్చిన 14వ శతాబ్దపు కవి చండీదాస్ ప్రేమ గీతాలు అనువదించగా వారే ప్రచురణ చేశారు.

**మీరు 2007లో రచించిన 'ఫ్లెమింగో' దీర్ఘ కవిత అనేక భారతీయ భాషల్లోకి అనువాదం అయింది కదా? ఫ్లెమింగో పక్షులపై రాయాలనే సంకల్పం ఎలా కలిగింది?**

1987 నుంచి 1993 వరకు నేను వృత్తిరీత్యా నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలో నివాసమున్నప్పుడు, అక్కడికి దగ్గరలో వున్న నేలపట్టు, పులికాట్ ప్రాంతాలు సందర్శించి పక్షుల రాక సీజన్లో అక్కడకొచ్చే పక్షి శాస్త్రవేత్తలను కలసి ఫ్లెమింగో, పెలికాన్ వలస లేదా విడిది పక్షుల గురించి అనేక ఆసక్తి కర అంశాలు తెలుసుకున్నాను. తర్వాత నెల్లూరు వచ్చాక 2006లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సూళ్ళూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ జరుప తలపెట్టినప్పుడు, ఆ పక్షుల జ్ఞాపకాలు ఒక దీర్ఘ కవితగా రాశాను. ఆ యేడాది పక్షుల పండుగలో జిల్లా కలెక్టర్ ద్వారా ఆవిష్కరణ చేశాం. ఒక విలక్షణ అంశంపై తొలిసారి కవిత చేయడం, ఆ విజయం ఇప్పటికీ నేను అనుభూతిస్తున్నాను. పక్షి భారతీయ కావ్యపరంపరలో బలమైన ప్రాకృతిక, ఆధ్యాత్మిక , సామాజిక ప్రతీక అని నా రచనలో బలంగా చెప్పాను. ఇది ఇప్పటివరకు మలయాళంలో ఎల్ఆర్ స్వామి, తమిళంలో మధుమితా, కన్నడంలో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, హిందీలో చిరంజీవి, ఆంగ్లంలో జగద్ధాత్రి అనువాదం చేశారు. రొమేనియా కవయిత్రి నికులినా ఒప్రియా ఆ భాషలో అనువాదం చేసి ఆ దేశ పీరియాడికల్లో ప్రచురించారు. ఆంగ్లంలో అనువాదమై ప్రచురించబడినప్పుడే ఆ రచనకు అంతర్జాతీయ స్థాయి వచ్చింది.

**మీ కవిత్వంపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరుగు తున్నాయి కదా? ఆ వివరాలు చెప్పండి?**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన దీర్ఘకవితా వికాసం పరిశోధన గ్రంథంలో నా రెండు దీర్ఘ కవితలు ఫ్లెమింగో, నువ్వెళ్ళిపోయాక... పుస్తకాలు భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు విశ్వవిద్యాలయంలో ఒక పరిశోధికుడు నా రైతు హైకూలుపై పరిశోధన చేస్తున్నారు. నా కవితా సంపుటి పూలమ్మిన ఊరు పై రామాపురం శ్రీనివాసులు మధురై కామరాజ్ విశ్వ విద్యాలయం నుంచి ఎంఫిల్ పట్టా పొందారు. 2017లో విడుదలైన నా *ఒక పరిమళభరిత కాంతి దీపం* కవితా సంపుటిపై శశికళ అనే పరిశోధక విద్యార్థిని మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ పట్టా పొందారు. ప్రస్తుతం నా సమగ్ర కవిత్వం పై మద్రాస్ విశ్వవిద్యాలయంలో రామాపురం శ్రీనివాసులు పిహెచ్‌డి చేస్తున్నారు.

**వాణిజ్యశాఖలో ఒక వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఇంత అంతర్జాతీయ ఖ్యాతి ఎలా సంపాదించారు?**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కీలక శాఖల్లో ఒకటైన వాణిజ్య పన్నులశాఖలో 1984లో చేరి 2020లో జీయస్టీ అధికారిగా పదవీ విరమణ చేశాను. ఈ 36 ఏళ్లూ వాణిజ్యంలోని 'వాణి'ని వదలకుండా కొనసాగాను. సర్వీస్‌లో ఉన్నప్పుడే అనేక దేశాలు కవిత్వం కోసం పర్యటించాను. ఇందుకు మా శాఖ ఉన్నత అధికారుల, సహ అధికారుల సహకారం మరువలేనిది. 2008 లో రాష్ట్ర ప్రభుత్వ ఉగాది విశిష్ట పురస్కారం, 2016లో చెక్ రిపబ్లిక్ దేశంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నాను. కలకత్తాలో మైఖేల్ మధుసూదన దత్త అవార్డ్, భోపాల్‌లో భారత్ భాషా భూషణ్ బిరుదు, రంజని-కుందుర్తి, ఎక్స్ రే సంస్థల నుండి ప్రధాన కవిత్వ పురస్కారాలు, నేదురుమల్లి ఫౌండేషన్ సాహిత్య పురస్కారం, పఠాభి, వాల్మీకి, గురజాడ స్మారక కవితా పురస్కారాలు పొందాను. గ్రీస్, జపాన్, రొమేనియా, కెనడా, అమెరికా, మలేషియా లనుండి పొందిన ఎక్సలెన్సీ యిన్ పొయట్రీ ప్రశంసా పత్రాలు, మెడలియన్ అవార్డులు, జీవిత సాఫల్య

పురస్కారాలు ఎన్నెన్నో ఉన్నాయి.

**మీ కవిత్వం జై జవాన్, జైకిసాన్, ప్రకృతి, మానవ సంబంధాలనే ఎక్కువ స్పృశించడానికి కారణం?**

పుట్టి పెరిగింది వ్యవసాయ ప్రధానమైన నెల్లూరు జిల్లాలో కనుక ఎటుచూసినా రైతు జీవితం కనిపిస్తుంటుంది. నాన్న నా తొమ్మిదో యేట మరణించాక జిల్లాలోని బాలాయపల్లి మండలం జయంపులో హైస్కూలు చదివాను. రైతులు జీవితాలు, వారి సంక్షోభాలు పరికించాను. అందరికీ అన్నం పెడుతూ కూడ రైతు ఎన్నో రకాలుగా సతమతమౌతుండడం నా కవిత్వంలో ప్రతిబింబించాను. అలాగే సైనికులు దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పాటుపడే అంశాలు కవితా వస్తువుగా చిత్రించాను. ప్రకృతి పర్యావరణం కూడా నా కవిత్వంలో అధిక శాతం చోటు చేసుకోవడానికి కారణం ... ఎన్నో ప్రకృతి ప్రదేశాలు దేశ విదేశాల్లో చూసి పులకితమైన సందర్భాల వల్ల, ప్రకృతి ప్రేమికుడిని కావటం వల్ల జరుగుతుంది.

**ప్రపంచీకరణ దుష్ఫలితాలపై మీ 'వర్ణలిపి'లో గళం విప్పినట్టున్నారు?**

ప్రపంచీకరణ ప్రభావాలను నా కవితా సంపుటిలన్నింటిలో చూపిస్తుంటాను. పూలమ్మిన ఊరు (2012) లో సాంస్కృతిక దాడి, విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలు, అంతరించిపోతున్న చేతివృత్తులు లాంటి వస్తువులపై కవిత్వం రాశాను. తాజా సంపుటి వర్ణలిపిలో కూడా ఆ పరిణామాల కవితలు ఉన్నాయి. అయితే ఇందులో తాత్విక, ఆధ్యాత్మిక అంశాలపై కూడా కొన్ని కవితలున్నాయి.

**మీరు 'టీ టైం పొయెట్స్' పేరుతో నిర్వహిస్తున్న 'కవి సమ్మేళనం' గురించి చెప్పండి.**

'టీ టైమ్ పొయట్స్' పేర నేను, మైదవోలు సత్యనారాయణ, వర్చస్వి 2017లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఒక టీ షాపులో టీ తాగుతూ, కవిత్వం గురించి మాట్లాడుకుంటూ.. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. దాని రిపోర్ట్, ఫోటోలు ఫేస్ బుక్లో పోస్ట్ చేశాం. అప్పటి నుంచి నెలలో ఒకటి లేదా రెండుసార్లు ఈ సమావేశాలు నిర్వహించి, ఆ వివరాలు ఫేస్‌బుక్‌లో పెడుతుండడంతో దీనికి గుర్తింపు వచ్చింది. చాలా మంది భారతీయ కవులు, కొందరు విదేశీ కవులు కూడ టీ టైమ్ పొయట్స్‌లో పాల్గొనాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

**ఈనాటి వచన కవిత్వంలో కవిత్వం బాగా పలచబడి వచనమే మిగిలిందన్న అపప్రథ ఉంది. కారణం?**

వచన కవిత్వం పలుచబడుతుందనే అపప్రథ ఎప్పుడూ వుంది. సాంఘిక మాధ్యమాలు వచ్చాక ఎవరి భావనలు వారు ప్రకటించుకునే స్వేచ్ఛ లభిస్తుంది. అదంతా కవిత్వం కాకపోవొచ్చు. కానీ సాంఘిక మాధ్యమాల్లో, కొన్ని సమూహాల్లో చాలా మంచి కవిత్వం వస్తోంది. అకవిత్వమో, అసాహిత్యమో... రాసే వారిని రాయనీయండి– అడ్డుపడి భయపెట్టకండి అనే వాదన కూడా వుంది. ఔత్సాహికులకు కార్యశాలలు నిర్వహించి వారిని వచన కవిత్వం రాయించే దిశగా మళ్ళించే విమర్శకుల కొరత కూడా వుంది. ఒకరు చెబితే వినే ధోరణి కూడా తక్కువయింది. కొన్ని పత్రికలు ఈ వచనాలని యథాతథంగా ప్రచురించి, కొన్ని సంస్థలు వీరు చదివిన వచనానికి పురస్కారాలు యిచ్చి వీరిని అదే రాసేలా ప్రలోభపెడుతున్నాయి. అనేక మంది యువ కవులు అద్భుత సాహిత్య సృజన చేస్తున్నారు. గొప్ప కవిత్వ సంపుటాలు వేస్తున్నారు. అది కూడా మనం గమనించాలి.

**కవిత్వం ఎలా ఉండాలంటారు? మీరిచ్చే నిర్వచనం?**

ఉదయపు కోడికూత కవిత. సముద్రకెరటాల ఘోషలో ఉద్యమ కవిత విన్నారా? పిడికిళ్ళు బిగిసు కుంటున్నప్పుడో, కళ్ళ కన్నీరు కారుస్తున్నప్పుడో, వైకుంఠ రథం అనాథశవం మోసుకెళుతున్నపుడో, సైనిక కవాతులో లయబద్ధంగా అడుగులు పడుతున్నప్పుడో, నవరసాలొలికే కవిత్వం గమనించారా? కవిత గాయపడ్డ నిస్తబ్ధ హృదయానికి సజీవ స్పర్శ అనే నిర్వచనం నా తాజా సంపుటి వర్ణలిపిలో చెప్పాను.

**మీ సంపాదకత్వంలో కొన్ని కథా సంపుటులు వెలువడ్డాయి కదా? మీరు కథలు కూడా వ్రాస్తూ ఉంటారా?**

తొలి రోజుల్లో కొన్ని కథలు రాశాను. కార్టూన్లు కూడ వేశాను. స్వాతిలో అచ్చయిన నా కథ 'వలసపక్షులు' కారా మాస్టారు నుండి ప్రశంస పొందింది. నెల్లూరు రచయితలచే 2003లో అముద్రిత కథలు కథాసంపుటిగా నా సంపాదకత్వంలో జయంతి పబ్లిషర్ వారు వెలువరించారు. కథాకేళి–2004లో నెల్లూరు రచయితల ప్రచురిత కథలనుండి ఎంపిక చేసినవి నెల్లూరు రచయితల సంఘం ద్వారా ప్రచురించాను. నా శ్రీమతి సుజనా రామం కూడ కవయిత్రి, కథా రచయిత్రి. ఆమె సహకారం లేకుంటే ఇవన్నీ చేయడం సాధ్యమయ్యేది కాదు. నా పిల్లలు సాహిత్య, శ్రీనిధి కూడా నా సాహిత్య జీవిత విజయాలకు కారకులు.

**ఈనాటి యువకలాలకు మీరిచ్చే సందేశం?**

యివాళ వారు ఎంపిక చేసుకున్న సాహిత్య ప్రక్రియల్లో వారు ముందు తరం కంటే వినూత్నంగా రాస్తున్నారనేది ఒక సత్యం. తరాల వారీగా కాలానుగుణంగా మారుతున్న సామాజిక నేపథ్యాల కనుగుణంగా సాహిత్యంలో కూడా కొత్తదనం వస్తుంది. ఆయా కాలాల సమకాలీనతను ఆయా తరాలు సృజన సాహిత్యంగా నమోదు చేసి చరిత్రగ మారుస్తుంటాయి. 'ఇది వుంటే సుఖం, మరొకటి లేకుంటే దుఃఖం అని చెప్పలేం! వద్దనుకున్నదంతా వైరాగ్యం కాదు, కావాలనుకున్నదంతా అత్యాశా కాదు. ఏదీ జీవితం కాదు, ఏ ఒక్కటో జీవితం కాదు, ఎప్పటికప్పుడు ఆశువుగా కాలం చెప్పే కవిత్వమే జీవితం' అన్న ఓ యువ కవయిత్రి మాటలతో నేను ఏకీభవిస్తాను. కాలంతో నడవడమే కదా సృజనకారుల పని ఎప్పుడైనా! వారికి శుభాకాంక్షలు. ■

## కవితలు

## ముప్పాతిక భాగం



- పద్మావతి రాంభక్త

99663 07777

**ము**ప్పాతిక భాగం ఊరెళ్ళింది
ఉదయ సౌరభం పల్చబడి
గుండె దిగులు గుబులైంది
మధ్యాహ్నం ప్రవేశించడానికి
ఇంకా సందిగ్ధంలో ఉంది
సాయంత్రపు నీడ
ఎలా మేను వాలుస్తుందో ఎరుక లేదు

దేహం ఆకలిని మరచి
ఉపవాస దీక్షతో ముడుచుకుంది
ఇదీ అని చెప్పలేనితనం
గదిగదిలో పొగ పెడుతోంది

క్షణాలు బండరాళ్ళలా దొర్లుతున్నాయి
ఏమీ తోచనితనం
విసుగు దుప్పటి కప్పింది
దృశ్యాలేవీ సంగీతాన్ని పాడకుండా
మూగనోము పట్టాయి

పక్కింటి కొమ్మపై గోధుమ పిట్ట పలకరించలేదు
ఎదురింటి గోడపై ఉడుత పిల్ల సహకరించలేదు

గడియారపు ముల్లు అలిగి
ఆగిపోయింది
దీపపు వత్తి అరిగి ఆరిపోయింది
ముప్పాతిక భాగం
దూరం జరిగి కొన్ని గంటలైంది
ఉత్సాహపు పాలు విరిగి చాలాసేపైంది!

అనడానికి అవడానికి ముప్పాతిక భాగమే
వెడుతూ వెడుతూ
సమస్తాన్నీ మూటకట్టి
తనతో తీసుకుని వెళ్ళినట్టుంది
మొత్తంగా ఖాళీ చేసి మరీ వెళ్ళినట్టుంది!

## దిసమొల

**గ**తి తప్పిన లెక్కలు గతాన్ని మార్చగలవా
గతం విడిచిన ముక్కలు
వర్తమానాన్ని అతికించగలవా?
ఇంకా ఎందుకు? ఈ కర్పూరపు వాసనలు
నయా నయవంచక కూర్పులు
దేహం మొత్తం నువ్వు గుచ్చిన శూలాలతో ఛిద్రమై
నామమాత్రపు జీవంగా క్షతమై
కన్నింకిన నీటి చారలతో
ఆశలెండిన ఎండమావి తీరుతో నడవలేక నడుస్తోంది
బతుకును ఈడ్చలేక ఈడుస్తోంది!


పాలకా...
చరిత్రనైతే తిరగేస్తున్నావ్
అందలాల రాట్నం అందంగా తిప్పేస్తున్నావ్
కలలకు ఇంద్రధనస్సు తెరలు కప్పి
నా కలల్నీ నీ చెప్పుచేతలలోకి నెట్టేస్తున్నావ్ ...

కలోగంజి తినడం కోసం
నేను పడే ఆరాటాన్ని
బంగారు స్పూను మాఫియాలకి అప్పచెప్పి
ఆకలి పస్తుల రుచులకు నన్ను అలవాటు చేశావ్
రెండు కాళ్ళూ సాగదీసుకు నడిచే నా గమ్యాన్ని
నాకందనంత ఎత్తుకు చేర్చి ఉట్టికై అర్రులు చాచే
అథమ పక్షిలా మార్చేస్తున్నావ్

పారాడే నా పాదాలకు లేపనాల మాయ పూసి
చచ్చుబడిన పుచ్చుగా నన్ను మిగిల్చేస్తున్నావ్...
నూలు పోగొకటి కప్పుకు బతికేద్దామనుకున్న నాకు
పీతాంబరాల ఆశ చూపి
ఓటమి తీరాన కూర్చున్న
నా దిశ మొలను చూసి తలతిప్పుకు తిరిగి పోతున్నావ్...

తప్పు నాదే
నిన్ను నమ్మి బలాన్ని బలహీనత కళ్ళానికి అప్పగించడం
అంతరాత్మ ఉసురుని పైపై ప్రలోభాలకై తీసుకోవడం
మకిలిని నేనే
నీ చిత్రాల్ని కారు మబ్బు తునకలని నమ్మి
కురిసే వరాల జల్లుల్లో పునీతమౌతామని ఆశపడటం
పిచ్చితనమూ నాదే
బాధల చర్విత చరణంలో
నేనింకా మునిగి వుండటం
తేలుతాననే ఆశను ఇంకా వదలకుండటం ...!

– సుధా మురళి






# సమ్మోహన కవిత్వం 'మోహనదీ తీరమ్మీద నీలి పడవ'

**- కెంగార మోహన్**
**94933 75447**

*If nothing saves us from death*
*At least love should save us from life*
**- Pablo Neruda**

**కొ**న్ని కవితావాక్యాలు చదువుతుంటే వొక్కసారి కాదు.. వేలకొలది నిట్టూర్పులన్నీ కలసి వొక్కసారి కలిగిన భ్రాంతి, కొన్ని పద్యాలు చదువుతుంటే వైమరిచి అందంగా ఎగసిపడే జలపాతాన్ని వీక్షిస్తున్నట్టు, మరికొన్ని పద్యాలను తడుముతుంటే చిటికెన వేలుపట్టుకుని ఇసుకతిన్నెల మీద నడిపించినట్టు, ఇంకొన్ని చదివినపుడు సెలయేటి సవ్వడులను అందంగా వినినట్టు అనిపించింది. ఈ సమ్మోహనం కుప్పిలి పద్మ రాసిన **మోహనదీ తీరమ్మీద నీలిపడవ** కవిత్వం చదివాక కలిగిన అనుభూతి. మనిషి జీవితాన్ని పరిమళాల పూలు తాకుతాయి, నెత్తురు కార్చే ముళ్ళూ గుచ్చుకుంటాయి. గుండెల్లో బడబాగ్ని జ్వాలలూ పెల్లుబుకుతాయి, అమృతధారలూ ప్రవహిస్తాయి. ఇవన్నీ కవిత్వంలో మెలమెల్లగా ఒదిగిపోతాయి. మది చేసే సవ్వడులు, స్వరాలాపనలు, తెరలు తెరలుగా పరచుకుని ఇంద్రధనుస్సులోని రంగుల్లా కవితాక్షరాలై చేరిపోతాయి. ఈ కవిత్వం ప్రత్యేకమైంది. ఒకరి కవిత్వం చదివినప్పుడు ఇది ఫలానా కవిత్వమని చెప్పేస్తాం. అలాంటి కవులు కవిత్వ వస్తు శిల్ప సౌందర్యాలపై సాధికారత సాధిస్తారు. అలాంటి గాఢత కల్గిన వైవిధ్యమైన కవిత్వం ఇది.

వివిధ సందర్భాల్లో, తను తడిసి ముద్దైన సమ్మోహనాక్షరాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు కుప్పిలి పద్మ. **నిరీక్షణగానమిది** అంటూ రాసిన తన మాట కూడా కవితాత్మకంగానే ఉంది. **యెడతెగని నిరీక్షణ, మెలితిప్పేసే బెంగా, వుబికివచ్చే దు:ఖం, యెగిసిపడే సంబరం, ఆశానిరాశల కలకలం. ప్రకృతి కావచ్చు, ప్రేమ కావచ్చు, స్నేహం కావచ్చు, మరేదైనా బంధం కావచ్చు** అంటుంది. అందుకే షెల్లీ.. The mountains mingle with the river/And the rivers with the ocean/The winds of Heaven mix forever/With a sweet emotion/Nothing in the world is single/All things by a law divine/in one Spirit meet and mingle/Why not I with thine. భావకవిత్వ తాత్వికత ఇలా గాఢతగా చెప్పాడు. ఈ కవయిత్రి మాత్రం.. '**నీ చూపులతో/ నాదేహారణ్యం లో వెతికి/ నాకొక అపరిచిత పద్మాన్ని పట్టివ్వు/ నీ మునివేళ్ళతో/ నా తనువును స్పృశించి/ నన్నొక సీతాకోకచిలుకలా యెగరనివ్వు/ నీ మనసారా/ నా హృదయాన్ని పలకరించి/ నన్నొక గాయనిగా గొంతు విప్పనివ్వు/ నీ సమక్షంలో/ నా జీవన సముద్రం/ అసాంతం సంతోషకెరటాలతో నవ్వనివ్వు/ నీ చూపు నీ స్పర్శ/ నీ పలుకు నీ వునికి/ నాలోని పరిమళ పుష్పాన్ని/ నాలోని రంగు రంగుల రెక్కల్ని/ నాలోని అవ్యక్త రాగాలాపనల్ని/ వెలికితీసి వెలిగించకపోతే యెట్లా చెప్పు! ప్రియమైన సహచరుడా! మన సాంగత్యపు నెలవంకని యేనాటికైనా నిండు జాబిల్లిని చేయలేమా?'** అంటున్నారు. భావ కవిత్వంలో వస్తువు కంటే అభివ్యక్తికే ప్రాధాన్యం ఎక్కువ. ఆ క్రమంలో శిల్పమే కవిత్వానికి ఊపిరిపోస్తుంది. ఈ కవయిత్రి అంతర్లీన ప్రేమ కవిత్వమై పెల్లుబికింది. అందుకే **'మనసు యేదైనా కానీ.. పాటల పదును ప్రవాహాలు వదిలివెళ్ళిన జ్ఞాపకాల గట్లమీదుగా నడిచి వెళ్ళిన సుదూరాల సరంగు తెరచాప రెక్కల అడుగుల చప్పుళ్ళ కోసం సుదీర్ఘకాలంగా మౌనమనో తపస్సులో వున్న మోహనదీ తీరమ్మీద నీలి పడవ నిరీక్షణాగానమిది"** అంటుంది.

ఈ నిరీక్షణ అనిర్వచనీయ అంతులేని అనుభూతి.. మోహనది ప్రవాహంలో ఎదురీదిన అనుభవం. స్వచ్ఛమైన భావోద్రేక సెలయేటి మృదంగ నాదస్వరం. **శార్వరీ అభిషేకమై** ..అంటూ ఉగాది కవితతో ఈ పడవ ప్రయాణం ఆరంభమౌతుంది. షడ్రుచుల గూర్చో, కోకిల గానం గూర్చో అనుకుంటాం.. కానీ **యెడ తెగనియెదురు చూపుల రుతువొక్కటి/ మనసున పెనవేసుకుని యేదాది..** అంటూ భిన్నంగా అనేకసార్లు నిరీక్షించిన అనుభవాలను, పరిచయం చేస్తుంది. అనేకసార్లు నిరీక్షణ అనే

మాట వాడినా, అది శిల్ప వైఫల్యంగా కనబడకపోగా కవితకు మరింత బలాన్నిచ్చింది. కవితలో ఇలాంటి ఎత్తుగడ ముక్తాయింపులే ఆకట్టుకునేది. అలా గొప్ప ఎత్తుగడలతో సాగిపోతూనే.. **'జీవితమంతా ప్రయాణిద్దామా ప్రేమ సుగంధపు మోహదారుల్లో..'** అంటుంది. ఇలాంటి కవిత్వ శైలి పాబ్లో నెరుదాలో కనబడుతుంది. ఆ కవిత్వం చదువుతున్నప్పుడు కొత్త ప్రపంచంలో విహరిస్తున్నట్లే ఉంటుంది. పద్మ కవిత్వం చదువుతున్నా అదే భావన.

**యెవరి ప్రపంచం వారిది/ వారి వారి సహృదయంతో/ దీపం నుంచి దీపం వెలిగించినట్టు/ భావాల నుంచి భావాలను వెలిగిద్దాం/ యెవరి ప్రపంచం వారిది/ వారి వారి స్నేహంతో/ ప్రాణం నుంచి ప్రాణం వెలిగించినట్టు/ ప్రేమ నుంచి ప్రేమను వెలిగిద్దాం/ యెవరి ప్రపంచాలు వారివే అయినా/ వారి/ అక్షరాలు సీతాకోకచిలుకలుగా విరజిమ్మే/ స్ఫూర్తి మకరందంతో/ విముక్తి గీతమవుదాం.. (యెవరి ప్రపంచం వారిది)** ఇది ప్రత్యేకమైన శైలి కలిగినదీ.. ప్రత్యేక శిల్పం కలిగినది. జీవన ప్రయాణంలో సాగే అనేక మలుపులని, ప్రయాణంలో పలకరించే స్నేహం- స్నేహమాధుర్యం, ప్రాణప్రదమైన ప్రేమ ఈ కవిత చెబుతుంది. ఇందులో అంతర్లీనంగా రంగురంగుల స్వప్నాలూ, హరివిల్లులూ కనబడతాయి. అక్షరాల సీతాకోకచిలుకలుగా విరజిమ్మే స్ఫూర్తి మకరందంతో విముక్తిగీతమవ్వడం కవితకు నిండుదనాన్నివడమే కాక పరిపూర్ణజీవన రహస్యం చెప్పినట్లైంది. కానీ విముక్తి గీతమవ్వడం వొకానొక చైతన్యమే అయినా ఇరువురి దేహాలు ఒక ప్రపంచమనే భ్రాంతి కలుగుతుంది. ఇక్కడ షెల్లీ చెప్పిన.. Our sweetest song are those that tell of saddest thoughts.. అన్న మాట గుర్తొస్తుంది. కొన్ని జీవనప్రయాణాలు సుఖాంతమౌతాయి. మరికొన్ని విషాదాంతమౌతాయి. ఇక్కడ అనేక ప్రవాహాలను అధిగమిస్తూ సాగిన మోహనదీ విముక్తి గీతాన్ని ఆలపించాలనుకుంటుంది. ఈ కవిత్వంలో

**తొలకరి వొక్కలానే ఉండదు../ వొక్కొక్కరికి వొక్కో తొలకరి/ బహు రూపాల్లో కురిసే తొలకరి/ ఎవరి తొలకరి వారిదే../ గ్రీష్మాంతర వానోత్సవం..** అంటూ వానను కలగనడం చూస్తాం. కవిత్వం విపరీతంగా చదువుతుంటే కొన్ని పదాలు చదివినప్పుడు కూడా ఫలానా పదం ఈ కవి మాత్రమే వాడతారు అనిపిస్తుంది. ఉదాహరణకు సాహిత్య ప్రకాశ్ ఆకుపచ్చని జ్ఞాపకం అంటుంటాడు. డా.ఎం.ప్రగతి సీతాకోకచిలుక అన్న పదాన్ని ఎక్కువగా రాస్తుంది. అలాగే కుప్పిలి పద్మ వెదురు వనాలం టుంది.. అదేలాగంటే ఒక కవితలో..**'మొదటిసారి మీ పెదవులు నా పేరును పిలిస్తే వెదురు వనాలన్నీ సరికొత్త మోహనురాగ మయ్యాయి'' (మీ స్వరం),** అలాగే..**''సద్దుమణిగిన దీర్ఘ సాయంత్రంలో ఆరుబయట దూరానెక్కడో వెదురు వనాల రివ్వున వీచే చిరుగాలి మలిసంధ్య వాలేక్షణం అంచుకు చేరింది.' (ప్రతీక్ష).** ఇలా ప్రతి కవి ఒక పదాన్ని బలంగా మస్తిష్కంలో సుస్థిరం చేసుకుంటారు. వాటిని తను కవిత్వం రాస్తున్న క్రమంలో వెన్నెల కురిసినట్లుగానో, మంచు బిందువులు బొట్లుబొట్లుగా తడిమినట్లుగానో, గాథతగానో, నిప్పుకణికలుగానో సందర్భానికి అనుగుణంగా ప్రయోగిస్తారు. ఈ క్రమంలో వైవిధ్యమైన శీర్షికతో రాసిన కవిత పేరునే ఈ సంపుటికి **మోహనదీ తీరమ్మీద నీలిపడవ** అని పెట్టుకుంది. ఆ కవిత చూద్దాం.

**తొలి వేకువ గీసిన/ లేత గాయాల్ని కప్పిపెడుతూ**
**నీరెండల పొగమంచు యేమీ చెప్పదు.**
**తెరచాపలు దాచిన**
**నీలి అలల సుదూరాలూ యేమీ చెప్పవు.**
**కన్నీటి చెమ్మలని దాచిపెడుతూ**
**సుదీర్ఘ నిరీక్షణలనంతరం**
**గుండె వూసుల్ని మోసుకొచ్చిన**
**మోహనదీ తీరమ్మీద నీలిపడవ.**
**పోనీ నువ్వు చెప్పు**
**పాటల్ని చేజార్చుకున్న ఆ వొంటరి నావికుడు**
**నదితో చేసే ఆ రహస్య సంభాషణ యేమిటో?**
**సుదీర్ఘ యానాల / అగాధ గీతాల్ని నెమరేసుకొంటూ**
**మోహనదీ తీరమ్మీద నీలిపడవ**
**శిథిలమయ్యే గట్లని వొరుసుకొంటూ**
**శిశిరం రాల్చే వొదలిన ప్రేమలేఖలూ**
**యే గుండె గుట్టునీ విప్పవు**
**మూగబోయే బాటలమీద విచ్చుకొంటూ**
**కాలం చిగిర్చే చిట్టి గడ్డి పూలూ/ యే పరిమళాన్ని కానుకివ్వవు**
**నువ్వు యెవరికీ చెప్పకు**
**వెన్నెల మీద వూగుతోన్న పడవ వొడ్డుకు చేరుస్తోన్న**
**అవిరామ మార్మికతల్ని**
**సుదీర్ఘగానాలని నిశి నిశ్శబ్దాలని ప్రకంపిస్తూ**
**మోహనదీ తీరమ్మీద/ నీలిపడవ.**
**బహుశా**
**మోహగీతం**
**నీలిరాగం ప్రేమే కదా... !**
**తీరమ్మీద వాలిన సీతాకోకచిలుక**
**అలల మీద**
**వెచ్చని కలల తెప్పల్ని పూయిస్తోంది...**

ఈ మోహనదీ తీరం ప్రేమ అని తేల్చేయడం ఈ కవిత్వ ముక్తాయింపు. ఈ కవిత్వం లోతైన భావుకత గలది. ఇందులో ప్రేమొక్కటే కవిత్వమవ్వలేదు. భిన్నమైన కవితావస్తువుల్ని కూడా ప్రేమమయం చేశారు. కొన్ని సామాజిక సమస్యల్ని కూడా లోతైన దృష్టికోణంతో కవిత్వీకరించారు. మోహవల, రహస్యభాష, కుంకుమపూల స్వేచ్ఛ, విత్తనాల మూటల్ని విప్పి, నిద్రపట్టక, మోహరుతువు, మోహ సాహచర్యం, వానపువ్వులు కవితలు మనిషిని సరికొత్త ప్రపంచంలో నడిపిస్తాయి. ■




# గొంతు నొక్కుతున్న గోడీ మీడియా!

- వి.బి.పరమేశ్వరన్

**కా**ర్పొరేట్ మీడియా సంస్థలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య మంచి సామరస్యం ఉందన్న వాస్తవాన్ని ఇటీవలి పరిణామాలు వెల్లడి చేస్తున్నాయి. అదానీ అవినీతి బాగోతానికి సంబంధించిన కొన్ని విషయాలను అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ జనవరి చివరి వారంలో బయటపెట్టింది. ప్రపంచంలో కెల్లా అత్యంత ధనిక కార్పొరేట్‌గా అవతరించేందుకు అదానీ కంపెనీలు షేర్ ధరలు పెంచాయన్నది అందులో కీలకమైన అంశం. దీంతో అదానీ పతనం మొదలైంది. ఇది ప్రపంచ మీడియాలో పతాక శీర్షికలకెక్కగా, భారత మీడియా మాత్రం సాధారణ వార్తకు మించిన ప్రాధాన్యత ఇవ్వలేదు. మరోవైపు అదానీ ఒక్కరోజులో రెండు పూర్తి పేజీ ప్రకటనలు ప్రచురించి మీడియాను ప్రభావితం చేశాడు. కొన్ని జాతీయ వార్తాపత్రికలైతే హిండెన్‌బర్గ్ కథనాన్ని మొదటి పేజీలో ఇవ్వనేలేదు. ఇలాంటి వార్త బయటికి వచ్చినప్పుడు దీనికి కొనసాగింపుగా మరిన్ని పరిశోధనలు, బ్రేకింగ్ స్టోరీలు వస్తాయని నాలాంటి పాఠకులు భావించారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిన దేశంలోని అత్యంత సంపన్నుడు కుప్పకూలడం అనేది జాతీయ మీడియాకు పెద్ద వార్తగా కనిపించలేదు.

దీన్ని కేవలం ఒక వ్యాపార సామ్రాజ్య పతనంగా మాత్రమే చూడలేం. భారత ప్రధాని నరేంద్ర మోడీ నీడలో ఎదిగిన

వ్యాపారవేత్త అదానీ. అందువల్ల ఆ తర్వాత కూడా ఈ వార్తల తదుపరి అంశాలను ఇవ్వడానికి, అసలు నిజానిజాలను బయటకు తీసుకురావడానికి ఏ మీడియా సంస్థా ఇష్టపడలేదు. ఈనాడు భారతీయ మీడియా అత్యంత శక్తిమంతమైన వ్యక్తుల పనిని విచారించడానికి భయపడుతోంది. అధికారులను ఇబ్బంది పెట్టే ప్రశ్నలు అడగకుండా మీడియా అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ అన్నట్టు ఇండియాలో పరిశోధనాత్మక జర్నలిజానికి తెర పడిందా అన్న అనుమానం వచ్చే పరిస్థితి ఏర్పడింది. మీడియా మౌనానికి కారణం ఏమిటి?

అదానీ కంపెనీలకు, మీడియాకు మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలే ఈ వార్తను కప్పిపెట్టడానికి ప్రధాన కారణమని 'న్యూస్ లాండ్రీ' ప్రచురించిన నివేదిక వెల్లడిస్తోంది. అర్థబలాన్ని ఉపయోగించి అదానీ కంపెనీకి వ్యతిరేకమైన వార్తలను అడ్డుకోవడంలో విజయం సాధించారు. (అదానీ కంపెనీల గురించి ఇంతకు ముందు చెప్పినట్లు భారీ ప్రకటనలు ఇస్తున్నారు). ఇప్పుడు మీడియా మునుపటిలా అదానీ, ఇతర అనేక కార్పొరేట్లకు వ్యతిరేకంగా వార్తలు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. దీనికి రకరకాల కారణాలున్నాయి. అందులో ఒకటి నేడు మీడియా ఎక్కువగా కార్పొరేట్ల చేతిలో వుంది. నయా ఉదారవాద యుగంలో, వార్తా ప్రయోజనాల కంటే యజమానుల ప్రయోజనాలే ప్రధానంగా తయారయ్యాయి. భారతదేశంలో కార్పొరేట్లు, అతివాద హిందూత్వ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేతులు కలిపి ముందుకు సాగుతున్నాయి. అందువల్ల ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే అదానీ కుంభకోణం గురించిన వార్తలను ఈ మీడియా ప్రచురించదు. రెండవది, మీడియా కార్పొరేట్ల మధ్య 'రహస్య ఒప్పందం' కూడా కార్పొరేట్ వ్యతిరేక వార్తలను అందించకుండా మీడియాను నిరుత్సాహపరుస్తోంది. ప్రధాన జాతీయ వార్తాపత్రికలకు అనేక కంపెనీలలో వాటాలు ఉన్నాయి. అలాంటి కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఈ మీడియా ఎలాంటి వార్తలను ప్రచురించదనేది గ్యారంటీగా చెప్పవచ్చు.

'మోడీస్ ఇండియా – హిందూ నేషనలిజం అండ్ ది రైజ్ ఆఫ్ ఎత్నిక్ డెమోక్రసీ' అనే పుస్తకంలో... ప్రజాస్వామ్యం యొక్క నాల్గవ స్తంభం కార్యనిర్వాహక వ్యవస్థకు సహ స్తంభంగా ఎలా మారిందో క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ వివరించారు. ప్రధాన స్రవంతి మీడియా 2002 గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్ర గురించి

చెప్పడానికి కొంత సుముఖంగా ఉంది. ప్రధానిగా తాను ఏం చెబితే అది వినడం, ప్రశ్నలు వేయకపోవడం మోడీ విధానం. తాను చెప్పాలనుకున్నది 'మన్ కీ బాత్' ద్వారా, ట్విట్టర్ ద్వారా చెప్పే విధానం మోడీది.

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఎన్‌డిఎ సమావేశం ముగిసిన తర్వాత, ముఖ్యమైన క్యాబినెట్ సమావేశాల తర్వాత మీడియాను కలుస్తుండేవారు. అయితే ఇప్పుడు ఢిల్లీ జర్నలిస్టులకు ప్రధాని మోడీ విలేకరుల సమావేశానికి హాజరైన అనుభవం లేదు. అలాగే మాజీ ప్రధానులందరూ విదేశాలకు వెళ్లేటప్పుడు జర్నలిస్టులను తమ వెంట తీసుకెళ్లేవారు. విమానంలో ప్రధాని మీడియా సమావేశం ఏర్పాటు చేసేవారు. కానీ మోడీ ప్రధాని అయ్యాక ఇవేవీ జరగడంలేదు.

కోవిడ్ రాకతో పార్లమెంట్‌లోకి మీడియా ప్రవేశంపై ఆంక్షలు విధించారు. మీడియాను లొంగదీసుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రధానంగా ఐదు పనులు చేస్తోందని క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ అంటున్నారు. ప్రభుత్వాన్ని, అధికార పార్టీని విమర్శించే మీడియాకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనలను తిరస్కరించడం అందులో ఒకటి. మీడియాకు సంబంధించి ప్రకటనలు లేకపోతే మనుగడ లేదు. ప్రభుత్వ ప్రకటనలే మీడియాకు ప్రధాన ఆర్థిక వనరు. అది పూర్తిగా ఆగిపోతే మీడియా ప్రభుత్వాన్ని పొగడడం మినహా మరో మార్గం వుండదన్నది మోడీ సర్కార్ లెక్క.

మీడియాను లొంగదీసుకోడానికి మరొక మార్గం ఏమిటంటే సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దాడులు నిర్వహించడం. కోవిడ్–19 రెండవ వేవ్ సమయంలో ప్రముఖ హిందీ వార్తాపత్రిక దైనిక్ భాస్కర్ ఒక ఫోటోను ప్రచురించిన మరుసటి రోజే ఇ.డి ఆ సంస్థ కార్యాలయాన్ని సందర్శించింది. దీంతో ప్రభుత్వ వ్యతిరేక వార్తలు తగ్గుముఖం పట్టాయి. ఇక చివరగా తమిళనాడులో బీహారీలను వేటాడుతున్నారని నకిలీ వార్తలు ఇచ్చి బిజెపి కి సహకరించిన ప్రధాన మీడియా సంస్థల్లో ఇదీ ఒకటి.

ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్న 'న్యూస్ క్లిక్' అనే వెబ్ పోర్టల్ చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ ఇల్లు, కార్యాలయంపై ఇ.డి దాడులు చేసింది. 114 గంటల పాటు ఇంటిని సోదా చేశారు. ఒక రోజుకు పైగా కార్యాలయాన్ని ముట్టడించగా, ఐదు రోజులు ఇంటిని ముట్టడించారు. అప్పుడు ఏమీ దొరకలేదు. ఇతర మీడియాలకు భిన్నంగా 'న్యూస్ క్లిక్' ఇప్పటికీ బిజెపి వ్యతిరేక వేదికగానే నిలుస్తోంది. ఎన్‌డి టీవీ కార్యాలయంపై కూడా దాడి చేశారు.

ప్రచురించడానికి, ప్రసారం చేయడానికి తాత్కాలికంగా అనుమతిని నిరాకరించడం ద్వారా మీడియాను కట్టడి చేయడం మరొక పద్ధతి. ఒకానొక సమయంలో, ఢిల్లీ అల్లర్లను నివేదించిన విధానాన్ని విమర్శించినందుకు ఏషియా నెట్, మీడియా వన్ ప్రసార అనుమతి నిరాకరించబడింది. ఏషియా నెట్ క్షమాపణ చెప్పిన తర్వాతే ప్రచురించడానికి అనుమతి లభించింది. ఆ తర్వాత మీడియా వాణికి కూడా అదే అనుభవం ఎదురైంది. ఆఖరికి మీడియా వాణిని ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పుల్వామా దాడిలో ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడిన ఎన్‌డి టివికి ప్రసార అనుమతి కూడా నిరాకరించబడింది.

జర్నలిజాన్ని సీరియస్‌గా తీసుకునే జర్నలిస్టులను బహిష్కరించేలా వార్తాపత్రిక యాజమాన్యాలను ప్రభావితం చేయడం మోడీ ప్రభుత్వం అనుసరించిన మరో పద్ధతి. అందుకు అనేక ఉదాహరణలు చెప్పవచ్చు. 'ఔట్ లుక్' వారపత్రిక సంపాదకుడు రూబెన్ బెనర్జీని తొలగించడం అందులో ఒకటి. కోవిడ్ రెండవ వేవ్ సమయంలో ఔట్ లుక్ వీక్లీలో 'మిస్సింగ్' పేరుతో కథనం విడుదలైంది. మే 2021లో ప్రచురించబడిన ఈ కవర్ స్టోరీ, వ్యాధి వ్యాప్తిని నిరోధించడంలో, వ్యాధి సోకిన వారికి చికిత్స చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చాటి చెప్పింది. మోడీ ప్రభుత్వ వాదనలు బూటకమని ఈ కథనం రుజువు చేసింది. సహజంగానే ఈ కవర్ స్టోరీ మోడీ ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రూబెన్ బెనర్జీ ఎడిటర్ పదవిని కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని దాచిపెట్టిన పైశాచిక చర్యను ప్రపంచానికి బట్టబయలు చేసిన ఇండియా టుడే టెలివిజన్ తనుశ్రీ పాండే కూడా ఉద్యోగం కోల్పోయారు.

మీడియాను భయపెట్టడానికి, లొంగదీసుకోవడానికి ప్రభుత్వం... విమర్శనాత్మక జర్నలిస్టులను అరెస్టు చేయడం, చిత్రహింసలు పెట్టడం కూడా చూస్తున్నాం. ఆల్ట్ న్యూస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మలయాళీ జర్నలిస్ట్ సిద్ధిక్ కప్పన్, కమ్యూనిజం కంబాట్ ఎడిటర్ మహమ్మద్ జుబేర్, తీస్తా సెతల్వాద్, హత్రాస్‌లో జరిగిన ఘటనను నివేదించేందుకు వెళ్లిన మనన్ గుల్జార్‌తో సహా కాశ్మీర్‌లోని కొందరు జర్నలిస్టులను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఏడాదిన్నర తర్వాత సిద్ధిక్ కప్పన్ జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు జుబేర్ మూడు వారాలకు పైగా జైలు జీవితం గడిపారు. తీస్తా జైలు నుంచి బయటకు రావడానికి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. 2014 నుంచి ఇప్పటి వరకు 100 మందికి పైగా జర్నలిస్టులను అరెస్టు

చేశారు. దాదాపు 40 మంది జైలులో ఉన్నారు.

ది వైర్ ఎడిటర్, కారవాన్ మాజీ ఎడిటర్ సిద్ధార్థ్ వరద రాజన్, మలయాళీ జర్నలిస్టు వినోద్ కె జోస్, రాణా ఆయూబ్‌తో పాటు పలువురిపై దేశద్రోహం కేసులు నమోద య్యాయి. దీంతో చాలామంది మీడియా వారు మౌనంగా వుండిపోవాల్సి వచ్చింది. బిజెపికి, మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా లేని వార్తలు, కథనాలు, విశ్లేషణలను న్యూస్ డెస్క్ నుంచి మినహాయించే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా తమంతట తాము సెన్సార్ విధించుకోవడం జర్నలిజానికి అతి పెద్ద ముప్పు.

ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా, డిజిటల్ మీడియా కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఇందుకు కొన్ని పరిమితులు ఉన్నాయన్నది తెల్సిన విషయమే. అదే సమయంలో కొన్ని అతిశయోక్తులు, తప్పుడు సమాచారం ప్రచారం చేయబడుతోంది. అయితే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా అనేవి ప్రతిపక్ష పాత్రలో సానుకూల పాత్ర పోషిస్తున్నాయి. అధికార పార్టీ, ప్రభుత్వం సృష్టించిన అనేక నకిలీ వార్తలను అవి బహిర్గతం చేస్తుంటాయి. మోడీ ప్రభుత్వం వాటి నోరు మూయించే ప్రయత్నాలు ప్రారంభించింది. ఐటీ రూల్ 2021ని సవరించడం అందులో భాగమే. పిఐబి నకిలీ వార్తలుగా నిర్ధారించినవి పూర్తిగా తొలగించబడతాయి. ఆకాశవాణి, దూరదర్శన్ అందించే వార్తలను పూర్తిగా సెన్సార్ చేయడంలో భాగంగా పిటిఐ ఏజెన్సీని మినహాయించి ఆర్ఎస్ఎస్ వార్తా సంస్థ హిందుస్థాన్ సమాచార్‌తో ఒప్పందం కుదిరింది. భారతీయ మీడియా అక్షరాలా గోడీ మీడియాగా మారిపోయింది. ఈ మీడియా కాషాయీకరణ భారత ప్రజాస్వామ్యాన్ని కూడా నాశనం చేస్తుందనడంలో సందేహం లేదు.

('పేట్రియాట్ వీక్లీ' నుంచి) ■



**శ్రీమతి యలమర్తి అనురాధ సాహిత్యంలో చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు ఆమెను వారి కార్యాలయంలోనే శాలువాతో సత్కరించారు. డా. గట్ల ప్రవీణ్ డా.టి.జగదీశన్ ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు.**




# వన కాంతలు

- ప్రభాజ్యోత్స్న
9492588072

గిరిశిఖర కీర్తి కాంతలు
వన మయ్యూఖాలు
ఏటి గట్టు సొగసును నింపుకున్న
రెళ్ళపూల అందాలు
నీటి పరవళ్ళ నిగారింపుల నడకలు
ప్రత్యేక చీరకట్టులో మెరిసేటి కాంతి పుంజాలు ..

జానపదాలను ఆస్వాదిస్తూ..
ఆడిపాడే స్వేచ్ఛా పిపాసులు
సహజసిద్ధ అలంకరణల గోరింట రంగవల్లులు
మోదుగ పువ్వుల పోలికలో
మెరిసే కాంతలు...

అగ్నిపునీతకి అక్క చెల్లెళ్ళు
గుండెల నిండా ఆరని గాయాలను
మోసే విప్లవ వారధులు
గుడిసెలనే వినీలాకాశంలో
వెన్నెలను కురిపించే చందమామలు
గుక్కెడు గంజికోసం
రక్తాన్ని సైతం ఆరబెట్టే చకోరిలు
అరచేతిలో ఎడారి సైకతం మోస్తున్న ..
అజంతా కాల్పనికలు
నీటిలో .. ముగ్ధ మనోహర కలువలు
నీలిమేఘ పరిమళాలు
మాండలిక పారిజాతాలు
సకల భారతావనికి
నిర్మలత్వ ప్రతీకలు
నిర్విరామ.. ఉదయకిరణాలు
అరణ్యాన సిరి చందనాలు
భ్రాంతి నిండిన బతుకులు
క్రాంతి సోకని నిరంతర శోకాలు
రాతిలో తేమని ఒడిసి పట్టే
నిరంతర శ్రమజీవులు
స్వేద ధారను నమ్ముకున్న మానధనులు! ■




# వీరబ్రహ్మం 'కాళికాంబ సప్తశతి' సమాజ శ్రేయస్సు

- డాక్టర్ జి.శైలమ్మ
96183 61095

**తె**లుగు సాహిత్యంలో వచ్చిన శతక ప్రక్రియ మానవ సమాజాన్ని ఎంతో చైతన్యవంతం చేస్తుందనుటలో ఏ మాత్రం సందేహం లేదు. సాహిత్యంలో తాత్వికాంశాలను జోడించి ఉమానాలుగా అనేకాంశాలను ఉదహరిస్తూ శతక కవులు సులభంగా చిన్న చిన్న పదాలతో పద్యాలను రాశారు. కాలజ్ఞానిగా గుర్తింపుని సొంతం చేసుకున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి 'కాలికాంబ హంస కాళికాంబ' మకుటనియమంతో అనేక పద్యాలను రచించారు. కాళికాంబ శప్తశతిలో 701 పద్యాలు మానవ సమాజ వికాసానికి ఎంతో తోడ్పడగలవు.

సమాజంలో వేదాలను స్త్రీలు, వెనుకబడిన జాతులు చదవకూడదనే ఆచారం వుండేది. దీన్ని వీరబ్రహ్మంగారు పూర్తిగా నిరసించారు.

"వెలదులకును వేదవిద్యాదికారమ్ము
లేదటంచు బ్రహ్మ లిఖిత మంచు
నోరుతెఱచి మఱచినారు వాణిని నిన్ను
కాళికాంబ! హంస! కాళికాంబ!" పుట:678.

చదువు నేర్చిన వారికి ('వాణి') చదువుల తల్లి కటాక్షమే వుందంటారు. చదువు నెరిగిన వారు స్త్రీలను మరచిపోవడం జరుగుతుందని, వేదాలు బ్రహ్మచే రాయబడినవని చెప్పడాన్ని వీరబ్రహ్మంద్రేస్వామి నిరసించారు. వేదాలను అందరు చదవాలని, అందులోని వాస్తవికాంశాలను అందరు తెలుసుకుంటే సమాజం చైతన్యవంతంగా ముందుకు పయనిస్తుందని ఆవేదన చెందారు.

మతం మనుషుల మధ్య బేధాలను సృష్టిస్తుంది. దీనివల్ల మనిషిని మనిషే చంపుకుంటున్న తీరుని నిరసించారు. ఇది మతం కాదు 'మత్తు' మనిషికున్న విచక్షణాజ్ఞానాన్ని కోల్పోతున్న విధానాన్ని బ్రహ్మంగారు నిరసించారు.

మతము మత్తు గూర్చు మార్గమ్ము కారాదు
హితము గూర్చవలయు నెల్లరకును
హితము గూర్చలేని మతము మానగవలె పద్యం: 694.

'మత్తు'లో వున్నవారు కుటుంబసభ్యులను, తమ యోగక్షేమాలను చూసిన వారిని హింసించి చంపడం చూస్తుంటాం. దాన్ని బ్రహ్మంగారు నిరసించారు. మత్తు కలిగించే మతము వద్దు హితాన్ని బోధించేదేదన్నా వుంటే అదే మతం కావాలని, సమాజశ్రేయస్సు ప్రధానమనంటారు.

కులమతాల జాడ్యములలోన దపియించు
దీనజనుల సేద దేర్చువాడ
మానవుండె ధరను మాధవుండనువాడ (పుట:700

దేవుడిగా పూజింపబడాలంటే కులమతాలను వదిలి దీనులైన జనుల క్షేమాన్ని కాంక్షించేవారే దైవంగా పూజింపబడతారనంటారు. ప్రజల క్షేమమే మన మతం కావాలనంటారు.

మనుషులు ఒకరోజు మరణించక తప్పదు. అల్పప్రాణులు పుడుతుంటాయి. గిట్టుతుంటాయి. వాటి ప్రాణానికి విలువలేదు. మాయలో పుట్టి మొత్తం నాదేనంటూ స్వార్థంతో అత్యంత ధనవంతునిగా జీవించేవారు తెలుసుకోవాల్సిన గొప్ప విషయాన్ని తెలియజేశారు.

విశ్వమంత మాయ వేదుకులను మాయ
నేను, మేను మాయ నీవు మాయ
మాయలోన బుట్టి మలయు సమస్తంబు పుట:97.

ఎన్నో తరాలు మట్టిలో కలసిపోయాయి. వారంతా వెంట ఏదీ తీసుకుపోలేదన్న విషయాన్ని గుర్తించాలని స్నేహశీలంగా జీవించాలనంటారు.

దళిత బహుజన జాతులు స్వయంగా పనులు చేసి ఈ దేశాన్ని అభివృద్ధి చేస్తుంటారు. శ్రామికులుగా, పాలేర్లుగా పనులు చేస్తుంటారు. వీరు చేసే పనిని బట్టి 'కులము'ను నిర్ధారించారు. కులం పేరుతో తక్కువ చేసి మాట్లాడటం మంచిది కాదనంటారు. శూద్రులను తక్కువ చేసి చూడటాన్ని నిరసించిన వీరబ్రహ్మంగారు శూద్రులే ఈ సృష్టిలో ముందున్నదంటారు. అందుకు నిదర్శనంగా వేదాలను అధ్యయనం చేసి తెలుసుకోండని పిలుపినిచ్చారు.

"ఇలకు దిగెడువేళ కులమెవ్వరికి లేదు
మొదలు శూద్రుడుగను పుట్టువందు
శ్రుతులు చదువు వెనుక శూద్రుండె విప్రుడౌ"

పుట:116.

విప్రులని ఎవరినైతే అంటున్నామో వారు ఒకప్పటి శూద్రుడేనంటూ పుట్టుకతో కులము ముసుగేసుకొని పుట్టరని మనుషుల మధ్య బేధభావన పోవాలని కులాన్ని నిరసించారు.

విద్య మనిషిని మనిషిగా గుర్తుస్తుంది. విద్య విజ్ఞత నేర్పుతుంది. సమాజాన్ని బలపరుస్తుంది. మనిషిని వివేకవంతుడిగా ముందుకు నడిపిస్తుంది. అనేకరకాలైన విద్యలు నేర్చినవారు మూర్ఖత కలిగివుంటే ఆ చదువుకి ఫలితం లేదనంటారు.

"చదివి చదివి ముదిమిగదిసి మూర్ఖతరేగ
చదువు మర్మ మెఱుగు జాడ గనరు
నేర్పు లేని చదువు నిష్ప్రయోజనమౌను" పుట:145.

'నేర్పు' మనిషి జీవించగలిగేలా చేసేది విద్య అటువంటి విద్యకు ఫలితం సమాజశ్రేయస్సు అని అంటారు.

కోటి విద్యలు కూటికొరకు. అన్నం ప్రతి కులపువానికి కావాలి, ప్రతి మతం వానికి కావాలి. సృష్టిలో ప్రతి జీవికి బ్రతకడానికి ఆహారం కావాలన్నది ప్రధానం. ఇక్కడ మనకి అన్నం కావాలి. ఈ అన్నం కోసమే కదా మనిషి తన చుట్టు ఏర్పరచుకున్న కంచెలకు కారణమంటారు. మనుషులందరు అన్నదమ్ములవలె కలసిమెలసి వుంటే ఘర్షణలుండవ నంటారు.


"కూటి వలన నేరుపాటయ్యె ప్రాణులు
కూడులేక వేఱు కులము లేదు
కూటిమర్మమెఱుగు గురుమూర్తి యొక్కడే" పు:175.

కూడు కోసం జరిగే కొట్లాటల్లో మనిషిని మనిషి హతమార్చుకోడం తరతరాల నుండి వస్తున్న విధానం బ్రహ్మంగారి కాలం నుండి ఆధునిక కాలం వరకు కొనసాగుతూనే వుంది. మార్పు రావాల్సిన అవసరం వుంది.

'మరణం' చాల విచారకరమైనది. కొంతమంది పంతంపట్టి చచ్చి సాధించాలనుకుంటారు. చనిపోతే సాధించేది వుండదని వారి జీవితం అంతమైనట్టే అవుతుందని బ్రతికి సాధించుకోవాలని ధైర్యాన్ని నింపుతారు.

"చచ్చి యెవరినైన సాధింపగా లేము
చాక బాధకముల సాధకముల
సమయజేసి పరము సాధించు కొనరయా
కాళికాంబ! హంస! కాళికాంబ!

మనిషి పుట్టిన తరువాత చేయవలసిన మంచి పనులు చేసి, తమకున్న స్థానాన్ని గుర్తించుకోవాల్సిన అవసరం వుందనంటారు. వీరబ్రహ్మంగారు ఈ శతకంలో సమాజ శ్రేయస్సుని కాంక్షించి అనేక సోదాహరణలతో సులభగ్రాహ్యంగా పద్యాలను రచించారు. మంచి మనిషి మంచి సమాజాన్ని నిర్మించగలిగినట్లైతే అసమానతలు తొలగి లభించే వనరులను అందరు పంచుకొని జీవించగలుగుతారు. ■



## నీవు ...

నీవు రంపమైతే
వృక్షజాతులు వణుకై భీతిల్లి
నీవు కరవాలమైతే
జంతుజాలాలు తీయని కునుకై శోకిల్లి
నీవు కలమైతే పలుకై ప్రణమిల్లి
సొగసు సోయగంతో వాలవా రామచిలుకలు
రసజ్ఞ మనోజ్ఞంతో వీయవా విజ్ఞాన వీచికలు
నీవు కలకలమైతే
రుధిర జ్వలనంతో ఆవహించవా
కలకత్తా కాళిక నాలుకలు

**- కోటం చంద్రశేఖర్**

**94920 43348**

# కమలాదాస్ కవితలు


మూలం : **కమలాదాస్** (1934 - 2009)

మలయాళ కవయిత్రి, రచయిత్రి

అనువాదం : **పి.శ్రీనివాస్ గౌడ్**

99494 29449




## వేరొకరి పాట

**ప**ల్లె బావుల వద్ద
కన్నెపిల్లల కోలాహల స్వరాలలాగ
లక్షలాది మందిలా
ఒకేసారి మాట్లాడుతున్నాను

తెగులుకు మందలు మందలుగా చనిపోయిన
లక్షలాది మరణాలను నేను
ప్రతి ఒక్క ఎండిన విత్తనం
మరొకరి జ్ఞాపకంగా పెరగడం కోసం
ఏదో ఒక రోజు రాలిపోవాలి

జయించిన ఉద్వేగరక్తంతో ఎర్రబారిన
లక్షలాది జననాలను నేను
పెరిగే ప్రతి ఒక్కటి బోలుగా వున్న ఉత్త గాలికి
గాటు వేయడానికి
దాని పొడవాటి గోళ్ళతో కూడిన
చేతులను తోస్తుంది!
లక్షలాది మౌనాలుగా నేను
వేరొకరి పాటలో
స్ఫటికపూసల వలె బందీనై ఉన్నాను. ■

## వసంతకాల ముగింపు

**నే**ను మీ ఫోన్ కాల్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు,
ఎవరిని నమ్మాలో నాకు తెలియదు
నువ్వు, నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పేవాడివి..
లేదా లేదు, లేదు, లేదు అని చెప్పే స్వరానివి..
ప్రతి నిమిషం అన్యులుగా విడిపోయి,
సమయానికి శూన్యతను పూరించడానికి
గత మోసాలను సొంతం చేసుకోకుండా ఉండటానికి
వారిలో చాలామంది
ఒక విధమైన ఆట ఆడతారు!

బయట వీధి చీకటిగా
నిద్రపోతున్న అమ్మాయిల అంగాల వలె
తేమగా ఉంది
లైట్లు ఆరిపోతాయి..
రాత్రి మొదలవుతుంది..
రంగులు మారడం తప్ప, ఇంకేముంది?
కాబట్టి నా ఇంద్రియాలు విఫలం కావచ్చు..
మృత్యువు లాంటి రాత్రి ఎదురు కావొచ్చు.
నేను ఒంటరిగా వెనుకకు, లోపలికి
రహస్యంగా అడుగులు వేస్తూ,
ఇంతకు ముందు ఎవరూ నడవని బాటలను
ఎంచుకుంటూ ప్రయాణిస్తాను

నా భయం మార్పు గురించిన భయం
నాకు నేనే మళ్ళీ నమ్మించుకొని,
నువ్వు తరచూ చేసేది
నాకేం సహాయం చేయదు
ఎందుకంటే రక్తం కూడా
రంగు- మార్పును పొందుతుంది
బహిర్గతమవుతుంది
వసంతం
నిర్జలీకరణం చేసిన ద్రాక్షపండు లాగా..
ఇప్పుడు టెలిఫోన్‌లో నీ స్వరం..
ఈ ప్రేమ అంతా భయాన్నే ఇచ్చేట్లయితే,
ఈ ప్రేమ వల్ల ఉపయోగం ఏమిటి?

నువ్వు నీలో నిద్రపోతున్న
తుఫానుల భయానివే అయితే ,
నా భయం నేను నిన్ను బాధపెడతానని? ■

## కథ



# అతనెవరు?

ఉర్దూ మూలం : **శిరీన్ నియాజి**
అనువాదం : **రంగనాథ రామచంద్రరావు**

**కొం**దరు అతన్ని బన్సీ పాండే అని పిలిస్తే, మరికొందరు హైదర్ అలీ అంటారు. కొందరికి అతను కేవలం ఖాన్ అనే పేరుతో తెలిసివుంటే, మరికొందరు అతన్ని జోసఫ్ అనే పేరుతో పిలుస్తారు. వీధిలోని చిన్నపిల్లలు అతనికి సిఐడి అని పేరు పెట్టారు. అయితే అతని నిజమైన పేరేమిటో ఎవరికీ తెలియదు.

మొదట్లో అతను ఈ వీధిలోకి వచ్చినపుడు అతని ముఖం మీద శ్రమజీవి కళ ఉండేది. అతను గులాబీఛాయలో ఉండేవాడు. అతని కళ్ళు బూడిదరంగులో, కాంతివంతంగా, తెల్లవారి కళ్ళల్లా రహస్యమయంగా ఉండేవి. అతని ముక్కు ఇరానీయనుల ముక్కులా ఉండేది. ఎత్తు పఠానుల్లా, అతని తీరు రాజస్థానీయుల్లా. అతను నీళ్ళను 'నీల్లు' అని అనేవాడు. లేదా వినేవారికి అలా వినిపించేది.

అతను మొదటిసారి మా గుమ్మంలోకి వచ్చి నిలుచున్నప్పుడు మేము అతన్ని సైనికుడని అనుకున్నాం. అందుకు కారణం అతను సైనికులు వేసుకునే దుస్తుల్లాంటివే ధరించాడు. కొందరు అతను జైలు నుంచి తప్పించుకుని వచ్చిన ఉగ్రవాదుల్లో ఒకడని ఋజువు చేయడానికి ప్రయత్నించారు. దానికి ఆధారంగా రోజూ టివీ, రేడియోల్లో అలాంటివారిని పట్టించినవారికి బహుమతులు అని వస్తున్న ప్రకటనలు చూపారు. అయితే అతని వాస్తవ వివరాలు ఎంత ప్రయత్నించినా తెలియక పోవటంతో, వీధి వాళ్ళందరూ అతన్ని పిచ్చివాడిగా భావించి మౌనం వహించారు. చాలా నెలలవరకు అతని గొంతును ఎవరూ వినలేదు. అతను గంటలకొద్దీ గుమ్మంలో నిలుచునేవాడు. లేదా వేచి చూసి వెళ్ళిపోయేవాడు. ఆడవాళ్ళు అతనంటే భయపడేవాళ్ళు. వేసవి మధ్యాహ్న సమయాల్లో ఆడవాళ్ళు తమ తమ ఇళ్ళ తలుపులను బిగించుకుని ఉండేవారు. కొన్నిసార్లు హెూటల్‌వాళ్ళు అతని చేతుల్లో పకోడీలో, ఏదైనా స్వీటో వేసేవారు. అతను మౌనంగా వాటిని తినేవాడు.

అయితే ఇప్పుడు అతని ముఖం మీద మునుపటి కాంతులు లేవు. అతని దుస్తులు పూర్తిగా మురికిపట్టాయి. గోళ్ళు బాగా పెరిగాయి. అతని జుత్తు దుమ్ముధూళితో అట్టలు కట్టాయి. పెరిగిన గడ్డం, మీసాలతో అతని ముఖం మూసుకుపోయి, స్పష్టంగా కనిపించటం లేదు. ఇప్పుడు అతను నిజంగానే పిచ్చివాడిలా కనిపించసాగాడు. రాను రాను ప్రజలు, ముఖ్యంగా ఆడవాళ్ళు అతన్ని పిచ్చివాడిగా, బికారీగా భావించి పుణ్యం సంపాదించాలనే ఉద్దేశ్యంతో మిగిలిపోయిన అన్నం, రొట్టెలు ఇవ్వసాగారు.

ఒక రోజు అతను మా ఇంటిగుమ్మంలో నిలుచుని, "నీల్లు కావాలి నీల్లు..." అన్నాడు.

అది వేసవిలోని నిప్పులు కురిసే మధ్యాహ్న సమయం. నేల పొగలు కక్కుతోంది. నేను కిటికీలోంచి తొంగి చూశాను. అతను మా ఇంటి గేటుమీద తలవాల్చి నిలబడివున్నాడు. బహుశా వడగాలి దెబ్బలతో అతని ముఖం కాలిపోతోంది. నుదుటి మీద నుంచి చెమట బిందువులు నీటి బిందువుల్లా రాలుతున్నాయి. ఇంట్లో ఆ సమయంలో నేను, అమ్మ తప్ప ఇంకెవరూ లేరు.

"బహుశా అతను దాహంతో ఉన్నట్టున్నాడు. అతనికి నీళ్ళు ఇవ్వు. దాహంతో ఉన్నవారికి దాహం తీర్చడం వల్ల పుణ్యం వస్తుంది" అంది అమ్మ.

నేను సంకోచించడం చూసి, "ఇటివ్వు, నేనే ఇస్తాను" అని అమ్మ మళ్ళీ అంది.

అమ్మ లోటాలో నీళ్ళు తీసుకునిపోయినప్పుడు, అతను తన అరచేతులను చూసుకుంటున్నాడు. ఆ అరచేతుల్లో పిండి ఉంది. అది చూసి నేను అల్యూమినియం లోటా తీసి అమ్మకు

ఇచ్చాను.

నీళ్ళు తాగి అతను చాలా సంతృప్తిగా కనిపించాడు. మా ఇంటి నుంచి బయలుదేరి, దారిలో వస్తున్న ఒక మేకకు ఆ పిండిని తినిపించాడు. మేక అతని అరచేతిని చాలాసేపటివరకూ నాకుతూ ఉండిపోయింది. వీధిలోని పిల్లలు అతను ఎప్పుడూ అలాగే చేస్తుంటాడని చెప్పారు. ఏదైనా పండిన ఫలం దొరికితే తానే తినేవాడు. ధాన్యపు గింజలు దొరికితే ఆవులకో, మేకలకో పెట్టేవాడు. చిల్లర నాణేలు దొరికితే అతను ఎవరికో ఇచ్చేసేవాడు. లేదా మందిరం, మసీదు మెట్ల మీద పెట్టేవాడు.

మొత్తానికి ఆ రోజు నుంచి అతను నీళ్ళు తాగడానికి మా ఇంటికి వచ్చేవాడు.

అన్నం ఎక్కడ తిన్నప్పటికీ నీళ్ళకు మాత్రం మా ఇంటికే వచ్చి తాగేవాడు.

ఒక మధ్యాహ్నం అతను మా గుమ్మంలోకి వచ్చి "రొట్టె పెట్టండమ్మా రొట్టె..." అని కేక పెట్టాడు.

"మొహరం మాసం. అతన్ని ఖాళీగా పంపకు. తినడానికి ఏదో ఒకటి తప్పకుండా పెట్టు" అంది అమ్మ.

ఇంట్లో అప్పుడు కేవలం రెండు ఎండిపోయిన రొట్టెలే ఉన్నాయి. రొట్టెకు చేసిన ఆక్కూర ఉదయమే అయిపోయింది. నిజానికి ఆ రెండు రొట్టెల్ని నేను మా కోళ్ళ కోసం దాచిపెట్టాను. వాటికి గోధుమ గింజలు ఎంత పెట్టినా సంతృప్తి చెందేవి కావు. అవి నా వెనుకే తిరుగుతూ నా పాదాల మీద ముక్కులతో పొడిచేవి. వాటి కోసం దాచిన ఆ రొట్టెలు తీసి నేను అతనికి ఇచ్చాను. అతను చేతులు ముందుకు చాపినప్పటికీ, ఆ సమయంలో తల తిప్పి ఎందుకో ఆకాశం వైపు చూస్తున్నాడు.

అతను ఆ రొట్టెలను చూడకుండానే, "మిర్చీ" అన్నాడు.

నేను పది పన్నెండు పచ్చి మిరపకాయల్ని తెచ్చి రొట్టెల మీద వేశాను. అవి చాలా కారం ఉన్న మిరపకాయలు. అతను రొట్టెలు తినకుండా తొడిమతో సహా ఒట్టి మిరపకాయలే తిన్నాడు.

అది చూసి నేను అమ్మతో "నిజంగానే పిచ్చివాడమ్మా" అన్నాను గుసగుసగా.

ఆ రోజు మా నాలుగవ పొరుగింటి ఆమె, మూడవ పొరుగింటి ఆమెతో రహస్యంగా 'అతను ముసల్మాను' అని ప్రకటించింది.

"నీకు ఈ విషయం ఎలా తెలిసింది?" అని మూడవ ఇంటి ఆమె అడిగింది.

అప్పుడు నాలుగో ఇంటామె "అతను ముసల్మాను అనటానికి ఋజువును నేను కళ్ళారా చూశాను" అంది.

మూడో ఇంటి ఆమె తరువాత గొప్ప రహస్యమైన ఊహతో 'అతను ముసల్మాను' అనే విషయాన్ని వివరంగా చెప్పింది.

"సరే అతనికి రొట్టెలు పెట్టడం మంచిదే అయ్యింది" అంది అమ్మ.

"ఎందుకమ్మా, ఇతర మతస్థులవారికి రొట్టెలు ఇవ్వకూడదా? వాళ్ళు ఆకలితో ఉన్నప్పటికీ" అని అడిగాను.

నేను అమ్మ జవాబుతో సంతృప్తి చెందలేదు. అందువల్ల నేను జవాబు కోసం మొత్తం ధర్మగ్రంథాల్లో అన్వేషించే ప్రయత్నం చేశాను. ఇతే నా ప్రశ్నకు జవాబు ఎక్కడా దొరకలేదు. ఎందుకంటే అన్నింట్లోనూ వాటివాటి ప్రాధాన్యతలు తెలపబడి వున్నాయి"

ఒక రోజు కాలేజీకి చెందిన యువకులు అతన్ని నలువైపులా కమ్ముకున్నారు. ఎందుకంటే అతను భూమిమీది దుమ్ములో ఏవో పిచ్చిపిచ్చి రాతలు రాస్తున్నాడు. అందులో ఉర్దూ ఉంది. ఇంగ్లీషు ఉంది. హిందీతోపాటు సంస్కృతమూ, అరబ్బీ కూడా ఉన్నాయి. యువకులందరూ అతన్ని "నీ పేరేమి?" అని అడిగారు.

అతను కొద్దిసేపటి వరకు ఆకాశంలోకి చూశాడు. తరువాత తనలో తాను అనుకున్నట్టు "నేను ఏసుక్రీస్తును" అన్నాడు.

యువకులందరూ అతని మాటలకు పగులబడి నవ్వారు. ఒకరు మరొకరితో అన్నారు, "ఇప్పుడు ఇతని కోసం మనం శిలువను తయారు చేయాలి"

మళ్ళీ అతను, "నేను మూసాను" అన్నాడు.

నవయువకులు ఇప్పుడు చప్పట్లు కొట్టారు. "మిత్రులారా, మనం ఇతని కోసం కొహినూర్ వెతుకుదాం. (కొహినూర్ పర్వతంపైనే మూసా అనే పేరుగల ఒక పైగంబర్ భగవంతుని దర్శనం పొందారు).

"నేను నానక్‌ను. నా లోపల రాముని నివాసం ఉంది" అతను తనలో తాను వాగసాగాడు.

మూఢ నమ్మకాలు కలిగిన వారందరూ తమతమ వాకిళ్ళ తెరిచి బయటికి తొంగి చూశారు.

అతను నలువైపులా తిరుగుతున్నాడు. గాలితో మాట్లాడుతున్నట్లు, "నేను ఏసుక్రీస్తును. మూసాను, నానక్‌ను. నాలోపల రాముడు నివసిస్తున్నాడు" అన్నాడు. అతను ఈ మాటలు అనగానే నలువైపుల నుంచి జనం అతని మీద విరుచుకుపడ్డారు. అందరూ కలిసి అతన్ని తీవ్రంగా కొట్టారు. అతని తల నుంచి రక్తం కారసాగింది. అతని దుస్తులు చిరిగి పీలికలు అయిపోయాయి. జనం అతన్ని ద్వేషం నింపుకున్న చూపులతో చూసి, తమతమ ఇళ్ళ వైపు వెళ్ళిపోయారు. అతని గాయాల నుండి ఇంకా రక్తం కారుతూవుంది. అతను నేల మీదినుంచి పిడికెడు మట్టిని తీసుకుని తన గాయాలపై పూసుకున్నాడు.

ఆ సంఘటన తరువాత అతను రెండు రోజులపాటు కంటికి కనిపించనే లేదు.

నాకు అతని గురించి విచారం కలగసాగింది. పాపం, ఆకలితో ఉన్నాడేమో. బతికి వున్నాడో లేదా ...

"మొహరం నెలలో అతను దాహంతో చనిపోకుండా ఉండాలి...ఆ దురదృష్టవంతుడికి ఆ రోజు మనస్సుకు ఏమి తట్టిందో తెలియదు..." అని అమ్మ గొణుగుతూవుంది.

మూడవ రోజున అతను మళ్ళీ మా ఇంటి గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు. తల వెనుకభాగాన్ని మా లాన్ గేట్ మీద వాల్చి ఆకాశంలో ఏదో వెతుకుతున్నాడు, అతని చేతులు గేటు ఊచల మధ్యలోంచి మా తలుపుల వైపు చాపబడ్డాయి.

అమ్మ లోటా నిండుగా నీళ్ళు తెచ్చి గేటు పిట్టగోడ మీద పెట్టింది. అతను వెంటనే నీళ్ళలోటా తీసుకుని ఒక్క గుక్కలో నీళ్ళన్నీ తాగేశాడు. నీళ్ళు తాగి అతను మళ్ళీ నీళ్ళ లోటా ముందుకు చాపాడు. దాని అర్థం అతనికి ఇంకా నీళ్ళు కావాలి. ఈ సారి అమ్మ పెద్ద లోటాలో నీళ్ళు తెచ్చింది. అతను నీళ్ళు తాగుతూ ఖాళీ లోటాను ముందుకు చాపుతూ పోయాడు. ఆ రోజు అతను పూర్తిగా పన్నెండు లోటాల నీళ్ళు తాగాడు.

నేను మూడు రోజులుగా మిగిల్చిన ఆరు రొట్టెలు, గుప్పెడు మిరపకాయలు అతని దోసిట్లో వేశాను. అటు తరువాత అతను చాలా నెలల వరకు కనిపించకుండా పోయాడు. అమ్మ ప్రతి రోజూ అతని గురించి అడిగేది. నేను కొన్ని రోజులపాటు అతని భాగం రొట్టెలు తీసిపెట్టాను. అయితే అతను రాకపోవటంతో పొరుగింటి ఆవుకు రొట్టెలన్నీ పెట్టి వచ్చాను.

ఆ రోజుల్లో వీధిలో ఉద్రిక్తతా దుప్పటి పరుచుకుని ఉంది. ఇరుగుపొరుగు ఒకరినొకరు భయంభయంగా చూసుకునేవారు. ఒకరితో మరొకరు ఎప్పుడూ పోట్లాటకు సిద్ధంగా ఉన్నట్టు కనిపించేవారు. ఎక్కడపడితే అక్కడ దాడులు, కొట్లాటలు జరగసాగాయి. ఉత్తర, దక్షిణాలు, పూర్వ పశ్చిమాలు, అన్ని వైపుల నుంచి వేడిగాలుల కెరటాలు వీస్తుండేవి. ఒక పొరుగింటి వాడు మరో పొరుగింటివాడి చూపులతో చూపులు కలిపి మాట్లాడం మానివేశాడు. కొందరి క్వార్టర్సు ఖాళీ అయి పోయాయి. ఆ క్వార్టర్స్ వాళ్ళు తమ గ్రామాలకు వెళ్ళిపోయారు. పిల్లలకు సెలవులు ఇచ్చారు. బడులు, కాలేజీలు మూసివేశారు.

చాలా నెలలు గడిచిపోయాయి. ప్రతిరోజూ దినపత్రికలోని పుటలు ఏదో ఒక గొడవ, కొట్లాటల వార్తలతో నిండివుండేవి. అయితే మనుషుల పనులు ఎక్కడ ఆగుతాయి? ఆగినా కొంత కాలం వరకే. అంతే. అదే విధంగా బడులు కాలేజీలన్నీ మళ్ళీ తెరిచారు.

ఒక రోజు అతను కూడా కనిపించాడు. ఆ రోజు ఏ ఆలోచనతో నేను గేటు దగ్గర నిలబడ్డానో? పక్కనే అమ్మ కూడా ఉంది. ముందుగా అమ్మనే అతన్ని చూసింది. అతను తన పక్కన ఓ కాయితాల కట్టను భద్రంగా పెట్టుకుని ఉన్నాడు. అదే సమయంలో కాలేజి యువకుల గుంపు అక్కడికి వచ్చి చేరింది. కాలేజి మా క్వార్టర్లకు కొద్ది దూరంలోనే ఉంది. అందువల్ల కాలేజి అబ్బాయిలు, అమ్మాయిలు అందరూ మా ముందు నుంచే తిరిగేవారు. అతన్ని చూసి చాలామంది యువకులు అటువైపు పరుగెత్తారు. అతని పక్కన ఉన్న కాయితాల కట్టను చూసి, "ఖాన్ స్కూల్ పాసయ్యాడు. ఇప్పుడు కాలేజికి వచ్చాడు" అని అరిచారు. అందరూ ఆ మాటలకు నవ్వుతూ నవ్వుతూ అతని దగ్గర్నుంచి కాయితాల కట్టను లాక్కున్నారు. తరువాత అకస్మాత్తుగా అందరి నవ్వులు ఆగిపోయాయి. బహుశా నలువైపులా నిశ్శబ్దం కమ్ముకున్న కారణంగా వీధి విచిత్రంగా కనిపించసాగింది. హఠాత్తుగా యువకుల నవ్వులు ఆగిపోవటం కన్నా, ఒకరు మరొకరికి వణికే చేతులతో ఆ కాయితాలను చూపటం ఆశ్చర్యం కలిగించింది.

నేను మరికొంత ముందుకు పోయాను. మా పొరుగింటి ఆమె తమ ఇంటి కిటికీ నుంచి బయటికి తొంగి చూడటానికి ప్రయత్నించింది. అయితే నన్ను చూసి వెంటనే లోపలికి వెళ్ళిపోయింది. యువకులు కాయితాలన్నిటిని అతని ముందు పెట్టారు. అతను ఆ కాయితాలను గబగబా ఏరుకుని ఒకచోట పోగుచేశాడు. తరువాత వాటిని కళ్ళ దగ్గరికి తెచ్చుకున్నాడు. వాటిని గుండెలకు గట్టిగా హత్తుకుని మెల్లమెల్లగా నది వైపు నడవసాగాడు. అవి అవే కాయితాలు, మతకలహాలలో పరస్పర ద్వేషాలను ప్రకటిస్తూ చింపివేయబడినవి. నిజానికి అవి వివిధ మత గ్రంథాల పుటలు. ■


**సాహిత్యప్రస్థానం**

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను**

**సంప్రదించండి.**

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : కుమార స్వామి

1. 'నాదబ్రహ్మ' బిరుదాంకితుడు' ఎవరు?
   1) రామదాసు 2) త్యాగయ్య 3) క్షేత్రయ్య 4) అన్నమయ్య
2. 'శ్రీకృష్ణ కర్ణామృతం' ప్రబంధ కర్త ఎవరు?
   1) శంకర కవి 2) వెలగపూడి వెంగయామాత్యుడు 3) రామరాజు రంగప్పరాజు 4) నాదెండ్ల గోపన
3. 'సాంబోపాఖ్యానం' కర్త ఎవరు?
   1) రామరాజు రంగపురాజు 2) దానేరు కోనేరునాథ కవి 3) శంకర కవి 4) నాదెండ్ల గోపన్న కవి
4. 'చంద్రభాను చరిత్ర' రచన ఎవరిది?
   1) తరిగొప్పుల మల్లన 2) హరిభట్టు 3) ఎడపాటి ఎర్రన 4) చిన తిమ్మన
5. 'సిద్దేశ్వర చరిత్ర'కు మరో పేరు ఏమిటి?
   1) సిద్దేశ్వర మహత్యం 2) ప్రతాపచరిత్రం 3) కాకతీయ రాజవంశావళి 4) పైవన్నీ
6. 'నరపతి విజయం' కర్త ఎవరు?
   1) విశ్వనాథనాయకుని స్థానాపతి 2) అందుగుల వెంకయ్య 3) రావణూరి వేంకటాచార్యుడు 4) వేంకటాచార్యుడు
7. కుమార ధూర్జటి రచన ఏది?
   1) పెద్దన విజయం 2) తిమ్మన విజయం 3) ధూర్జటి విజయం 4) కృష్ణార్జున విజయం
8. 'శకుంతలా పరిణయం' కర్త ఎవరు?
   1) రేవణూరి వేంకటాచార్యుడు 2) కుమార ధూర్జటి 3) బాల సరస్వతి 4) ముదరాజు రామన
9. 'లక్షణ సార సంగ్రహం' కర్త ఎవరు?
   1) వెల్లంకి తాతం భట్టు 2) చిత్రకవి పెద్దన 3) వేంకటాచల కవి 4) లక్ష్మణ కవి
10. 'పరతత్త్వ రసాయనం' వేదాంత గ్రంథకర్త ఎవరు?
    1) ఈశ్వర ఫణిభట్టు 2) తురగా రాజకవి 3) అయ్యంకి బాలసరస్వతి 4) పైవేవీ కాదు
11. తెలుగు కావ్యాలను మొదటగా వ్యాఖ్యానించింది ఎవరు?
    1) వేదం వెంకటరాయశాస్త్రి 2) తాపీ ధర్మారావు 3) ముదరాజు పెదరామన 4) లింగమకుంట తిమ్మకవి
12. రఘునాథ నాయకుని తెలుగు రచనలెన్ని?
    1) 5 2) 7 3) 9 4) 11
13. విక్రమార్క చరిత్ర కర్త ఎవరు?
    1) రంగరాయ కవి 2) సిద్ధన మంత్రి 3) జక్కన 4) ఏకామ్రనాథుడు
14. 'సౌభరి చరిత్ర' కర్త ఎవరు?
    1) ఏకామ్రనాథుడు 2) చెన్నశౌరి 3) రాయలు 4) ప్రౌఢదేవరాయలు
15. 'హరిశ్చంద్రోపాఖ్యానం' రచన ఎవరిది?
    1) జక్కన 2) శంకర కవి 3) అయ్యలరాజు 4) ఎవరూ కాదు
16. రాజా మల్లారెడ్డి రచన ఏది?
    1) షట్చక్రవర్తి 2) శివధర్మోత్తరం 3) పద్మపురాణం 4) పైవన్నీ
17. కృష్ణార్జున సంవాదం' కర్త ఎవరు?
    1) సంకుసాల నృసింహకవి 2) నాదెండ్ల గోపన 3) రుద్రకవి 4) మల్లన
18. దేనిని ప్రథమాంధ్ర సంగ్రహ రామాయణంగా పరిగణిస్తారు?
    1) రంగనాథ రామాయణం 2) భాస్కర రామాయణం 3) ఉత్తర రామాయణం 4) మొల్ల రామాయణం
19. 'ప్రతాప చరిత్ర' రచన ఎవరిది?
    1) జక్కన 2) మంచన 3) ఏకామ్రనాథుడు 4) గోపన
20. 'అర్థమెల్ల దోచకుండ గూఢ శబ్దములను గూర్చి వ్రాసినచో అది మూగ చెవిటి వారి ముచ్చటగును' అనే అభిప్రాయమెవరిది?
    1) తిక్కన 2) శ్రీనాథుడు 3) మొల్ల 4) కంకంటి పాపరాజు

**జవాబులు :** **1.** 2) **2.** 2) **3.** 1) **4.** 1) **5.** 4) **6.** 2) **7.** 4) **8.** 1) **9.** 2) **10.** 1) **11.** 3) **12.** 3) **13.** 3) **14.** 2) **15.** 2) **16.** 4) **17.** 2) **18.** 4) **19.** 3) **20.** 3)

## కవితలు



### అమరిక

నీ స్వప్నంలో చెట్లు దుఃఖిస్తాయి.
నువ్వు ఆకులా రాలాననుకుంటావు.
ఎన్నో రోజులు
పగటి వెలుతురూ కప్పబడి
దిగులు పొదల నడుమ
బిక్కచూపువై..

అయినా,
ఎంతో చీకటిన
ఎవరో దీపమై మెదులుతారు
ఎందుకో
రంగువై చూసి
మిన్నకుంటావు
మరెప్పుడో ఒక పచ్చని స్వప్నం
ఇక అప్పుడు
ఆకు తొడిగాననుకుంటావు

అప్పుడు నీ నిండా
నవ్వీ ఏడ్చీ ఒకే ఆకాశం
పలు ఇంద్రచాపాలై పుష్పిస్తూ ...


**- బండి అనూరాధ**

### పెనుగాలి వీస్తోంది!

క్షేమ సమాచారం రాయమన్నావు
అంతా సవ్యంగానే వుంది
భిక్షాపాత్ర లేక భిక్షువులు
దోసిలిపట్టి బిక్షమెత్తుతున్నారు
రెండు మూళ్ళు ఎనిమిదని
ఇరవై ప్లస్ ఇరవై అరవయ్యని
బడిపిల్లలు చదువుతున్నారు!
ఉన్నత విద్య విద్యార్థులు
పేరు వింటేనే కులం గుర్తించి
కులగణన చేస్తున్నారు!
పన్నులు పెంచినా
పెంపుపై పెంపు పెరిగినా
పరుగులు తీస్తూ చేతులు
ఖజానాకు మోకరిల్లుతున్నాయి!
నడక నిషేధమై
రోడ్డు నిర్మానుష్యమైతే
దీర్ఘ తపస్సు తాపసులై
ఇంట గడ్డాలు పెంచుతున్నారు!
పరశురాముడికి
నిద్రాభంగం కలక్కుండా
పురుగు తొలిచి తొడరక్తం స్రవిస్తున్నా
నిబ్బరంగా కూర్చున్న రాధేయుడిలా
ధీమసంగానే వున్నారు!
చీకటి చప్పట్లు కొడుతుంది
వెలుక్కి ఉరేసినందుకు
తన అర్ధ సామ్రాజ్యం
అఖండ సామ్రాజ్యమౌతున్నందుకు!
అంతా నిలకడగానే వుంది
సూర్యుడు ఇటు పడమర ఉదయించి
అటు తూర్పున అస్తమించినా
ఉత్తర దక్షిణ దిక్కులు
కరతాళ ధ్వనులు చేస్తున్నాయి!
అంతా సజావుగానే వుంది
ఐనా కాస్త అలజడిగానే వుంది
చెట్ల కొమ్మల్లో కూసే పక్షులు
రహదారుల్లో గూళ్ళు కట్టి
రాగాలు తీస్తున్నాయి
మలయమారుతంగా సాగే గాలి
పెనుగాలై వీస్తుంది!

**- అడిగోపుల వెంకటరత్నం**
98480 34930

మైసూరు పర్యటన 2



# ప్రకృతి ఒడిలో పయనం ... కూర్గు విహారం!

- డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
94407 32392

కూర్గులో ఒకచోట సూర్యాస్తమయ దృశ్యం

మైసూరులో మేము ఎక్కడెక్కడికి వెళ్ళాం? ఎవరెవరిని కలిశాం? రాజేశ్వరి ఉమేశ్, హంసావేణుగోపాల్ గార్లు పలు దఫాలుగా ఫోనులో చర్చించి ఏ పూట మైసూరులోని ఏ ప్రత్యేక వంటకం ఎపవిడు తినాలో నిర్ణయించేశారు గనుక, మొదటి రోజు (2023 జనవరి 12) 'ముల్ బాగల్ దోసా సెంటర్'కు వెళ్లి ఆ ప్రత్యేక వంటకాన్ని తిని ఆనందించాం. కోలారు దగ్గర వున్న ఊరు 'ముల్ బాగల్'. పలమనేరు తర్వాత బెంగళూరు వెళ్ళేదారిలో వచ్చే ఈ ఊరి వారే సుప్రీం కోర్టు జడ్జి వెంకటాచల, కన్నడ సాహిత్య వేత్త డి.వి.గుండప్ప, హీరోయిన్ సౌందర్య. ముల్ బాగల్ నుంచి ఈ దోసె మొదలై, బెంగుళూరు దాకా వ్యాప్తి చెంది, ఇపుడు కర్ణాటక అంతా విస్తరించింది!

సంక్రాంతి జనవరి 15 కనుక ముందు రెండు రోజులు 'కొడగు' (కూర్గు) వెళ్ళాలని జనవరి 13వ తేదీ ఉదయం మైసూర్ నుంచి టాక్సీలో నేను, హంసా బయల్దేరాం. ఉమేష్‌కి ఇంకా రెండున్నరేళ్ల సర్వీసు వుంది, సెలవు దొరకలేదు కనుక ఆ దంపతులు మాతో రాలేకపోయారు. మైసూరు నుంచి నేరుగా మడికెర (మర్కెర అనేది బ్రిటిష్ వారు వాడిన పేరు, కూర్గు ప్రాంతం) ప్రాంతానికి బయల్దేరి వెళ్లాం. మొదట కొడుగు ప్రాంతపు గిరిజనులు (కొడవ) పంటల దేవత అయిన 'ఇగ్గుతప్ప' (Iggu thappa) దేవాలయానికి వెళ్లాం. ఇది ఘాట్ సెక్షన్ లో పయనించే దారి. పశ్చిమ కనుమల్లోని బ్రహ్మ గిరి పర్వత శ్రేణులివి!

తొలి మజిలీ ఇగ్గుతప్పా! కొడగు భాషలో 'ఇగ్గు' అంటే ధాన్యం, 'తప్పా' అంటే ప్రసాదించే దేవుడు. మైసూరు నుంచి ఆ దశగా ప్రయాణమే చాలా హాయిగా అనిపించింది. ఎందు కంటే అది ప్రకృతి ఒడిలో పశ్చిమ కనుమలలో వుండే పర్వత ప్రాంతం. నిజానికి ఊటీ కన్నా ఈ ప్రాంతమే బావుంది. ఎందుకంటే జనసమర్ధం, పర్యాటకుల తాకిడి ఈ పాతికేళ్ళలోనే సంభవించిన పరిణామాలు. ఊటీకి ప్రచారం ఎక్కువ. ప్రకాశం జిల్లాలో 'ప్రకాశం' అనే ఓ పట్టణం లేదా నగరం లేనట్టే కూర్గు ప్రాంతంలో ఆ పేరుతో ఒక పట్టణం గానీ, గ్రామం గానీ లేదు. అయితే ఈ ప్రాంతం వీరులకు, శూరత్వానికి చిరునామా! జనరల్ కరియప్ప ఇక్కడివారే. 1948లో తన పటిమతో, పోరాటంతో లడక్ ప్రాంతాన్ని భారత దేశానికి మిగిల్చిన జనరల్ తిమయ్య కూడా ఇక్కడి వారే. అలాగే సినిమా నటీమణులు రష్మిక, ప్రేమా ఇక్కడి వాళ్ళేనంటారు.

ఇగ్గుతప్పా తర్వాత భాగమండలలోని భగండేశ్వర గిరిజన దేవాలయాన్ని చూసి, అక్కడికి దగ్గరలో ఉన్న, కావేరి జన్మస్థలం 'తలకావేరి' కి వెళ్ళాం. సముద్ర మట్టానికి 1341 మీటర్ల ఎత్తులో పుట్టిన కావేరి మైసూరు దగ్గర ఉన్న శ్రీరంగ పట్టణంలో మనకు కనబడుతుంది. ఈ కావేరి నది క్రమంగా ప్రయాణిస్తూ అనేక ఉపనదులను కలుపుకుంటూ పెద్ద నదిగా మారుతూ తమిళనాడులో మొత్తం 800 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తిరుచురాపల్లి దగ్గిర పుంపుహార్ లో సముద్రంలో కలుస్తుంది. ఈ సంగమ స్థలం పేరు అక్కడ హస్త కళలకు బ్రాండ్ నేమ్. మైసూరు దగ్గర ఉన్నది శ్రీరంగపట్టణ కాగా, తిరుచురాపల్లిలో ఉన్నది శ్రీరంగం. ఇవి రెండూ ప్రసిద్ధి చెందిన, రామానుజాచార్యులతో ముడిపడిన ప్రముఖ శ్రీవైష్ణవాలయ పట్టణాలు. ఇప్పుడు తరచూ కావేరి నదీ జలాలు కన్నడ, తమిళ రాష్ట్రాల మధ్య వివాదాలకు కారణమవుతూ ఉంటాయి.

తలకావేరి వదిలేసరికి మధ్యాహ్నం ఒకటిన్నర అయ్యింది. ఆకలి క్రమంగా పెరుగుతోంది. రాజేశ్వరి ఇచ్చిన చిరుతిళ్ళు ఇక్కడ ఉపయోగపడ్డాయి. అక్కడికి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న మడికెరికు చేరేటప్పటికి రెండున్నర అయ్యింది. అక్కడ బెంగుళూరు పద్ధతిలో

శాకాహారం లభించే 'అడిగా పాకశాల'లో భోంచేసి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'అభిధామ రిసార్ట్సు హోం స్టే' వెళ్లి విశ్రాంతి తీసుకున్నాం. అప్పటికి ఐదున్నర అయ్యింది కనుక, కోట మొదలైనవి చూడకుండా రాజాసీట్ వుండే పార్కుకు వెళ్ళాం. ఆ పార్కులో ఉన్న ఒక ఆసనం మీద కూచుంటే మేఘాలు మనల్ని స్పృశిస్తాయట! అందుకని దానికా పేరు. ఆ విషయం తెలియదు గానీ, ఆ తోట రకరకాల పూలతో చాలా శోభాయమానంగా వుంది! ఈ పుష్ప శోభను మించిన మరొక కళాత్మక అనుభవం సూర్యాస్తమయం!


కనువిందు చేసే కాఫీ పండ్ల గుత్తులు

అనంతపురం జిల్లాలో కొండలమధ్య అస్తమించే దబ్బపండులాంటి సూర్యుణ్ణి చాలాసార్లు చూశాను. గోవాలోని డౌనాపోలాలో సూర్యుడు క్రమంగా సముద్రంలోకి అంతర్థానమవుతాడు. ఆ దృశ్యాలు కూడా అద్భుతంగా వుంటాయి. అయితే మర్కెరలో సూర్యుడు క్రమంగా వెండిరంగు నుంచి బంగారం రంగులోకి మారిపోతూ ఆకాశంలోనే అదృశ్యమవుతాడు. క్రమంగా ఆకాశం కూడా లేత నీలిరంగు, ముదురు ఎరుపులోకి మారిపోతూ ఎంతో మనోహరమైన అనుభవాన్ని ఇచ్చింది. నావరకు ఆ ఉద్యానవనంలో గడిపిన గంట కాలం అమర క్షణాల సముదాయం. ఐదారేళ్ళ క్రితం మదరాసులోని అడయారు బీచిలో సూర్యోదయాన్ని పదహైదు, ఇరవై ఫోటోలుగా మొబైల్‌తో బంధించాను. ఇప్పుడు మర్కెర సూర్యాస్తమయాన్ని 40 ఫోటోలలో నిక్షిప్తం చేసి ఫేస్‌బుక్ మిత్రుల కోసం ఉంచాను.

మడికెర దగ్గర మేము విడిది చేసిన రిసార్ట్సు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ సాయంకాలం ఆ రిసార్ట్సు యజమాని చిద్విలాస్ మా ఉమేష్‌కు మిత్రుడు. రెండు దశాబ్దాల క్రితం మర్కెరాలో ఆకాశవాణి కేంద్రం మొదలైనప్పుడు తొలి దశలో పనిచేసిన అధికారులలో మా ఉమేష్ ఒకరు. అప్పటికి చిద్విలాస్ స్థానికంగా 'శక్తి' అనే కన్నడ దినపత్రికను మాత్రమే నిర్వహించేవారు. నేను ఫోన్‌లో మాట్లాడినప్పుడు చాలా ఆదరంగా స్పందించి మరుసటి రోజు ఉదయం వచ్చి కలుస్తానని చెప్పి, మరో సూచన చేశారు. ఉదయం కాఫీ తాగిన తర్వాత కాఫీ తోటల్లో ఒక్కసారి వ్యాహ్యాళిగా వెళ్ళిరమ్మన్నారు.

ఉదయం ఏడు గంటల ప్రాంతంలో కాస్త నడిచి వెడితే ఒక అద్భుతమైన ప్రకృతి ప్రపంచం మా అనుభవంలోకి వచ్చింది. నాలుగేళ్ళ క్రితం తిరుపతిలో ఉన్నప్పుడు కేరళ ప్రాంతపు మున్నారు వెళ్ళివచ్చాం. మున్నారులో తేయాకు తోటలు విపరీతంగా వుంటాయి. అక్కడ రంగురంగుల పూలు మరెన్నో కనబడతాయి. అయితే తేయాకు సేద్యంలో అదనుకు వచ్చాక ఆకులు సేకరించడం, ఎండబెట్టడం, కత్తిరించడం మాత్రమే ప్రధానం. వందేళ్ళకో, వందేళ్ళ పైబడిన తర్వాతనో తేయాకు తోట లోపలి వేళ్ళతో సహా పూర్తిగా తీసేసి కొత్తగా వేస్తారు. అయితే ఇక్కడ ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే వందేళ్ళపాటు పెరిగిన టీ చెట్ల వేళ్ళు చాలా రకరకాలుగా వంగి విచిత్రమైన ఆకారాలు కలిగి దృఢంగా వుంటాయి. ఆ వేళ్ళతో చాలా రకాల గృహ అలంకరణ సామగ్రి తయారవుతుంది. అలా 2018లో తెచ్చిన ఒక టీ చెట్టు వేరుతో చేసిన బొమ్మ ఇప్పటికీ మా దగ్గర వుంది.

టీ తోటలకు విభిన్నంగా కాఫీ తోటలు కనబడ్డాయి. కాఫీ తోటల్లో మిరియాల తీగలు తప్పనిసరిగా వుంటాయి. తేయాకు తోటలకు అవసరమైనంత ఎత్తు, కాఫీ తోటలకు అక్కరలేదు కానీ, మిరియాల తీగలు, ఆ మిరియాల తీగలు పాకడానికి సిల్వర్ ఓక్ చెట్లు చాలా అవసరం! ఈ చెట్లు పొడవుగా వుండి గాలులనీ, వర్షాన్నీ నియంత్రించి కాఫీతోటలని కాపాడతాయి కూడా. కాఫీ మొక్కల పూలు, అప్పుడప్పుడే వస్తున్న గింజలు, ముదురుతున్న గింజలు ఒకవైపు వుండగా, మిరియాలు కూడా పచ్చివీ, పాకం పట్టినవీ, నలుపు తిరిగినవీ మనకు కనబడతాయి. అలాగే అక్కడ కాఫీ గింజలు ఎండబెట్టడం కూడా చూశాము. ఆ రిసార్ట్సులో ఇంకా కొందరు వున్నా... మేమున్న కాఫీ తోటలో ఉన్న గంట వ్యవధిలో ముగ్గురు, నలుగురు కన్నా ఎక్కువ కనబడలేదు. వారికి ఈ చెట్ల సొగసు గురించి కానీ, ఈ ప్రకృతి సౌందర్యం గురించి కానీ తెలియదని అనుకోవాలి. లేదా ఆ రిసార్ట్సు వారు చెప్పక పోయి ఉండాలి. కాఫీ తోట నుంచే నేరుగా డైనింగ్ హాలుకి వెళ్ళే సదుపాయం వుంది కనుక వేడి వేడి టిఫిను హాయిగా తిన్నాం. ముందురోజు రాత్రి సరైన తిండి లేదనే అసంతృప్తిని ఈ టిఫిన్ మాఫీ చేసింది.

అంతలో 'శక్తి' పత్రిక యజమాని, సంపాదకుడు చిద్విలాస్ వచ్చి ఆ రోజు పత్రిక సంచికను నాకు బహూకరించి కాసేపు మాట్లాడి వెళ్ళారు. పిమ్మట మా లగేజి సద్దుకుని దాదాపు పది గంటల ప్రాంతంలో రిసార్ట్సు నుంచి



బయలుకుప్పెలో బౌద్ధ క్షేత్రం


మర్కెర వెళ్ళాం. అక్కడ ఓ పావుగంట 'శక్తి' దినపత్రిక ఆఫీసుకెళ్ళి ముచ్చటించుకుని నిసర్గధామం వెళ్ళాం. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిర్వహించే ఈ నిసర్గ ధామంలో ఓ సరస్సు, అందులో బోటింగ్ సదుపాయం, ఇంకా కొన్ని జింకల వంటి వన్యమృగాలు వున్నాయి. అయితే నిసర్గ ధామంలో కన్నడ వాళ్ళ కన్నా మళయాళీ స్కూలు పిల్లలు గుంపులు, గుంపులుగా చాలా మంది కనబడ్డారు. టిక్కెట్లు కొనే స్థలంలోనే 200 మంది దాకా పిల్లలని చూసి వెళ్ళనక్కరలేదని వెనక్కి వచ్చాం. అక్కడ నుంచి కుశాలపుర వచ్చి భోజనం చేసి 'బయలుకుప్పె' బయలుదేరాం.

ప్రపంచంలో టిబెట్ తర్వాత ధర్మశాలలో టిబెటిన్ సంతతి వారు ఎక్కువగా వున్నారు. ధర్మశాల తర్వాత ఎక్కువ సంఖ్యలో టిబెటన్లు ఈ బయలుకుప్పె ప్రాంతంలో కనబడతారు. ఇది మైసూరుకు 80 కిలోమీటర్ల దూరంలో వుంది. 1960 నుంచి ఈ ప్రాంతానికి టిబెట్ వాసులు కాందిశీకులుగా రావడం మొదలైంది. దాంతో వారికోసం ఉచితంగా చదువు చెప్పే వెసులుబాటు కల్పిస్తూ ఆరోగ్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఇది అక్కడ ఇప్పుడు 70 వేల మంది మంది టిబెటన్లు స్థిరపడ్డానికి అవకాశం కల్పించింది. గోల్డెన్ టెంపుల్‌గా పిలవబడే నామ్ డ్రోలింగ్ మొనెస్ట్రీ ఇప్పుడు ఎంతోమందిని ఆకర్షిస్తోంది. 2016లో ఈ మొనెస్ట్రీను దలైలామా ప్రారంభించారు. ఇది చాలా ప్రధానమైన ఆకర్షణగా మారిపోయింది. మోనెస్ట్రీని చూసిన తర్వాత, నేరుగా మైసూరు సాయంకాలం ఐదు గంటలకి చేరిపోయాం.

కూర్గ్గా నుంచి తిరిగి వచ్చిన రోజు రాత్రి, ఉమేష్ దంపతులతో కలిసి కువెంపు నగర్‌లో ఉండే ఇంటిలో నిర్వహించే జొన్న రొట్టెల హోటల్‌లో భోజనం చేయాలని వెళ్ళాం. జొన్నరొట్టెలతో పాటు కలిగిన మరో ఆనందం ఏమిటంటే పుంగనూరుకు చెందిన, పెళ్ళి కారణంగా 60 ఏళ్ళక్రితం మైసూరు వచ్చి స్థిరపడిన రచయిత్రి సుశీల, భర్త నాగరాజుతో సహా వచ్చి కలవడం! వారు నాకు ఫేస్బుక్ ద్వారా ఐదారేళ్ళుగా పరిచయం, ముఖాముఖి కలవడం ఇదే ప్రథమం. కన్నడ నుంచి తెలుగుకు, తెలుగు నుంచి కన్నడంలోకి అనువాదాలు చేసే సుశీలా నాగరాజు ఒక దశాబ్దం క్రితం ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేశారు. ఆ దంపతుల కబుర్లు వింటూ జొన్నరొట్టెలు ఆరగించాం. గుల్బర్గా ప్రాంతంలో కందిపప్పు బదులు వేరుశనగ గుళ్ళు వేసి తయారు చేసే హోళిగను కూడా మేము రుచి చూశాము!

ఇక్కడ ఉన్న సమయంలో గమనించిన విషయం ఒకటి పంచుకోవాలి. కన్నడం మీడియంగా మొదలైన ఇంజనీరింగ్ కోర్సులకు విద్యార్థుల కొరత చాలా ఉందని ఒక వార్తాంశాన్ని చూశాను. ఇది మూడేళ్ళుగా సాగుతున్న సమస్య. తొలి దశలో ఇటువంటి సమస్యలు ఇలానే ఉంటాయి. ఎంతో శ్రమపడితే కానీ దారి సుగమం కాదు. తెలుగులో ఇలాంటి ప్రయత్నాలు మొదలు కాలేదు కనుక మనకు ఈ అనుభవ పాఠాలు చాలా అవసరం.

**(ఇంకా ఉంది)**



కావేరీ నది పుట్టిన చోటు



# బహుముఖ ప్రతిభాశాలి రచయిత్రి రామలక్ష్మి

- తెలకపల్లి రవి

**2023** మార్చి రెండవ తేదీన కన్నుమూసిన కె.రామలక్ష్మి తొలి తరం పాత్రికేయురాలు, రచయిత్రి. ఆనాటి మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగు సాహిత్య ప్రతినిధిగానే గాక స్నేహశీలిగా విస్తృత పరిచయాలతో ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రముఖ రచయిత, పరిశోధకుడు ఆరుద్ర సతీమణిగా ఆయన అపార కృషికి అండదండలందించారు. ఇప్పటి కాకినాడ జిల్లా కోటనందూరులో 1930 డిసెంబర్ 31న పుట్టిన రామలక్ష్మి బి.ఎ పట్టభద్రురాలు. అప్పటికే ఆంధ్ర ఆంగ్ల భాషలలో ఆమెకు మంచి పట్టుండేది. ఖాసా సుబ్బారావు సంపాదకత్వంలోని స్వతంత్ర పత్రిక ఆంగ్ల విభాగంలో ఆమె పనిచేశారు. తెలుగులో గోరా శాస్త్రి చూస్తుండేవారు. అప్పట్లోనే ఆమె సమీక్షలు రాసేవారు. సి.నారాయణరెడ్డి కొత్తలో రాసిన 'నవ్విన పువ్వు' కావ్యాన్ని సమీక్షిస్తూ 'ఈ కవి నవ్వని పువ్వు' అని రాయడం చాలామంది చెప్పుకునేవారు. గేయం రాయాలి నేను గేయం రాయాలి అని వర్ణిస్తూ ఒక కవిత రాస్తే ఆమె తన సమీక్షలో అదేదో రాసేస్తే అయిపోతుంది కదా అని చమత్కరించడాన్ని ఆయనే నవ్వుకునేవారు. ఆ రోజుల్లో కృష్ణశాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ వంటి వారితో బాగా సన్నిహితంగా మెలిగేవారు. 1954లో శ్రీశ్రీ, టాకీపులి హెచ్.ఎం రెడ్డి సాక్షి సంతకాలతో ఆమెకూ ఆరుద్రకూ పెళ్లి జరిగింది. వారికి ముగ్గురు కుమార్తెలు.

1954లోనే ఆమె తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' ప్రచురించారు. ఆ రోజుల్లోనే ఆరుద్రకు సన్నిహితుడైన ప్రసిద్ధ రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి సూచనతో నవలా రచనవైపు మళ్లారు. ఈ గాజులు తొడిగించుకునే కథలు ఎన్ని రాసినా ఒకటే, కొత్త పంథా వైపు మరలడానికి ప్రయత్నించు అని ఆయన అన్నారని ఆమే చెప్పుకున్నారు. ఆ క్రమంలో రూపొందిన పార్వతీ కృష్ణమూర్తి కథలు సాహిత్యాభిమానుల అమితాదరణ పొందాయి. ఈ జంట తెలుగు సాహిత్యంలో నిలిచిపోతుంది చూడండని ఆయన మెచ్చుకున్నందుకు చాలా సంతోషించారట. ఆ సలహా తన ఆలోచనా ధోరణిని మార్చిందని కూడా చెప్పుకున్నారు. ఆంధ్రపత్రికలో రామలక్ష్మి ప్రశ్నలు జవాబుల శీర్షిక చాలా ప్రసిద్ధి. మాలతీ చందూర్ ఆంధ్రప్రభలో ప్రమదావనం పేరిట ఇచ్చే జవాబుల కన్నా రామలక్ష్మి ఆధునికంగా స్పందించేవారు. చెన్నైలో చివరి వరకూ వారు స్నేహంగా ఉన్నారు. స్త్రీల సమస్యల గురించి లేదా తర్వాతి కాలంలో స్త్రీవాదం గురించి చర్చలు మొదలవడం కన్నా బాగా ముందే రామలక్ష్మి జీవితంలోనూ, సాహిత్యంలోనూ మహిళల గొంతు వినిపించారు.

శ్రీశ్రీ ఆరుద్రల బంధుత్వం, సాహిత్య సాన్నిహిత్యం రీత్యా ఆ కుటుంబానికి చాలా దగ్గరగా వుండేవారు. అయితే వ్యక్తిగత అలవాట్లే గాక రాజకీయ సిద్ధాంతాల రీత్యా కూడా రామలక్ష్మి ఆయనతో విభేదించారు. ఆమె అభ్యుదయ సాహిత్య శిబిరంలో కీలక పాత్ర వహించిన వ్యక్తి కాదు. శ్రీశ్రీతో వివాదపడేవారు. అయితే కుటుంబాల పరంగా ఎందరికో మరీ ముఖ్యంగా మహిళలకు దగ్గరగా ఉండేవారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత తల్లి సంధ్యతో స్నేహం కారణంగా ఆమెను చిన్నప్పటి నుంచి చూశారు. ఆరుద్ర 'గూఢచారి 116' చిత్రంలో తనకు పాట రాస్తే జయలలిత ఎంత సంతోషించిందని చెబుతుంటారు. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, అలనాటి అనేకమంది దర్శకులు, రచయితలు, సంగీత దర్శకులు వారి స్నేహితులే. సుందరయ్య గారి గురించి చాలా గౌరవంగా చెప్పేవారు. భానుమతి, బాపు రమణ, ఎన్టీఆర్ సతీమణి బసవ తారకం వంటి వారి గురించీ అనేక విషయాలు చెప్పేవారు. సినిమా రంగంలో స్త్రీల పరిస్థితి ఆమెను ఆవేదనకు గురిచేసింది. ప్రసిద్ధ కవులు, రచయితలు, ప్రచురణకర్తల భార్యల దుస్థితిని బాహాటంగా విమర్శించేవారు. ఆత్రేయ భార్య వంటలు చేసి బతకడం వంటి పరిస్థితి జీర్ణించుకోలేకపోయారు. మలి దశలో రాసిన 'వెలిసిపోయిన

దాంపత్యాలు' నవలలో ఈ తరహా జీవితాలను చిత్రించారు. 70, 80 దశకాలలోని రచయిత్రుల్లో ఒకరుగా వున్న రామలక్ష్మి ఆ అంశాలను ప్రస్తావించారు.

ఆరుద్ర సినిమాలకు పాటలు, మాటలు రాస్తే రామలక్ష్మి కథలు సమకూర్చారు. వాటిలో విశ్వనాథ్ తీసిన 'జీవన జ్యోతి', దాసరి నారాయణరావు 'గోరింటాకు' ముఖ్యమైనవి. 'జీవన జ్యోతి' చిత్రానికి 1975లో నంది పురస్కారం అందుకున్నారు. దాసరి కథా విభాగంలో సహకరించేవారు. వాణిశ్రీ ఆమెకు బాగా సన్నిహితం. గోరింటాకు కథలో కీలక కథాంశం రంగనాయకమ్మ రాసిన 'ఇదే నా న్యాయం' అన్న కథను పోలి వుండటంతో కోర్టు వివాదం నడిచింది. శోభన్ బాబు ఆమెను బాగా అభిమానించే వారు.

ఎవరినైనా ముక్కుసూటిగా విమర్శించే రామలక్ష్మి ధోరణి కొందరికి రుచించేది కాదు. అయితే అభివృద్ధి నిరోధకంగా, పాలకులకు వంతపాడటం చేసిన వ్యక్తి కాదామె. శ్రీశ్రీతో జరిగిన వాదవివాదాలలో ఆమెను ఆయన తాటకేశ్వరి అని పేర్కొన్నారు. ఆ తర్వాత శ్రీశ్రీని ఇకపై ఏమీ అనబోనని ఆమె ఆరుద్రకు మాట ఇచ్చారట. అయితే తన రెండవ కుమార్తె రౌద్రి కవిత్వానికి ఆయనతో ముందుమాట రాయించుకోవడానికి స్వయంగా కలిసి అడగటానికి ఆమే వెళ్లారు. ఆయనా చాలా అభిమానంగా రాశారు! రామలక్ష్మి సెన్సార్‌బోర్డు సభ్యురాలుగా దీర్ఘకాలం పనిచేశారు. ఆ విధంగా ఎందరో నిర్మాతలకు సాయపడ్డారు. కరుణానిధి రాసిన కన్నగి నవల హక్కులు తీసుకుని అనువాదం చేశారు. సాహిత్యం లోతుపాతులు, గుణదోషాలు చక్కగా అంచనా వేసేవారు.

నాటి మద్రాసులో ఆరుద్ర, రామలక్ష్మి మద్రాసు పరిచయం గల తెలుగువారికి, సాహిత్య సినీ జీవులకు పెద్ద దిక్కుగా వుండే వారు. ఆమె ఆయనను అబ్బాయ్ అంటే ఆయన రామా అనేవారు. చివరి వరకూ వారు అలాగే అన్యోన్యంగా జీవించారు. 1985లో ఆయన షష్టిపూర్తికి ప్రజాశక్తి 'ప్రజాకళలు ప్రగతివాదులు' పుస్తకం ప్రచురించింది. ఆ కాపీలు తీసుకుని మద్రాసు వెళ్లి రాణీ సీతల్ హాలులో జరిగిన వేడుకల్లో పాల్గొన్నాను. ఈ అబ్బాయి, అమ్మాయి అని సినారె వారిని సంబోధిస్తే హాలు కరతాళ ధ్వనులతో మార్మోగింది. ఆయనకు డయాలిసిస్ అవసరమైన సమయంలో హైదరాబాదులో వుండి చికిత్స జరిపించారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం ప్రజాశక్తి ప్రచురించిన సందర్భంగా నేను అప్పుడప్పుడు కలిసేవాణ్ని, ఆరుద్ర విజయవాడ వచ్చినప్పుడల్లా బొమ్మారెడ్డి గారితో పాటు వెళ్తుండేవాణ్ని. తను కమ్యూనిస్టు కాకున్నా రామలక్ష్మి గారు ఎంతో ఆదరంగా చూసేవారు. తర్వాతి కాలంలో చంద్ర బాబు ప్రభుత్వ హయాంలో తెలుగు అకాడమీ సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాలను ప్రచురించింది. ఆమె వాటిని మరోసారి సరిచూసి అందంగా తీసుకొచ్చారు.

2018లో ఈ రచయితకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె




**కుటుంబ చిత్రం**
**తమ ముగ్గురు కుమార్తెలతో ఆరుద్ర, రామలక్ష్మి**

అనేక విషయాలపై తన అభిప్రాయాలు అనుభవాలు చెప్పారు. ప్రస్థానంకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ తను అభ్యుదయ భావాలకు వ్యతిరేకిని కానని స్పష్టం చేశారు. నిజానికి యూట్యూబ్‌లో ఆమె ఇంటర్వ్యూ ప్రసారమయ్యే వరకూ ఆమె హైదరాబాదులో ఉంటున్నట్టు దాదాపు ఎవరికీ తెలియదు, అందులో ఒక పదం అనుకున్నట్టు ఎడిట్ కాకపోవడంపై విమర్శలు వచ్చాయి గాని ఆమె ఆ వయసులో అంత దృఢంగా స్పష్టంగా అభిప్రాయాలు చెప్పడం సంచలనం సృష్టించింది. యూట్యూబ్‌లో సైతం బాగా ట్రెండింగ్‌లోకి వచ్చి తమిళనాడులోనూ వైరల్ అయింది. ఇప్పటికీ అది నడుస్తూనే వుంటుంది. అయితే తర్వాత మళ్లీ ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వలేదు.

ఇటీవల ఆరో ముద్రణ పొందిన *శ్రీశ్రీ జయభేరి* ఆరుద్రకు అంకితమిచ్చాను. ఈ విషయం రామలక్ష్మి గారికి చెప్పి మొదటి ముద్రణ కాపీ అందజేస్తే ధన్యవాదాలు చెప్పారు. వెంటనే చదివేసి బాగా రాశావయ్యా అన్నారు. చివరివరకూ బాగా పుస్తకాలు పత్రికలు చదువుతుండేవారు. ఎవరి మీదా ఆధారపడకుండా ఒంటరిగా సహాయకురాలి తోడుతో జీవితం గడిపారు. ఆరుద్ర ఆఖరి కోర్కె ప్రకారం ఆయన మరణానంతరం ఎలాంటి హడావుడి లేకుండా అంత్యక్రియలు పూర్తి చేసిన రామలక్ష్మి తనూ అలాగే ఎవరికీ కనిపించకుండా సెలవు తీసుకున్నారు. పెద్ద కుమార్తె కవిత ఆరు మాసాల పాటు దగ్గరుండి సపర్యలు చేస్తూ తుది వీడ్కోలు పలికారు. ప్రపంచానికి చెప్పడం తమ బాధ్యత గనక చెప్పానని ఆమెను పరామర్శించినపుడు చెప్పారు. ఆ తర్వాతే మీడియాకు తెలిసింది. రెండవ కుమార్తె, కవయిత్రి రౌద్రి అయిదారేళ్ల కిందటే క్యాన్సర్‌తో కన్నుమూశారు. మరో కుమార్తె విదేశాల్లో ఉన్నారు.

ఆమెను కేవలం ఆరుద్ర సతీమణి అని మాత్రమే కొందరు రాయడం చాలామందికి మింగుడు పడకపోవడం సమర్థనీయమే. డెబ్బై ఏళ్లనాడే రచనలు చేసిన ఆధునిక మహిళగా, బహుముఖ ప్రతిభామూర్తిగా, ఆరుద్రకు తోడు నిలిచిన సహచరిగా రామలక్ష్మి గారు చిరకాలం గుర్తుంటారు. ■

## సమీక్ష






# అనిర్వచనీయ భావుకుడు ఎమ్వీ రామిరెడ్డి

- బి.మదన మోహన్ రెడ్డి, సారిపల్లి నాగరాజు
పరిశోధక విద్యార్థులు,
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ,
99898 94308, 80083 70326.

**మా**నవ సమాజానికి శాస్త్రవేత్తల, వైజ్ఞానికుల శోధన ఎంత అవసరమో, కవిత్వం కూడా అంతే అవసరమని బలంగా విశ్వసించే ఫ్రెంచ్ కవి సింజున్ పర్స్‌ని 'మీరు కవిత్వం ఎందుకు రాస్తున్నారు?' అని అడిగితే ... 'ఇంకా బాగా బతకడానికి' అని బదులిచ్చేవారట! మనుషులు బాగా బతికేలా చేయగల శక్తి కవిత్వానికి ఉందా? ఉన్నత మానవ విలువలు విశ్వవ్యాపితమై భూగోళం నిత్య శోభాయాత్రలో వర్ధిల్లేలా సంస్కరించే సత్తా కవిత్వానికి ఉందా? అంటే ఉంది అనే సహేతుక సమాధానం ప్రతి సందర్భంలో దొరుకుతూనే ఉంది. కవిత్వం మానవ ప్రగతికి సోపానం అని కచ్చితంగా చెప్పొచ్చు అని నమ్మిన వారిలో ఎమ్వీ రామిరెడ్డి గారొకరు.

రామిరెడ్డి అనుభూతి తీవ్రత కలిగిన రచయిత. తన రచనల్లో మావనవతవాదం ప్రస్ఫుటంగా వ్యక్తీరించబడుతుంది. 1997లో తన రచనా వ్యాసంగాన్ని 'బిందువు'తో ఆరంభించి వరసగా 'మనిషి జాడ' (2009), 'అజరామరం' (2015) అనే కవితాసంపుటాలతో పాటు 'వెన్నలో లావా' (2011), 'వెంట వచ్చునది' (2018), 'స్పర్శవేది' (2021) అనే కథాసంపుటాలను వెలువరించాడు. ఇప్పుడు కొత్తగా 'అనిర్వచనం' (2022) అనే నాలుగో కవితా సంపుటిని తీసుకొచ్చారు. 'అనిర్వచనం'లో మొత్తం 46 కవితాఖండికల సమాహారం. ఇందులో ప్రధాన కవితా వస్తువులుగా రైతు సంఘర్షణలు, నిర్జీవ యాంత్రికజీవనం, నేటి విద్యావిధానం, ప్రకృతితో అనుభూతి చెందిన సందర్భాలు, వృత్తి జీవితంలో గమనించిన నవీన జీవన ధోరణలపై రాసిన కవితలే అధికంగా ఉన్నాయి.

మనసుని సహచరిగా అర్థం చేసుకొనే వయసులో నుంచి పలికే కవిత్వం జీవితానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. ఎమ్వీ రామిరెడ్డి ఐదుపదుల వయసులో రాసిన 'అనిర్వచనం' ఈ కోవకు చెందినదే. తన సుదీర్ఘమైన జీవితంలో ఎన్నో శరత్ – శిశిరాలను దాటుకుని స్వయంగా ఎదిగి విజయ వసంతాలను సొంతం చేసుకొన్న అక్షరరూపం ఈ 'అనిర్వచనం'. దేశానికి రైతులు ప్రధానం. కానీ ఈ దేశంలో అభివృద్ధి విస్తరణ వల్ల మొదట కుచించుకు పోయేది రైతాంగమే. రాష్ట్ర విభజన అనంతరం నూతన రాజధాని అమరావతి అనగానే అక్కడ... 'మట్టిలో వరిమళ్లు మాయమయ్యాయి/ సున్నం గళ్ళు కళ్ళు విప్పాయి/ గజాలు డాలర్ల ట్యాగులు తొడుక్కున్నాయి/ పొలాల వెంట వేలంపాటలు మొదలయ్యాయి/ గట్లు మీద నోట్లకట్ల పాములు బుసలు కొట్టాయి/ కుశలప్రశ్నలు సైతం డబ్బు కంపు కొట్టాయి" (మట్టి రోదన) అని ఆవేదన చెందారు.

అధికార మార్పిడి అనంతరం 'అయిదేళ్ళ రంగాలంకరణకు తెరదించుతూ/ ఇంకొకాయన వచ్చాడు... గుప్పిళ్ళతో తీసుకొని మూడు దిక్కులకూ విసిరాడు" తప్పితే జరిగినమేలేదో తెలీక "రాజధానిని తలగుడ్డలా చుట్టుకొని/ మా ఊరి మట్టి వింతగా నవ్వింద'ని స్థానికుడిగా అక్కడ గమనించిన పురో'గతి'ని తేటతెల్లం చేశాడు. రామిరెడ్డిది రైతు కుటుంబం. పండించే 'పత్తిచేనులో నూతన వస్త్రంలా కనిపించాల్సింది' పోయి 'ఉరితాడులా'మారి చెట్టుకు ఊగిన జీవితాల్ని ప్రత్యక్షంగా చూసి భరించాడు. అన్నం పెట్టేవాడి సమస్యలు తీర్చవల్సిన 'బాధ్యతాయుతమైన వ్యవస్థ' మరిచిపోయి వాటిని పెంపొందిస్తే 'తలపాగాలు తల్వారులై తలుపులు బద్దలుగొట్టక మునుపే నాగళ్ల ఘోషను చట్టబద్ధం చెయ్యాల్సి ఉంద'ని చైతన్యంతో హెచ్చరించారు. ఇవేకాక ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత తెలిపే 'మట్టి మళ్లీ నవ్వుతోంది', సాగు చట్టాలను ఆక్షేపించే 'నాగళ్ల ఘోష', ఆత్మహత్యల గాయాలను చూపే 'దగ్ధాంతరంగం' కవితలు కవి ఎవరి వైపో తెలుపుతున్నాయి.

'ఆధునిక' వ్యామోహంతో మనిషి మనసు బండిని అనుబంధాల

స్టాపుల్లో ఆపుకోలేనంత వేగంగా సంచరిస్తున్నాడు. అందుకు ధనదాహమొకటే కారణమని పేర్కొనలేం. జీవన సవాళ్లు, మానసిక ఆందోళనలు, మధ్యతరగతికుండే అభద్రతలు 'వేగం' పెంచమనే చెబుతున్నాయి. ఈ ఉరుకులాటలో సహచరితో కూడా సంభాషించ లేని యాంత్రిక బతుకు దీనతను 'కలవని వేళలు' అనే కవితలో...

"విధుల ముళ్ళు విదిలించుకుని
ఇంట్లో అడుగు పెట్టాక కూడా
గాయాల బాధ మాయం కావటం లేదు
అడపాదడపా వంటగదిలో విడుదలయ్యే నవ్వులు
ప్రెషర్ కుక్కర్ మూతదాటి బయటికి రావడం లేదు
భోజనాల వేళ మాటలమెతుకుల మధ్య
మునుపటి విశేషాల ముద్దులు గొంతు దిగటం లేద'ని

మనసులోనే గూడుకట్టుకు పోయిన స్థితిని లోలోనే మధనపడ్డారు.

మాటకు మహత్తరమైన శక్తి ఉంటుంది. అది కంటికి కనిపించ కుండానే ఎదుటివారిలో నెత్తురుని చిందించగలదు. చిరునవ్వుని పుట్టించగలదు. అది నచ్చినవారితో అయితే పూల పుప్పొడిలా ఉంటాయి. నచ్చనివారితో అయితే పొడిపొడిగా ఉంటాయి. ఆ మాటల్లో కూడా ఎన్నో రకాలు ఉంటాయి. ఇదే విషయాన్ని 'మాటలన్నీ' అనే కవితలో ...

'మాటలన్నీ రక్తం పంచుకొని పుట్టవు
కొన్ని రంగులు పులుముకొనీ...
ఇంకొన్ని నగ్నదేహాలతో నర్తిస్తూ
మరికొన్ని రక్తరాగ రంజితమై పరిమళిస్తూ..' ఉంటాయని

తన ఉద్యోగ జీవితంలో గమనించిన, ఎదుర్కొన్న 'కార్పొరేట్ రిలేషన్స్' అనుభవానికి అక్షర రూపమిచ్చారు.

దేవుడు ఉన్నాడా? లేడా? అన్నది తరతరాల ప్రశ్న. ఉంటే ఎక్కడ ఉన్నాడు? ఎలా ఉంటాడు? అన్నవి అన్నీ మతవ్యవస్థలు ఎదుర్కొనే ప్రశ్నలు. అసలు అంతర్మథనంలో ఎవరు స్వచ్ఛతను పాటిస్తారో వాళ్ళే దేవుళ్ళు. అలాంటివారికి బయటి గుడులు గోపురాలతో 'అవసరం' లేదు. ఇదే విషయాన్ని 'అంతరాలయం' అనే కవితలో.. "మనసు ద్వారాలు మౌనంగా తెరవాలి

ఒక ప్రక్షాళన గోపురమై ఎదగాలి
సాచిన చేయి ధ్వజస్తంభమై నిలవాలి
నగ్న హృదయం గర్భగుడిలో నిక్షిప్తం కావాలి' అన్నారు. ఈ

కవితలో 'తనను తాను తెలుసుకొంటే తానైపోవు బ్రాహ్మ' వేమన సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తుంది.

మతాల మధ్య, దేశాల మధ్య సంఘర్షణలు ఎక్కువయ్యాయి. అణుశక్తి కలిగిన దేశాలు లేని దేశాలపై పెత్తనంకోసం ఆరాట పడుతున్నాయి. యుద్ధాల వల్ల ఇరుపక్షాల్లో నష్టపోయేది సామా న్యులే. ఈ దురహంకారాలని 'క్షేత్రజ్ఞత' అనే కవితలో...

"రక్తకణాలకు రక్షణ గోడలుండవు
యుద్ధాల వెనక కుట్రలు అర్థం కావు
ఆయుధాలకు ఆర్తనాదాలు వినిపించవు
మానసిక మాంద్యం దెబ్బకు
దేహాల సరిహద్దులు మూతబడతాయి' అని స్పష్టం చేశారు.

యుద్ధానంతర పరిణామాల్ని కూడా ఊహించాలని హితబోధ చేశారు.

రామిరెడ్డి 'అక్షరం' దిద్దుకొంటూనే వయసుకి మించి బాధ్యతలు ఎత్తుకోవాల్సిన సామాన్య మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాడు. ఎలిమెంటరీ విద్య అభ్యసిస్తున్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. 'చుట్టుముట్టిన' అన్ని క్లిష్ట పరిస్థితుల్ని తల్లి తన 'రెక్కల కష్టం' కింద కాపాడుకొంటూ వచ్చింది. తన జీవితాన్ని తీర్చిదిద్దడంలో తల్లిపాత్ర ఎటువంటిదో తెలిపే 'కార్యశీలి' అనే కవితలో ఇలా అంటారు.

"మౌనంగా ఒక చూపు మార్దవంగా ఒక మాట
అంతకుమించి ఏనాడూ హితబోధలు కురిపించలేదు
ఈ చెమట కావ్యాలూ గురుతర వేదాలూ రాసింది
నాన్న కాదు, అమ్మ'నే అని తండ్రి స్థానం కూడా తల్లిదే అని

తేటపరుస్తున్నారు. 'నిజం భుజం మీద' అనే కవితలో గ్రామీణ మనస్తత్వం కలిగిన ఈ కవి బతుకు బాటలు పట్నం వైపు తెరుచుకొన్నాయి. అంతా మనవారే వాతావరణం నుంచి ఎవరికివారే అన్న నగరంతో సమన్వయం అంత తొందరగా కుదరలేదు. ఆ అసంతృప్తిని నుంచి బయటపడే క్రమంలో కవిత్వాన్ని ఆశ్రయించారు. విలువలు కలుషితమవుతూ సంచరిస్తున్న నేటి మానవ సమూహంలో నటనలు, మోస, మోహాభినయాలు రాజ్యమేలుడాన్ని అనుకరించలేకపోయారు.

"నిజం భుజం మీద
అబద్ధం చెయ్యేసి నడుస్తోంది...
నిజం నిప్పులా కాల్చే క్షణాల ఎడబాటులో
వేషం కట్టిన చీకటి వెలుతురులా విర్రవీగుతోంద''ని

గాయపడుతున్న తన హృదయవేదనలో నేటి జీవితంలో నలిగిపోతున్న సహృదయాలన్ని కనిపిస్తాయి.

ఇవే కాక నేడు జీవితంలో చోటుచేసుకొన్న 'డిజిటల్ కాలుష్యం', పిల్లల బాల్యంలో నిర్జీవం, స్కూల్ ఉండి ప్లే లేని విద్యాభ్యాసం... వంటి సామాజిక రుగ్మతలపైన... తన స్వగతంలో కలిగిన పుస్తక పఠన అనుభూతి, ప్రాజెక్ట్ పనుల్లో గిరిజన ప్రాంతాల్లో వాళ్ళు చూపిన ప్రేమకు కలిగిన అనుభూతి, అనాథలకు వృద్ధాశ్రమం, గ్రామీణ యువతకు స్కిల్ సెంటర్ నిర్వహణలో కలిగిన సంతృప్తిని నింపిన కవితలు సైతం ఉన్నాయి.

బాల్యం నుంచి సాహిత్య అభిలాష కలిగిన ఎమ్వీ రామిరెడ్డి కథారచనలో మెలకువలకై పోరంకి దక్షిణామూర్తిని, జర్నలిస్టుగా బూదరాజు రాధాకృష్ణని, కవిత్వంలో పాపినేని శివశంకర్ గార్ల వద్ద ప్రత్యక్షంగా ఎంతో నేర్చుకున్నానని చెపుతారు. పాపినేని గారిని గురుతుల్యులుగా భావిస్తూ ఈ 'అనిర్వచనం' కవితా సంపుటిని వారికే అంకితం ఇచ్చారు.

పుస్తక స్వగతంలో 'మనిషినిప్పుడు ఆధునిక వ్యామోహావేశం

## కర్నూలులో కవితా పఠనం



ప్రపంచ కవితాదినోత్సవం సందర్భంగా మార్చి 21న సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కర్నూలు లలిత కళాసమితిలో సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన కవితాపఠనం జరిగింది. ఈ కార్యక్రమంలో కవులు జి.వెంకటకృష్ణ, కల్యాణదుర్గం స్వర్ణలత, నాగేశ్వరాచారి, ఏవి రెడ్డి, చౌశా, జీవి సారథి, సయ్యద్ జహీర్ అహ్మద్ , ఆవుల చక్రపాణి యాదవ్ , నాగాంజనేయులు, ప్రమోద్ చక్రవర్తి, ఇనాయతుల్లా , కవితా వెంకటేశ్వర్లు, పఠాన్ సుల్తాన్ ఖాన్ తదితరులు స్వీయకవితలను చదివారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ సందేశమిచ్చారు. కవులకు ప్రశంసాపత్రాలు అందించారు.



**ప్రముఖ కథా, నవలా రచయిత సింహప్రసాద్‌కు కథారుషి మునిపల్లెరాజు సాహిత్య పురస్కారాన్ని మార్చి 19వ తేదీన హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో అందజేశారు. ఈ కార్యక్రమానికి మఖ్య అతిథిగా సాహితీవేత్త వాడ్రేవు వీరభద్రుడు హాజరై, ప్రసంగించారు. సింహప్రసాద్ రచనల్లో సామాజిక స్పృహ, మానవ సంబంధాలూ పుష్కలంగా కనిపిస్తాయని అన్నారు. అనంతరం సింహప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు.**

**మార్చి 26వ తేదీన నెల్లూరు టౌన్ హాల్లో వంశీకృష్ణ గారి రెప్ప వాలని రాత్రి కవితా సంపుటికి పాతూరి మాణిక్యమ్మ స్మారక రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం-2022 ప్రదానం చేశారు. రూ.5000 నగదు అందించి, ఘనంగా సన్మానించారు. ఈ సభలో డా.ఏనుగు నరసింహారెడ్డి, పాతూరి అన్నపూర్ణ, జల్ది విద్యాధర్, ఎ.జయప్రకాష్, తేళ్ళ అరుణ, కుటుంబ సభ్యులు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, కవులూ రచయితలూ పాల్గొన్నారు.**




ఆవహించింది. డిజిటల్ కాలుష్యం టవర్ల కొద్దీ కమ్ముకుంటోంది. మట్టి, మనుగడ కోసం ఆక్రోశిస్తోంది. మనశ్శరీరాలు అదుపు తప్పుతున్నాయి. జీవితం నిస్సారంగా మారుతోంది. ఇప్పుడేది రహస్యం కాదు. అంతా బహిరంగమే. ఈ సంక్లిష్ట సందర్భాల్ని కవిత్వం చేసే ప్రయత్నమే ఈ కవితా సంపుటి ముఖ్య ఉద్దేశ్యా'న్ని ప్రతిఫలించే గట్టి గింజ కవితలకు కొదవలేదు.

రాతకి జీవితపు నడతకి వ్యత్యాసం కలిగిన రచయితలే ఎక్కువ. కానీ ఎమ్వీ రామిరెడ్డి సమాజం ఎలా ఉండాలని స్వప్నిస్తునాడో అలా మారడానికి తనవంతుగా తండ్రిగారి స్మృత్యార్థం 'మువ్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్' (1998)ను స్థాపించి పేద పిల్లలకి ఆర్థికసాయం... మహిళలకు గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్యశిక్షణ... సాహిత్య పుస్తకాల ప్రచురణ... వృద్ధాశ్రమం నిర్వహణ ఇలా రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. there three things in my life to read poetry to write poetry to live poetry ని  పాటిస్తున్నట్టుగా అనిపిస్తుంది.

ప్రాస ఉధృతి, ఊనీక ఉబలాటతకు గురికాకుండా అనుభవం నుంచి ఆర్ద్రత వ్యక్తీకరించిన కవితా సంపుటి ఇది. ప్రముఖ కవి, రచయిత ప్రసాదమూర్తి 'మానవుడి యుగాల స్వప్నం కవి స్వప్నంతో జతకట్టినప్పుడు అంతటా వెలుగు మబ్బులు కమ్ముకుంటాయి. ఒక కొత్త సూర్యోదయపు వెలుగేదో చినుకులు చినుకులుగా కురుస్తుంది. చేతిలో గొడుగు గిరాటేసి ఆ వానలో తడిసి ఒక అపూర్వ అనుభూతి పొందాను ఈ కవితలు చదివి' అన్న ముందుమాటతో సమానంగా పాఠకులు అనిర్వచనమైన భావనల్ని పొందగలరు. ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు, 98667 77870. ■

# పుస్తకాలు



## కార్వేటి నగరం కథలు


**(బాలల బొమ్మల కథలు)**

**రచన : ఆర్.సి.కృష్ణాస్వామిరాజు**

**వెల : 140 పేజీలు : 108**

**ప్రతులకు : 93936 62821**

**ఈ** ఇవి సరదా కథలే కాదు.. బతుకు రహస్యాలు తెలియజేసే గమ్మత్తైన సందేశాత్మక కథలు కూడా. కథల్లోని పాత్రలు కార్టూనిస్టు మాధవ్ వేసిన బొమ్మల రూపంలో నేరుగా మనతో మాట్లాడతాయి. చిత్తూరు యాస, రాయలసీమ మాండలికాలు అలరిస్తాయి. యువరాజు గాడిదను చూసి ఏం నేర్చుకున్నాడు.. ఆమె ఇడ్లీ వ్యాపార రహస్యం ఏమిటి, పెళ్లిరోజున ఆడబిడ్డలకు అమ్మానాన్నలు ఇవ్వవలసిన కానుక ఏమిటి? ఇలాంటివన్నీ తెలుసుకోవాలంటే ఈ పుస్తకం తెరవాల్సిందే..



## ఎండ్లూరి కవనకళ స్మారక స్వరం

**సంపాదకులు : డప్పోల్ల రమేష్**

**వెల : 150 పేజీలు: 167**

**ప్రతులకు : 95509 23323**

**తె**లుగు నేలపై అజరామర కవి ఎండ్లూరి సుధాకర్ గారి స్మారక వ్యాసాల సంకలనం ఇది. ఆయన మరణానం తరం వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాల సంకలనమే ఈ పుస్తకం. ఆచార్య కొలకలూరి ఇనాక్, కత్తి పద్మారావు, డొక్కా మాణిక్య వర ప్రసాద్... వంటి ఎందరో ప్రముఖులు, కవులు స్మారక వాక్యాలు రాశారు. ఎండ్లూరి సుధాకర్ అందించిన సాహిత్యం ఆదర్శనీయమైనదని, సామాజిక అంతరాలు తొలగిపోయి, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం వెల్లివిరియాలన్నదే ఆ రచనల సారాంశమని వారు కొనియాడారు.



## తరగతి గది స్వప్నం (దీర్ఘ కవిత)

**రచన : బాలసుధాకర్**

**వెల : 100 పేజీలు: 50**

**ప్రతులకు : 9676493680, 9505646046**

**'ఈ** దీర్ఘకవిత చూడ్డానికి చాలా చక్కగా, చిన్నగా ఉంటుంది. "ఈ భూమ్మీద గొప్ప ప్రదేశాలు రెండే రెండు. ప్రజల ఆకలిని తీర్చే, శక్తిని కూర్చే పంట భూమి ఒకటైతే, రెండు : నూతన తరాన్ని తయారుచేసే తరగతి గది" అంటారు కవి బాలసుధాకర్. నూతన మానవుని ఆవిష్కరణకు తరగతి గదే ఒక కేంద్రమవుతుందని, అవ్వాలనీ బలంగా ఆకాంక్షిస్తారు. ఈ దేశ తరగతి గదులన్నీ ఫలవర్ధకమైనప్పుడే ఈ కవితకు సజీవత లభిస్తుంది అంటారు రచయిత.



## ఆనంద సాగరం


(ది బుక్ ఆఫ్ జాయ్‌కి సంక్షిప్తానువాదం)

**అనువాదకులు : రావెల సాంబశివరావు**

**వెల : 80 పేజీలు: 96**

**ప్రతులకు : 97034 91619**

**జీ**వితంలో అనివార్యమైన వేదన, బాధల కొలిమిలో నుంచి ఆనందాన్ని ఎలా సాధించాలి అనే విషయం ఈ పుస్తకంలోని ప్రధానాంశం. టిబెటన్ల బౌద్ధ గురువు దలైలామా, దక్షిణాఫ్రికా వర్ణ వివక్ష వ్యతిరేక పోరాట యోధుడు ఆర్చిబిషప్ డెస్మండ్ టుటు వారం రోజుల పాటు జరిపిన సంభాషణ ఈ పుస్తకానికి ప్రాతిపదిక. ఆంగ్ల మూలాన్ని సంక్షిప్తంగా తెలుగులోకి అనువదించారు రావెల సాంబశివరావు.



## కారల్ మార్క్స్ మేధో పరిణామం


**రచన : రోజర్ గరౌడీ**

**తెలుగు అనువాదం : కాత్యాయని**

**వెల : 200 పేజీలు : 304**

**ప్రతులకు : 97034 91619**

**కా**ర్ల్ మార్క్స్ మేధోప్రస్థానాన్ని ఈ పుస్తకం మనకు పరిచయం చేస్తుంది. తత్వశాస్త్రంలో కాంట్ కంటే ఎక్కువగా మార్క్స్ 'కోపెర్నికన్ విప్లవం' సాధించాడనేది ఈ పుస్తక రచయిత అభిప్రాయం. మార్క్స్ ఆలోచనని పరిచయం చేసే గ్రంథాల్లో ఉత్తమమైన వాటిలో ఈ రచన ఒకటి. ఫ్రెంచ్ నుంచి నాన్ అపోతికర్ చేసిన ఆంగ్లానువాదాన్ని కాత్యాయని తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తక రచయిత రోజర్ గరౌడీ 1913లో ఫ్రాన్స్‌లోని మార్సైలో జన్మించారు. 1933 ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. పార్టీలో సిద్ధాంతవేత్తగా గుర్తింపబడ్డాడు.



## భారత దేశంలో రైతు ఉద్యమాలు

**రచన : సారంపల్లి మల్లారెడ్డి**

**వెల : రూ.100 పేజీలు : 96**

**ప్రతులకు : 94900 99378**

**ఏ**డాది కాలం పాటు దేశ రాజధాని సరిహద్దుల్లో, ఎర్రకోట చుట్టూ చేరి రైతాంగం వీరోచిత పోరాటం జరిపిన నేపథ్యంలో వెలువడింది ఈ పుస్తకం. స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతర కాలంలో జరిగిన రైతు ఉద్యమాలను కూడా రేఖామాత్రంగా వివరిస్తుంది. నేడు రైతులు ఐక్యమై పోరాటాల్లోకి వస్తున్నారు. అన్ని వర్గాలు, తరతులు ఇలా ఏకతాటిపైకి వచ్చినప్పుడు ఉద్యమాల విజయం అనివార్యం. ఇదే గత అనుభవం. నేటి ఉద్యమాలకు స్ఫూర్తి దాయకంగా ఉండే ఈ పుస్తకం అందరూ తప్పక చదవల్సినది.

# పుస్తకాలు




## మంచుపొగ (కవిత్వం)

**రచన : ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు**
**వెల : 150 పేజీలు : 102**
**ప్రతులకు : 99511 28566**

**54** కవితల సమాహారం ఈ పుస్తకం. అట్టమీది కవిత్వమైన 'మంచుపొగ' మల్లెతీగ కవితల పోటీలో పురస్కారానికి ఎంపికైంది. జీవితానుభవంతో, అక్షరాల చైతన్యంతో నాగేశ్వరరావు తన ఈ కవితా సంపుటిని వెలువరిచాడు' అంటారు ముందుమాట రాశిన నిఖిలేశ్వర్. సుప్రసిద్ధ కవి సాగర్ శ్రీరామకవచం కూడా ఈ పుస్తకానికి తొలి వాక్యాలు రాశారు. "రచయిత ప్రజాపక్షం వహించి తన ఆర్తిని ఎన్నో కవితలలో చక్కగా పొందుపరిచాడు" అని పేర్కొన్నారు. ఇవి సమకాలీన కవితలు. పచ్చని పంటపొలం బీడువారిన వేదన.. పల్లెలో పక్షుల కువకువలు... ఇంకా పల్లెజీవుల ఆర్తనాదాలు ఎన్నో ఇందులో వినిపిస్తాయి.




## అనుబంధాలు- ఆవేశాలు

**(నవల)**

**రచన : ప్రమీల**
**వెల : 250 పేజీలు : 282**
**ప్రతులకు : 92464 15150**

ఈ నవల రెండు విభిన్న మానవ జీవితాల్ని సమగ్రంగా చర్చిస్తుంది. ఇద్దరు దురదృష్టవంతులైన స్త్రీల జీవితాల కథ ఇది. ఇద్దరి జీవితాల్లోనూ అనూహ్యంగా జరిగిన రెండు మరణాల కారణంగా వారు యావజ్జీవ కారాగార శిక్షకు గురవుతారు. మధ్య తరగతి ఇతిహాసమే నవల.. అనే ఒకానొక నిర్వచనాన్ని చక్కగా నిర్వర్తించింది. ఇందులోని రెండు పాత్రల అంతర్గత భావాలు, సంక్లిష్టమైన, విరుద్ధమైన ఆలోచనలు, విలువలు వ్యక్తీకరించడంలో రచయిత్రి ప్రమీల చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సరళమైన భాషలో ఆయా పాత్రల జీవనశైలిని చక్కగా వ్యక్తీకరించారు.




## ఒక వాక్యం రాలింది (కవిత్వం)

**రచన : లక్ష్మీ కందిమళ్ల**
**వెల : 150 పేజీలు: 131**
**ప్రతులకు : 70938 00303**

ప్రకృతి సహచర్యంలో పరవశిస్తూ, మానవత్వపు పరిమళాలను ఆస్వాదిస్తూ రాసిన కవితలివి. 'ఎన్నో సందర్భాల్లో మనస్సు కరిగి, కదిలి ప్రవహించిన అనుభూతుల ప్రవాహమే నా ఈ వ్రాతంతా. ఇదంతా నా సొంతమూ కాదు. పరాయీ కాదు. నీదీ. నాదీ. అందరిదీ. మనందరిదీ.. కాదంటారా? చెప్పండి?" అని పాఠకునితో సంభాషిస్తూ తొలి వాక్యాలు రాశారు కవయిత్రి లక్ష్మీ కందిమళ్ళ. ఇది అలరించే కవిత్వం.





## మనిషిని వెతుకుతున్నాను

**(వచన కవిత్వం)**

**రచన : నూతలపాటి వెంకటరత్న శర్మ**
**వెల : 60 పేజీలు : 50**
**ప్రతులకు : 98663 76050**

'కవితాత్మకత, దేశీయత, మానవత ముప్పేట అల్లుకొని పాఠకులను అలరిస్తాయి ఈ కవిత్వంలో. మానవత్వం తొణికిసలాడే ఈ సాదాసీదా కవిసత్తమునికి ధన్యవాదాలు' అంటారు ముందుమాట రాసిన డా.ఎన్.గోపి. 26 కవితలున్న ఈ సంపుటిలో ప్రతీదీ అడుగు కనిపించే సరోవరంలా ఉంటుంది.




## పొలి (సేద్యం కావ్యం)

**రచయిత : రాచపాళెం**
**పేజీలు: 65**
**ప్రతులకు : 95150 54998**

రైతుల ఈతి బాధలకు కవితాపరమైన అక్షర చిత్రణే రాచపాళెం చంద్రశేఖరరెడ్డి దీర్ఘ కవిత పొలి. రచయితది సామాన్య రైతు కుటుంబం కావడంవల్ల బతుకుతెరువో కష్టాల కారడవిలో ఒక రైతుగా అన్నదాత కష్టాలను అర్థం చేసుకొని... ఆవిష్కరించిన అక్షరమాల ఈ కవిత. పాలకులు పెట్టుబడిదారీ బుద్ధులతో వ్యవసాయం పట్ల, రైతుల పట్ట బాధ్యతల నుంచి తప్పుకుంటూ సాగును బలితీసుకుంటున్న వేళ 'పొలి' కవిత చదవాల్సిందే. తన పంట మీద తనకు అధికారంలేని, ధర కట్టలేని రైతు దైన్యాన్ని కళ్లుండి చూడలేని పాలన వైనాన్ని ఈ కవిత ఎండగట్టింది.




## ఆ నలుగురూ..! (కథాసంపుటి)

**రచన : బొందల నాగేశ్వరరావు**
**వెల : రూ.130 పేజీలు : 137**
**ప్రతులకు : 95000 20101**

నగటు మనిషి నిజ జీవితానికి ప్రతిబింబం ఈ కథా సంపుటి. సరైన సామాజిక దృక్పథం, కౌటుంబిక నేపథ్యం రెండూ కలిసి ఈ కథల్లో కనిపిస్తాయి. ఈ కథలు కొందరి సమస్యలకు సౌహార్దంగా పరిష్కారాలు చూపిస్తాయి. మంచి ఆలోచనలను, కుంగిన మనస్సులకు ఓదార్పును కలిగిస్తాయి. రచయిత బొందల నాగేశ్వరరావు వృత్తిరీత్యా పోర్ట్‌ట్రస్ట్‌లో విశ్రాంత నిర్వహణాధికారి. ప్రవృత్తిపరంగా కథా రచయిత, నాటకకర్త, బాలసాహితీవేత్త. ఈ కథల సంపుటి కథా ప్రియులను అలరిస్తుంది.

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

జననం : 23.04.1891 మరణం : 25.02.1961



వడ్లగింజలు, అరికాళ్ళకింద మంటలు, కీలెరిగి వాత, కలుపు మొక్కలు, గులాబీ అత్తరు వంటి వీరి కథలు సుప్రసిద్ధం. వీరపూజ, మిథునానురాగము, శ్మశానవాటిక, అనాథ బాలిక, రక్షాబంధనము వంటి రచనలు చేశారు. 'అనుభవాలు-జ్ఞాపకాలు' పేరుతో రాసిన స్వీయ చరిత్ర ప్రసిద్ధ పుస్తకం.

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 4 ■ SANCHIKA - 7 ■ KRISHNA ■ April 2023
RNI NO.APTEL/2004/18396 ■ Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ■ Date of Publication : 27.03.2023

